
# బోల్షివిక్

ఏడిబీ సమాచార పత్రిక
సీపీఐ (మావోయిస్టు)
సంపుటి-11
సంచిక-1
జనవరి-జూన్ 2022



సీపీఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు,
ఎమ్‌ఎమ్‌సీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి
## కామ్రేడ్ దీపక్ కు
అరుణారుణ
వందనాలు

చీకట్లను చీల్చుకొని
మళ్ళీ మళ్ళీ ఉదయిస్తాడు మా కోసం
అందకారపు బతుకుల్లో
మళ్ళీ మళ్ళీ అరుణోదయమవుతాడు మా కోసం
పీడితుల కడుపున పోరుకెరటమై
మళ్ళీ మళ్ళీ పుడతాడు మా కోసం
యువతరం చేతిలో ఆయుధమై
శతృగుండెల్లో మళ్ళీ మళ్ళీ గర్జిస్తాడు మా కోసం

## విషయసూచిక


జగన్ మూడేళ్ళ ప్రజా వ్యతిరేక పాలనా 4

ఏఓబీ ఉద్యమంలో మహిళల పాత్ర 12

పార్టీ 'మూడు పని శైలులు' 20

కుల సమస్య 27

ఎస్ఐబీ 31

రష్యా వర్సెస్ ఉక్రెయిన్ 33

పత్రికా ప్రకటన 36

అమరుల జీవిత చరిత్ర 40

పోరాట స్రవంతి 44













## అమరులకు నివాళి

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధమార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గం వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైనా, పీఎల్‌జీఏపైనా, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుంచి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరమై, 2017 ఫిబ్రవరి నుండి 'సమాధాన్-ప్రహార్' పేర్లతో ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. జనవరి నుంచి జూన్ 2022 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. విప్లవ ప్రజాయుద్ధ కళారంగ యోధుడు కామ్రేడ్ డప్పు రమేష్ (కిరణ్), భారత విప్లవోద్యమానికి గొప్ప సేవలందించిన కామ్రేడ్ ఆలూరి లలితలతోపాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్‌జడ్‌సి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

# జగన్ ప్రభుత్వ మూడేళ్ళ ప్రజావ్యతిరేక పాలనావిధానాలు-ప్రజల కర్తవ్యాలు

2019 'మే'లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగి అప్పటివరకు అధికారంలో ఉన్న టీడీపీ పరాజయం పొందగా, వైఎస్ఆర్‌సీపీ భారీ మెజారిటీతో గెలిచి మే 30న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గడిచిన ఈ మూడు సంవత్సరాల పాలనాకాలంలో ఎన్నికలకు ముందు తమ ఎన్నికల ప్రణాళికలో ప్రజలకిచ్చిన హామిలన్నింటినీ అమలు చేసామనీ, అందులో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసామని ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటూ ప్రజల్ని మరోసారి మోసగించాలని తాపత్రయపడుతున్నది. అయితే ఈ మూడు సంవత్సరాల వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వ పాలన ఆర్థిక, రాజకీయ విధానాలు, సంస్కరణలు ఏ వర్గ ప్రయోజనాలను నెరవేర్చాయో పరిశీలిద్దాం. దీనికి ముందు విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2014లో జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ చంద్రబాబు అధికార పీఠం ఎక్కాడు. అలాగే కేంద్రంలో బీజేపీ నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో చేరి, కేంద్రప్రభుత్వంలో భాగస్వామిగా మారాడు. సామ్రాజ్యవాదులకూ, దేశీయ దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గానికి అనుకూల విధానాలనూ మరియు బీజేపీ హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తూ, దోపిడీ వర్గాలకు తనివితీర సేవ చేసాడు. రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా కేంద్రానికి తాకట్టు పెట్టాడు. 2013-రాష్ట్ర విభజన హామీల అమలుకు పూనుకోలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా డిమాండ్‌ను వ్యతిరేకించాడు. అందుకోసం పోరాడిన ఉద్యమకారులపై నిర్బంధాన్ని అమలు చేసాడు. తర్వాత కాలంలో చంద్రబాబు ప్లేటు ఫిరాయించి ప్రత్యేకహెూదాను డిమాండ్ చేస్తూ, అసలు సిసలు ఉద్యమ నాయకుడుగా ఫోజు పెట్టాడు. ఈ అవకాశవాద ఊసరబెల్లి మళ్ళీ ప్రజలను మోసగించి అధికారంలోకి రావడానికి చూసాడు. ఈయన ఐదేళ్ళ పాలనలో తన అశ్రితులకు చిత్తం వచ్చినట్లు ప్రజల, రాష్ట్ర సంపదను దోచిపెట్టాడు. ఆ కాలంలో రాజ్యహింసకు గురికాని





ఒక్క పీడితవర్గం కానీ, సెక్షన్‌కానీ లేదంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబు అనుసరించిన ప్రజావ్యతిరేక పాలనలో దోపిడీ, పీడన, బాధలకూ, అవమానాలకు గురైన ప్రజలకు చంద్రబాబును గద్దె దింపడం తప్ప మరో ప్రత్యామ్నాయం కనిపించలేదు.

జగన్ తన తండ్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని కూడబెట్టుకొని, తండ్రి మరణం తర్వాత అధికార వ్యామోహంతో ముఖ్యమంత్రి కావాలని ఉవ్విళ్ళూరినప్పటికీ ఆ కల నెరవేరలేదు. ఆ తర్వాత స్వయంగా వైఎస్ఆర్‌సీపీని స్థాపించి అధికారం కోసం 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో సుదీర్ఘ పాతయాత్ర జరిపి ప్రజలకు 'నవరత్నాల' పేరుతో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తాననే హామీలతో ప్రజలను భ్రమల్లో ముంచాడు. అలాగే అధికారంలో ఉన్న టీడీపీ చంద్రబాబు కేంద్రప్రభుత్వానికి లొంగిపోయి, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాడనీ, ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయనీ, యువతకు ఉపాధి లభిస్తుందనీ, వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ప్రత్యేక హోదాను సాధించేవరకు మడమ తిప్పేది లేదని మోసపూరిత ప్రతిజ్ఞలు చేసాడు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాననీ, ఉద్యోగస్తులకు సీపీఎస్ రద్దు చేస్తాననీ, 11వ పీఆర్‌సీని వెంటనే అమలు చేస్తానని హామీలు గుప్పించాడు. రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు, దళితులపై దాడులులేని రాష్ట్రాన్ని నిర్మిస్తానని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపాడు. ప్రజలు, కొందరు ఉదారవాద బూర్జువా మేధావులు కూడా జగన్ ప్రచార హామీల భ్రమలకు గురయ్యారు. దానితో భారీ మెజారిటీతో గెలిచి అధికారంలోకి వచ్చాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే అధికార యంత్రాంగాన్నీ, ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని పటిష్ట పరచడానికి ప్రాధాన్యతనిచ్చాడు. అప్పటివరకు చంద్రబాబుకు అత్యంత విధేయులుగా పని చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కీలక పదవుల నుండి తొలగించాడు. కొందరిపై అవినీతి ఆరోపణలు చేసి చర్యలు తీసుకున్నాడు. మరికొందరిని లూప్‌లైన్‌లో పెట్టాడు. తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రభుత్వ హయాంలో అత్యంత విధేయులుగా సేవలందించి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఐఏఎస్‌లకూ, క్రూరులైన ఐపీఎస్ అధికారులైన తనను నమ్మిన బంట్లకు జగన్ అధికారంలోకి రాగానే కీలక స్థానాల్లో నియమించాడు.

### గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం పేరుతో తన ఆశ్రితులకు దోచిపెట్టే కొత్త నిర్ణయాలకు పూనుకోవడం

జగన్ అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రభుత్వ హయంలో తీసుకున్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను సమీక్షించడానికి నిర్ణయించాడు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంపైనా, పోలవరం డ్యాం నిర్మాణ కాంట్రాక్టుపైనా, రాజధాని నిర్మాణంపైనా, కియా కార్ల కంపెనీకి ఇచ్చిన ప్రోత్సాహకాల నిర్ణయం పైన సమీక్షలకు పూనుకున్నాడు. ఎందుకంటే పై నిర్ణయాలలో వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని ప్రకటించాడు. అయితే వాస్తవంగా ఇటువంటి సమీక్షలు ప్రభుత్వాలు మారినప్పుడల్లా జరిగే తంతులే. అయితే వీటి లక్ష్యం పాతపాలకవర్గ ముఠా చేతిలోని ఆర్థిక వనరులను దెబ్బతీసి, ఆ వనరులను కొత్త పాలకవర్గ ముఠా దక్కించుకోవడానికే. పై లక్ష్యంలో భాగంగానే జగన్, చంద్రబాబుపై సమీక్షల యుద్ధం ప్రకటించాడు తప్ప ఇందులో ఏ మాత్రం ప్రజా ప్రయోజనాలు లేవనేది జగమెరిగిన సత్యమే. పోలవరం కాంట్రాక్టు విషయంలో రివర్స్ టెండరింగ్ పేరుతో చంద్రబాబు నియమించిన నవయుగ సంస్థను తొలగించి, తనకనుకూలంగా ఉన్న మెగా ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించాడు. ఈ నిర్ణయం వల్ల 625 కోట్ల ప్రజాధనం ఆదా అయ్యిందని ప్రకటించాడు. కియాకార్ల కంపెనీకి చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహకాల సమీక్ష పేరుతో ఆ సంస్థపై ఒత్తిడి తెచ్చి జగన్ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ పద్ధతులననుసరించి ఆ సంస్థ నుండి పెద్ద ఎత్తున కమీషన్లు గుంచుకొని మరిన్ని అదనపు

ప్రోత్సాహకాలతో ఆ సంస్థ ఉత్పత్తులకు అనుమతినిచ్చింది. విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందంలో ముఖ్యంగా 7,700 మెగావాట్ల విద్యుత్ కోసం ప్రైవేటు సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందనీ, తిరిగి ఆయా సంస్థలతో కొత్త ఒప్పందాల కోసం చర్చలు జరిపి 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. అయితే ఇది మదుపుదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందనీ, అంటే రాష్ట్ర అభివృద్ధి గమనం మందగిస్తుందని కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతోపాటు వ్యాపార సలహా సంస్థలు కూడా గగ్గోలు పెట్టడం ప్రారంభించాయి. జగన్ ప్రభుత్వం కూడా వ్యాపార సంస్థలను బెదిరించి, వారి నుండి ముడుపులు సాధించడానికే ఈ తంతు నడిపింది. ఎందుకంటే ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైనప్పటి నుంచే విద్యుత్ ఒప్పందాలన్నీ అక్రమాల కుప్పలే. ఆ తేనెతుట్టును కదిలిస్తే గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల, ఆ శాఖ అధికారుల వేలకోట్ల రూపాయల కుంభకోణాలు బయటపడతాయి. అలాంటి సాహసాన్ని ఏ దోపిడీ పాలకవర్గ ముఠా చేయదనేది సత్యం. ఇక రాజధాని విషయంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్ర అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అయితే జగన్ అధికారంలోకి రాగానే రాజధాని అమరావతి భూముల విషయంలో చంద్రబాబు, తన అనుచరులు ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిపారని అరోపిస్తూ, గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ, పాలనా వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యపడుతుందనీ, మూడు రాజధానుల నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో తన పార్టీకున్న మెజారిటీతో ఆ బిల్లును ఆమోదింపజేసాడు. ఈ రాజధాని మార్పులోని అసలు మతలబు ఏమిటంటే అమరావతి రాజధాని నిర్మాణంలో చంద్రబాబు, అతని అశ్రితులు, రియలెస్టేట్ వ్యాపారులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించుకున్న స్థలాలను దెబ్బతీసి, విశాఖలో తాను, తన రియలెస్టేట్ మిత్రుల సంపదను పోగుచేసుకోవడం కోసమే. ఇప్పటికే విశాఖలో ఈ రాబందులు రెక్కలు కట్టుకొని వాలిపోయారు. ప్రజల, ప్రభుత్వ భూములను కబ్జా చేయడం మొదలుపెట్టారు. వాస్తవం ఇది కాగా, వికేంద్రీకరణ, అభివృద్ధి, సమన్యాయాన్ని సాధించడానికనే అసత్యాలను ప్రచారంలో పెట్టారు. దేశ దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం వనరులు ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి దోచుకోవడానికి పాలకవర్గాలు సేవలందించాయి తప్ప, అన్ని ప్రాంతాల (వెనకబడిన ప్రాంతాలను కలుపుకొని)అభివృద్ధికీ, సమన్యాయానికి పాటుపడిన చరిత్ర ఎక్కడా లేదు. ఆయా ప్రాంతాల భౌగోళిక, నైసర్గిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి, అక్కడి నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి ఆయా ప్రాంతాల అభివృద్ధిని చిత్తశుద్ధి, నిజాయితీతో కృషి చేస్తే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, వాటికి సమన్యాయం చేయవచ్చు. కానీ ప్రజలను పక్కదారి పట్టించడానికి పాలనా వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని మోసపు వాదనను ముందుకు తెస్తున్నది. ఇప్పటికీ మూడు రాజధానుల నిర్ణయంపై వివిధ రకాల వాదనలు వినిపిస్తున్నాయి. కానీ ఎవరూ అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను క్షేత్రస్థాయికి వెళ్ళి స్వీకరించడం లేదు. జగన్ ప్రభుత్వం ఈ పని ఎలాగు చేయదు. పైగా దానిని రావణకష్టంలా రగిల్చి కూర్చుంటున్నది. మూడు రాజధానుల ప్రతిపాదన పట్ల గత మూడు సంవత్సరాలుగా ప్రజలలో ఆందోళనలు, కోర్టుల్లో సవాళ్ళు నడుస్తూ, అంతిమంగా హైకోర్టు జోక్యంతో తాత్కాలికంగా 'మూడు రాజధానులు' ప్రతిపాదన రద్దయింది. గడిచిన ఈ మూడు సంవత్సరాల కాలంలో రాజధాని నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఒక్కపైసా కూడా కెటాయించలేదు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అన్ని ప్రాంతాల ప్రజల ఆమోదంతో ఆచరణాత్మక నిర్ణయం తీసుకొని అమరావతిలోనే అసెంబ్లీ, సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేయాలి. అలాగే చారిత్రక ప్రాధాన్యత కలిగిన 'శ్రీభాగ్' ఒడంబడికను దృష్టిలో పెట్టుకొని హైకోర్టు ప్రధాన కార్యలయాన్ని కర్నూల్‌లో నిర్మించాలి. అమరావతి, విశాఖలో కూడా హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలి. జగన్ నిరంకుశ, నియంత పోకడలను వదులుకొని ఈ సమస్యను ఎక్కువ కాలం నాన్చకుండా ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ఆచరణయోగ్యమైన పరిష్కారానికి పూనుకోవాలి.

లక్షలాది మంది ఆదివాసీ ప్రజలను నిర్వాసితులను గావిస్తూ నిర్మిస్తున్న పోలవరం డ్యాం నిర్వాసితులకు పునరావాసం కింద నిర్ణయించిన నష్టపరిహారాన్ని నేటికీ చెల్లించలేదు. డ్యాం నిర్మాణ ఎత్తు ఒకేసారి పూర్తికాదు, గనుక ముంపు ఒకేసారి ఉండదు. మొదట దాని ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను బట్టే, నష్టపరిహారం కూడా దఫదఫాలుగా చెల్లిస్తామని ప్రభుత్వం కొత్తరాగం ఎత్తుకొని నిర్వాసితులకు మొండిచేయి చూపిస్తున్నది. నిర్ణయించిన సమయంలో డ్యాం నిర్మాణం పూర్తికాక నిర్మాణ వ్యయ అంచనాలు పెంచుతూ, వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహనిర్మాణ పథకానికి నిధులు నిలిపివేయడంతో పనులు ఆగిపోయి ఇళ్ళ నిర్మాణాలు సగంలోనే ఆగిపోయాయి. రోడ్లు, భవనాల నిర్మాణాలకు టెండర్లు వేసి, పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు కూడా చెల్లించకపోవడంతో, అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు జోక్యం చేసుకొని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించినప్పటికీ, ప్రభత్వం దాన్ని అమలు చేయలేదు. దాంతో చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతూ, ఆందోళన బాట పడుతున్నారు.

## 'నవరత్నాలు' అమలు పేరుతో ప్రజలను వారి మౌలిక సమస్యల నుండి పక్కదారి పట్టించి కార్పొరేట్లకు సేవలందిస్తున్న జగన్ ప్రభుత్వం

ఎన్నికలకు ముందు 'నవరత్నాలు' (జలయజ్ఞం, మద్య నియంత్రణ, ఆరోగ్య శ్రీ, వైఎస్ఆర్ రైతు భరోసా, పేదలందరికీ ఇళ్ళు, వైఎస్ఆర్ ఆసరా-వైఎస్ఆర్ చేయూత, పింఛన్ల కానుక, అమ్మఒడి, ఫీజు రియంబర్స్‌మెంట్) పేరుతో ప్రజలకిచ్చిన హామీలను గడిచిన ఈ మూడు సంవత్సరాల కాలంలో నూటికి 95 శాతం అమలు పూర్తి చేసామని భూన బోంతరాలు దద్దరిల్లే విధంగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఈ పథకాలేవీ ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించి, వారి జీవితాల్లో అభివృద్ధిని తీసుకువచ్చేవి కావు. కానీ సంక్షేమ పథకాల గంతలు ప్రజల కళ్ళకు కట్టి ప్రభుత్వ అసలు స్వభావాన్ని అర్థం చేసుకోకుండా భ్రమలకు గురి చేయడానికి కొంత కాలం ఉపయోగపడతాయి. 'నవరత్నాల' పేరుతో అమలు చేస్తున్న పథకాలు అన్ని కూడా నగదు బదిలీ పథకాలే. తిరిగి ఈ డబ్బులు దేశీ, విదేశీ కార్పొరేట్ ఖజానాలకే చేర్చబడుతున్నాయి. ఉదాహరణకు ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, ఫీ రియంబర్స్‌మెంట్ పథకాల కింది పంపిణీ చేస్తున్న వేల

కోట్ల రూపాయలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ళకూ, హాస్పిటల్స్‌కు చెల్లించబడుతున్నాయి. అలా కాకుండా ఆ డబ్బులతో ప్రభుత్వమే విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్య, వైద్యాలను ఉచితంగా అందించవచ్చు. అలాగే ఈ రంగాలలో అర్హులైన లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధిని కూడా కల్పించవచ్చు. రైతు బరోసా పథకం కూడా భూస్వాములకూ, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేదే. వ్యవసాయరంగాన్ని డబ్ల్యూటీవో ఒప్పందాలకు వేలాడదీసి, బడ్జెట్‌లో నిధుల కెటాయింపుకు కోతలు పెడుతూ, పండిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించకుండా, చివరకు కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు సాగుచట్టాలను ఆమోదించి కార్పొరేట్లకు సేవచేస్తూ, 'రైతు బరోసా పథకం' రైతును అభివృద్ధి చేస్తుందని కళ్ళబొళ్ళి కబుర్లు చెబుతున్నారు. ఈ సంస్కరణలేవీ కూడా రాష్ట్రంలో కొత్త వనరులను సృష్టించవు. సంపదను పెంచివు. రాష్ట్రాన్ని మౌలికంగా అభివృద్ధి చేయవు. నూతన ఉపాధి వనరులను సృష్టించవు. ప్రజల జీవితాలలో మౌలిక మార్పును తీసుకురాకపోగా, ఎల్లప్పుడూ పరాధీనంగా ఉండే పరిస్థితులను సృష్టిస్తాయి. అవి బహుళజాతి సంస్థలకూ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర వనరులనూ, సంపదను దోచిపెట్టడానికి ఉపయోగపడతాయి. ఈ పథకాల అమలు పేరుతో గడిచిన మూడు సంవత్సరాల కాలంలో 1.82 లక్షల కోట్లు ఖర్చు చేసింది. 2019 నాటికే రాష్ట్రం రెండున్నర లక్షల కోట్ల రూపాయలు అప్పుల్లో కూరుకుపోయి ఉంది. దానితో కలిపి ప్రస్తుతం రాష్ట్ర అప్పును 5లక్షల కోట్లకు చేర్చారు. ఇందుకవసరమైన డబ్బులకోసం తలకు మించిన అప్పులు చేసి, ఆ అప్పులకు వడ్డీలు, అసలు కలిపి చెల్లించడానికి నూతన అప్పులు చేసి ఆ అప్పుల బారాన్ని ప్రజలపై మోపాడు. ప్రజల భూములనూ, ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టాడు. కొత్తగా అనేక పన్నులు, చార్జీలు విధించడం ద్వారా ప్రజలపై అదనంగా 90వేలకోట్ల రూపాయల బారాన్ని మోపాడు. ప్రజల సొమ్మునే ఒక చేత్తో ఇస్తూ, మరోచేత్తో అంతకుమించి దోపిడీ, పీడనలకు గురి చేస్తున్నాడు.

## కేంద్ర ప్రభుత్వానికి దాసోహంగా మారి, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన జగన్

ఎన్నికలకు ముందు రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించేవరకు పోరాడతామనీ, మడమతిప్పేది లేదనీ, మాట మార్చేదిలేదని చేసిన వాగ్దానం వట్టి బూటకమే అనేది అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే తేలిపోయింది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ రావడంతో జగన్ ఈ విషయాన్ని సాకుగా చూపి, ప్రస్తుత పరిస్థితిలో ప్రత్యేకహోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తేలేమని మెల్లగా జారుకున్నాడు. ప్రత్యేక హోదా అనేది ముగిసిన అధ్యాయం అని కేంద్రం పదే పదే తేల్చి చెబుతున్నా దానిపై మౌనం వహిస్తున్నాడు తప్ప, దానిని ప్రజల డిమాండ్‌గా పార్లమెంటులో లేవనెత్తడానికి కూడా సిద్ధంగా లేడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ-2013 చట్టంలో పొందుపరిచిన హామీలను నేటికీ అమలు చేయకపోయినా, కేంద్రాన్ని అడిగే స్థితిలో జగన్ ప్రభుత్వం లేదు. గడిచిన మూడు సంవ్సరాలలో జగన్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వంతో అంటకాగుతూ, అది పార్లమెంటులో తన 'నయాభారత్' నిర్మాణం ఎజెండాలో భాగంగా ముందుకు తెచ్చిన అత్యంత అప్రజాస్వామిక, దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలతో కశ్మీర్ రాష్ట్ర ప్రజల స్వయంప్రతిపత్తిని కాలరాస్తూ 370 35 (ఏ) ఆర్టికల్ రద్దు, మైనారిటీల హక్కులను కాలరాచివేసే జాతీయ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్), రైతు వ్యతిరేక మూడుసాగు చట్టాలు, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మికచట్టాలనూ, హక్కులను 4 కోడ్‌లుగా సవరించి ప్రవేశపెట్టడాన్నీ, త్రిపుల్‌తలాక్, విద్యను కాషాయికరిస్తూ, ప్రైవేటీకరిస్తూ, కార్పొరేటీకరిస్తూ 'నూతన జాతీయ విద్యావిధానా'న్నీ, దేశం ఫెడరల్ సమైఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాష్ట్రాల అధికారాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజారుస్తూ, ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే విద్య, ఒకే మతం లాంటి తదితర కేంద్ర విధానాలపై ఎలాంటి చర్చ లేకుండానే జగన్ పార్లమెంటులో తన పార్టీ ఎంపీల చేత ఆమోద ముద్ర వేయించాడు. ఎల్‌పీజీ విధానాలను మరింత దూకుడుగా, వేగంగా అమలు చేయడంలో భాగంగా విద్యుత్ సంస్కరణలు, పట్టణ సంస్కరణలు, ప్రజల, ప్రభుత్వ ఆస్తులను పెట్టుబడిదారులకు అద్దెకిచ్చే మానిటైజేషన్ విధానాలను అమలు చేస్తున్నాడు. ఎన్ఐఏ(నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)కు మరింత ఫాసిస్టు అధికారాలను కట్టబెడుతూ చేసిన చట్ట సవరణ, సమాచార హక్కు అధికారాలను కుదిస్తూ చేసిన చట్ట సవరణకూ, పదవీ విరమణ చేసిన సైనికుల పెన్షన్ ఖర్చులు తగ్గించడానికి సైన్యంలో పర్మనెంట్ ఉద్యోగ విధానం స్థానంలో కాంట్రాక్టు క్యాజువల్ విధానం ప్రవేశపెట్టి సైన్యాన్ని 'సంఘ్ పరివార్', కార్పొరేట్ సైన్యంగా తయారు చేసే అగ్నిపథ్ పథకానికి మద్దతునిస్తూ అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు. రామజన్మభూమి కూల్చివేత వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత అప్రజాస్వామిక హిందుత్వ అనుకూల తీర్పుపై కూడా తన ఆమోదాన్ని తెలిపాడు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి తన సంపూర్ణ మద్దతుని ప్రకటించి కేంద్రంపై తన విధేయతను ప్రకటించుకున్నాడు.

పై విషయాలపై రైతాంగం, కార్మికవర్గం, విద్యార్థులు, మత మైనారిటీలు, ప్రజాస్వామిక వాదులు, సెక్యూలరిస్టులు, నిరుద్యోగులు, మహిళలు, ఆదివాసీలు తమ నిరసనను ప్రకటిస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా, జగన్ మాత్రం కేంద్ర విధానాలకే మద్దతునిచ్చాడు.

పై విషయాల పట్ల జగన్ ప్రభుత్వం అనుసరించిన మౌలిక ఆర్థిక, రాజకీయ వైఖరులను తెలియజేస్తున్నాయి. జగన్ ప్రత్యక్షంగా కేంద్రంలోని బీజేపీ కూటమిలో భాగస్వామిగా లేనట్లు పైకి కనిపించినా, బీజేపీకి వ్యూహాత్మక మిత్రుడి పాత్రనే పోషిస్తున్నాడు తప్ప, కనీసం ప్రతిపక్షంగా కూడా వ్యవహరించడం లేదు. సాధారణంగా పాలకవర్గాల మధ్య అధికారం కోసం అత్యంత నీచమైన కుట్రలు, కుహకాలు, బ్లాక్‌మెయిల్ పద్ధతులకూ, అరాచకాలకు పాల్పడే ఘర్షణలు మనకు పైకి కనబడుతున్నప్పటికీ, నేడు ఎల్‌పీజీ విధానాలను అమలు చేస్తూ, సామ్రాజ్యవాదులకూ, దేశ దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవ చేయడంలో వీరందరిదీ ఒకే వైఖరి. వీటితోపాటు జగన్ తన తండ్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేల కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రజల సంపదను అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి పోగేసుకున్నాడు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆయనపై 20 రకాల నేరాలకు సంబంధించి 31 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2012లో జగన్‌ను సీబీఐ అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఆ కేసులు మెడమీద కత్తిలాగా వేలాడుతున్నాయి. వాటిని కేంద్రంలో ఉన్న బీజేపీ ఆయుధంగా

వాడుకుంటూ జగన్‌ను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నది. ఆ కేసుల నుండి రక్షించుకోవడానికి కేంద్రంలోని మోడీ, అమిత్‌షాల ముందు పూర్తిగా మోకరిల్లాడు. అందుకు మొత్తం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి, కేంద్రంలోని ప్రతి ప్రజావ్యతిరేక విధానాన్ని ఆమోదించి అమలు చేస్తూ, తన విధేయతను చాటుకుంటున్నాడు.

### సామ్రాజ్యవాదుల సేవలో జగన్

గత రెండున్నర సంవత్సరాలుగా ప్రపంచం కరోనా కల్లోలాన్ని ఎదుర్కొంటున్నది. అప్పటికే తీవ్రతరమైన సామ్రాజ్యవాద, ఆర్థిక, ద్రవ్య సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ కాలంలో వారు నూతనంగా ఉత్పత్తి రంగాలలో ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా లేరు. దానితో రాష్ట్రానికి నూతన పెట్టుబడులు రాకపోవడంతో జగన్‌కు కార్పొరేట్‌లకు ఎక్కువ సేవ చేయగలిగే మహాభాగ్యం లభించలేదు. కానీ రిలయన్స్ కంపెనీ చైర్మన్ పరిమల్ నత్వాజీకి రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రం నుండి స్థానం కల్పించి నేను కార్పొరేట్‌లకు అనుకూలున్నని ప్రకటించుకున్నాడు. రాష్ట్రంలోని కీలక ఓడరేవులన్నింటినీ క్రమంగా ఆదానీ కంపెనీకే అప్పగిస్తున్నాడు. నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకి సమీపంలో ఏర్పాటైన ఏపీ జెన్‌కో నిర్వహణలోని థర్మల్ విద్యుత్ ప్లాంటును ప్రైవేటీకరించే నిర్ణయం తీసుకున్నాడు. విశాఖ మన్యంలోని బాక్సైట్ నిక్షేపాలను తవ్వితీసి ఆన్‌రాక్ కంపెనీకి అప్పగించే ఒప్పందాన్ని పునరుద్ధరించాడు. విశాఖ ఉక్కు ఫాక్టరీని ప్రైవేటీకరించాలనే కేంద్ర నిర్ణయానికి మద్దతునిస్తున్నాడు. వేలకోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములనూ, ఆస్తులను కారుచౌకగా అమ్మకానికి పెడుతున్నాడు. క్రమంగా విద్య, వైద్యం తదితర ప్రభుత్వ రంగాలనూ ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేసాడు. సామ్రాజ్యవాద, స్వదేశీ కార్పొరేట్ల పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి అమిత ఆసక్తి చూపుతున్నాడు. గతంలోనే కేంద్రం, రాష్ట్రప్రభుత్వం కలిసి 13 వేల కోట్ల రూపాయలతో ప్రారంభించిన పారిశ్రామిక కారిడార్‌లైన విశాఖ-చెన్నై, చెన్నై-బెంగులూర్, హైదరాబాద్-బెంగులూర్ కారిడార్‌లను 2023-24 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో శరవేగంగా పనులు చేస్తున్నాడు. బావనపాడు, మచిలీపట్నం, రాయపట్నం వద్ద మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం చేసి, కారిడార్‌ల పొడవునా పారిశ్రామిక కస్టర్లు, లాజిస్టిక్ యూనిట్స్ ఏర్పాటు చేయడానికి వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకునీ, ప్రజల్ని నిర్వాసితులను చేసి, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ వేగంగా ఈ పనులను పూర్తి చేస్తున్నారు. అలాగే భోగాపురం, దస్తగిరిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల అభివృద్ధి, గన్నవరం విమానాశ్రయ విస్తరణ, అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణం తదితర పనులను కూడా కొనసాగిస్తున్నారు. జగన్ పాలనా విధానాలన్నీ కూడా ప్రజలకోసం కాదు, విదేశీ, స్వదేశీ కార్పొరేట్‌లకూ, తన అశ్రితుల ప్రయోజనాల కోసమేనని రుజువవుతున్నాయి.

### అప్పుల అగాధంలోకి కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పుల వాటా 91.123 (2014) కోట్లు. గత టీడీపీ చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ళలో చేసిన అప్పు 1,65,000 కోట్లు. 2019 నాటికీ మొత్తం అప్పు 2,62,163 కోట్లు. ప్రస్తుత వైఎస్‌ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వం గడిచిన మూడేళ్ళ కాలంలో చేసిన అప్పులతో కలిపి అది 4,93,394 కోట్లకు పెరిగింది. ఇదేకాక ఇతర ద్రవ్య సంస్థల, బ్యాంకుల వద్ద చేసిన అప్పులతో కలిపితే 7,00,000 కోట్ల ఋణబారాన్ని రాష్ట్ర ప్రజలు మోస్తున్నారు. ద్రవ్య నియంత్రణ, నిర్వహణ చట్టం ప్రకారం స్థూల రాష్ట్ర ఆదాయం (జీఎస్‌డీపీ)తో పొంతన లేకుండా ప్రభుత్వం మితిమీరిన అప్పులు చేస్తున్నది. అందుకు వివిధ కార్పొరేషన్‌ల పేరుతో అప్పులు తెస్తున్నది. అప్పులు తేవడానికి నూతన కార్పొరేషన్‌లను ఏర్పాటు చేస్తున్నది. చివరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నెలవారిగా సరిగా జీతాలు చెల్లించలేని స్థితికి చేరింది. దానికోసం ప్రతినెల సగటున 6000 కోట్ల రూపాయలు కొత్త అప్పులు చేయాల్సి వస్తున్నది. అందుకు ప్రతినెల ఆర్‌బీఐ తలుపు తడుతున్నది. ఈ అప్పులను అది సంక్షేమ పథకాల పేరుతో ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నది. 'నవరత్నాల' పేరుతో అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలన్నీ ప్రత్యక్ష నగుదు బదిలీ పథకాలే కావడంతో, అవి ఏవి కూడా రాష్ట్ర వనరులనూ, ఉత్పత్తిని పెంచేవి కాకపోవడంతో నూతన ఉపాధి అవకాశాలు కూడా లభించక, ఆదాయం పెరగకుండా అవి ఏ రకంగానూ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేవి కావు. ఈ సంక్షేమ పథకాల ముసుగు కప్పి ప్రజలను భ్రమల్లో ఉంచి తాత్కాలికంగా తమ ఓటు బ్యాంకును పెంచుకోడానికి ఉపయోగించుకోగలుగుతున్నది. అంతకన్నా ముఖ్యమైనది ప్రభుత్వం విదేశీ, బడా కార్పొరేట్లకందిస్తున్న సేవలు, వనరుల దోపిడీ, పన్నులబారాన్ని ప్రజలు గుర్తించకుండా చేస్తున్న మోసమే. పైగా రాష్ట్ర ఆదాయంలో అధికశాతం అప్పులు, వడ్డీలు చెల్లించడానికి ఖర్చవుతున్నది. ఈ స్థితిలో ప్రభుత్వ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నది. మరోచేత్తో ప్రజలపై విపరీతమైన పన్నులబారాన్ని మోపుతున్నారు. డిజిల్, పెట్రోల్, విద్యుత్ చార్జీలు, గ్రామాలలో ఇంటిపన్నులు, క్రీడామైదానాల పన్నులు, లైబ్రరీ పన్నులు, చివరకు చెత్తపన్ను, వృత్తిపన్నుల వసూళ్ళు పెంచారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. మద్యాన్ని ఏరులుగా పారించి ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుకోవడం, చివరకు సినిమా టికెట్‌లను కూడా ఆన్‌లైన్‌లో ప్రభుత్వమే అమ్మి డబ్బులు కూడగట్టుకునే స్థితికి దిగజారింది. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు పుట్టబోయే బిడ్డతో సహా, తలకు ఒక లక్ష చొప్పున ప్రజలు అప్పులబారం మోస్తున్నారు. సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసిన శ్రీలంక పాలకవర్గాలు దేశాన్ని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టినట్లుగానే, నేడు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ కూప్పకూలిపోయే స్థితికి చేరి, అనతి కాలంలోనే ఊహించని సంక్షోభంలోకి ఈడ్చబడి ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తుంది.

### ఫ్యూడల్ ఫాసిస్టు నియంత పాలన

ఏ రాజకీయ పార్టీ అయినా వర్గసమాజంలో ఏదోఒక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తూ, వారికి సేవ చేసేదిగా ఉంటుంది. వైఎస్‌ఆర్‌సీపీ కూడా ప్రస్తుత అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తూ, దోపిడీ వర్గాల తరపున ప్రజలపై నియంతృత్వాన్ని అమలు చేసే వర్గస్వభావాన్ని కలిగి ఉంది. అవి పైకి ప్రజలకు స్వేచ్ఛా, సమానత్వం, సమన్యాయం అందిస్తాయని నమ్మబలుకుతాయి. ప్రజలను అణచిపెట్టడానికి తమ సాయుధ బలగాలపై ప్రధానంగా ఆధారపడతాయి. జగన్ అధికారంలోకి రాగానే తనకు అనుకూలమైన, క్రూరులైన గతంలో ప్రజలను అణచివేయడంలో గొప్ప అనుభవం ఉన్న పోలీసు ఉన్నత అధికారులను కీలక పదవుల్లో

నియమించాడు. దేశంలో నరహంతకులుగా పేరుగాంచిన 'గ్రేహౌండ్స్ బలగాల'ను మరింత ఆధునీకరించాడు. ప్రజలు తన పార్టీని అత్యంత మెజారిటీతో గెలిపించారనీ, తన ప్రభుత్వం ఏం చేసినా చెల్లుబాటవుతుందనే ఫ్యూడల్ అహంకారంతో పాలనను ప్రారంభించాడు. గడిచిన మూడు సంవత్సరాల ప్రభుత్వ పాలనలో కేంద్రం తీసుకువచ్చిన క్రూరమైన ఫాసిస్టు చట్టాలైన ఉపా, ఎన్ఐఏ చట్ట సవరణ, రాజ్యద్రోహ చట్టాలను రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ భావాలు కలిగిన వారిపైనా, ప్రజాస్వామికవాదులపైనా, ప్రజా సంఘాలపైనా, చివరకు ప్రతిపక్షాలపైన కూడా అమలు చేయపూనుకున్నాడు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక చేత్తో బాక్సైట్ తవ్వకాల నిలుపుదలకు 97 జీవోను రద్దు చేస్తూ సంతకం పెట్టి, సంవత్సరం తిరగకముందే దొడ్డిదారిన 89 జీవోను జారిచేసి బాక్సైట్ తవ్వకాల సర్వేలకు శ్రీకారం చుట్టాడు. లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలకు అనుమతినిచ్చి తన అశ్రితులకు అప్పగించాడు. బాక్సైట్ ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది ఆదివాసీ రైతాంగంపైన మోపిన కేసులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అన్‌రాక్ కంపెనీతో తన తండ్రి ప్రభుత్వ హయంలో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయలేదు. ప్రస్తుతం దానిని పునరుద్ధరించి బాక్సైట్ సరఫరాకు సిద్ధపడుతున్నాడు. మరోచేత్తో మన్యంపై మునుపెన్నడూ లేని స్థాయిలో అణచివేత దాడికి సిద్ధమయ్యాడు. వేలాది సాయుధ బలగాలను విప్లవోద్యమ ప్రాంతాలలో మోహరించి, ఆదివాసీ సాయుధ రైతాంగ ఉద్యమాన్ని నిర్మూలించడానికి నిరంతర కూంబింగ్‌లు, అక్రమ అరెస్టులు, జైలు నిర్బంధాలు, ఎన్‌కౌంటర్ హత్యలతో మారణకాండను సృష్టిస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అమరావతిలో భూములు కోల్పోయి పోరాడుతున్న రైతాంగంపైనా, ప్రజలపైన ప్రభుత్వం, పోలీసులు అమానవీయంగా, అరాచకంగా దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరగని రోజంటూ లేదంటే అతిశయోక్తి కాదు. ఈ అత్యాచారాలకున్న సామాజిక మూలాలను పక్కదారి పట్టించి తక్షణ న్యాయం పేరుతో అత్యాచారాల నిరోధకానికి 'దిశచట్టం' తెచ్చి, అది మహిళల రక్షణకు ఉపయోగపడుతున్నదని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. గతంలో రాష్ట్రంలో ఏ ప్రభుత్వం, ఇంకా చెప్పాలంటే దేశంలో కూడా ఎక్కడా లేని విధంగా ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మతమైనారిటీలకు మంత్రివర్గంలో 70 శాతానికి పైగా స్థానాలను కేటాయించి, సామాజిక న్యాయంలో భాగంగా అధికారంలో అందరికీ భాగస్వామ్యం కల్పించామని చెప్పుకుంటూ, ఆయా సామాజిక సమూహాలను మోసగించాలని చూస్తున్నాడు. ప్రభుత్వ నిర్ణయాలలో వీరికి ఎలాంటి భాగస్వామ్యం లేదు సరికదా, నియంత జగన్ నిర్ణయాలను తలవంచి అమలు చేసే ఉత్సవ విగ్రహాలే. అధికారమంతా జగన్, అగ్రకుల భూస్వాములు, వివిధ శాఖల ఉన్నతాధికారులే చలాయిస్తున్నారు. వీరి ద్వారా ఏ దళితుడికీ, ఆదివాసీలకూ, మత మైనారిటీలకూ, మహిళలకు సామాజిక న్యాయం లభించలేదు. పైగా గతం కంటే ఈ సామాజిక సమూహాలు మరింత దోపిడీ, పీడన అణచివేతలకు గురవుతున్నాయి.

ఎన్నికలకు ముందు జగన్ అధికారంలోకి వస్తే ఉద్యోగుల సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరిస్తాననీ, అందులో సీపీఎస్(కాంట్రిబ్యుటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేస్తాననీ, 11వ పీఆర్‌సీని తక్షణమే అమలు చేస్తానని వాగ్దానాలు చేసాడు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా సీపీఎస్‌ను రద్దు చేయలేదు. పీఆర్‌సీని గత ప్రభుత్వం ఇచ్చినదానికన్నా తగ్గించడంతో ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ప్రజాస్వామిక పద్ధతిలో ఫిబ్రవరి 3న 'చలో విజయవాడ' ఆందోళనకు పిలుపునిచ్చారు. ఆ ఆందోళనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఉపాధ్యాయులకూ, ఉద్యోగుల సంఘ నాయకులకు మీటింగ్‌కు వెళ్ళవద్దని నోటీసులు ఇచ్చింది. అనేక మందిని ఇళ్ళవద్దే అరెస్టు చేసారు. విజయవాడకు వెళ్ళే రోడ్డు, రైలు మార్గాలను వేలాది పోలీసు బలగాలతో మోహరించి తనికీలు చేసి అడ్డుకున్నారు. అయినా మారు వేశాలలో లక్షలాది మంది ఉద్యోగులు విజయవాడ ర్యాలీలో పాల్గొన్నారు. దీనిని పోలీసుల వైఫల్యంగా భావించిన ప్రభుత్వం తనకు నమ్మిన బంటులా పని చేసిన డీజీపీ గౌతమ్‌సావాంగ్‌ను ఆ పోస్టు నుండి తొలగించింది.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చేసిన వాగ్దానాన్ని తుంగలో తొక్కడంతో వారంతా 'నిరుద్యోగ ఘర్జన' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారు. దానిని అడ్డుకోవడానికి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ విఫలమైంది. రాష్ట్రంలో అగ్రకుల భూస్వాములు, అధికార పార్టీ నాయకులు, దళిత ఉద్యోగులపై, మహిళలపై, ప్రజలపై దుర్మార్గమైన దాడులకు పాల్పడుతుంటే, పోలీసులు మాత్రం ఈ దాడులకు పాల్పడిన వారిని వదిలిపెట్టి దాడులకు గురైనవారిపైనే కేసులు బనాయిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో వైఎస్ఆర్‌సీపీ నాయకుల ఇసుక మాఫియాను ప్రశ్నించినందుకు ప్రసాద్ అనే దళిత యువకుడిని సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి శిరోముండనం చేసారు. దానితో తనకూ, దళితులకు ఈ వ్యవస్థలో న్యాయం జరగదని తన ఆత్మ గౌరవం కాపాడుకోవడానికి సీపీఐ(మావోయిస్టు)లో చేరడానికి అనుమతినివ్వమని రాష్ట్రపతికి బహిరంగ లేఖ రాసాడు. అంటే దళితులకు ఈ వ్యవస్థలో ఎలాంటి న్యాయం జరగదని పదే పదే నిరూపితమవుతూనే ఉంది.

అధికార వికేంద్రీకరణ ప్రజల వద్దకు పాలన పేరుతో గ్రామ, వార్డ్ సచివాలయాలు, వాలెంటరీ వ్యవస్థ పేరుతో అధికార కేంద్రీకరణను పెంచి లాఠీ వ్యవస్థకు పునాదులు వేసారు. ఈ వ్యవస్థను వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలతో భర్తీ చేసారు. వీరంతా గ్రామస్థాయిలో పోలీసు వ్యవస్థకు అనుబంధంగా వ్యవహరించాలని పోలీసు అధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు. తన ప్రతిపాదనగా రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన మూడు రాజధానుల బిల్లును శాసనమండలి వాయిదా వేసిందనే కక్షతో, అహంభావంతో శాసనమండలి(తన పార్టీకి మెజారిటీ లేకపోవడంతో)నే రద్దు చేయాలని నిర్ణయించాడు. తన విధానాలను వ్యతిరేకించే, విభేదించే ఎవరిపైనైనా చివరకు ప్రతిపక్షాలపై కూడా కక్షసాధింపు దాడులు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నాడు. జగన్ మూడేళ్ళ పాలనలో అన్నివర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు చివరకు పత్రికలు కూడా దాడికి గురయ్యాయి. పౌరహక్కులను కాలరాచివేసే నిరంకుశ పద్ధతులనే అనుసరించాడు. కోర్టులు, చట్టాలు, రాజ్యాంగంపట్ల కూడా ఏ మాత్రం గౌరవం లేకుండా యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ పరిహాసం చేస్తున్నాడు. సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలనూ, నిరంకుశ పాలనను కొనసాగిస్తున్నాడు. ఇంతటి ఫ్యూడల్ నియంత పాలనలో సభా, వాక్, పత్రికా స్వాతంత్రం, చట్టబద్ధపాలన, పౌరులందరికీ సమాన ప్రజాస్వామిక విలువలను ఎవరూ ఆశించలేరు. జగన్ పాలనపై ప్రారంభంలో ఉదారవాద, ప్రజాస్వామికవాదులు పెంచుకున్న భ్రమలు కూడా నేడు పటాపంచలయ్యాయి.

**జగన్ ప్రజావ్యతిరేక పాలనా విధానాలపై పెల్లుబుకుతున్న ప్రజాందోళనలు**

నేడు రాష్ట్రంలోని అన్ని వర్గాలూ, అన్ని సామాజిక సముదాయాలు ఎదుర్కొంటున్న సకల సమస్యలకు 'నవరత్నాలే' పరిష్కారమంటూ జగన్ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నది. కాని వాస్తవంగా రాష్ట్ర ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు దిగుతున్నారు. రైతుభరోసా పథకం ద్వారా వ్యవసాయ అభివృద్ధికి పాటుపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం కేంద్రం తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక సాగు చట్టాలను అమలు చేయడానికి అమోదం తెలిసింది. విద్యుత్‌సంస్కరణలలో భాగంగా వ్యవసాయ విద్యుత్‌మోటర్లకు మీటర్లు బిగించడానికి సిద్ధమైంది. క్రమంగా వారి నుండి రాబోయే రోజుల్లో విద్యుత్ బిల్లులను వసూలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నది. ఈ మూడు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదు. రైతులకు అన్ని రకాల సబ్సిడీలను ఎత్తివేసి బ్యాంకు ఋణాలను నిలిపివేయడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులపైన రైతాంగం ఆధారపడుతున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నకిలీ సరఫరాను అడ్డుకోకుండా, అధిక ధరలను నియంత్రించకుండా రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ఋణబారంతో వాటికి వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యంగా మారి పోరాటం తప్ప మరోమార్గం లేని స్థితికి నెట్టబడ్డారు. విశాఖఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కేంద్రనిర్ణయానికి వ్యతిరేకంగా గత 500ల రోజులుగా కార్మికులు వివిధ రూపాలలో పోరాడుతున్నారు. కృష్ణపట్నం జెన్‌కో పవర్‌ప్రాజెక్టును ప్రైవేటుపరం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెన్షనర్లు, ఉపాధ్యాయ ఉద్యోగులు సీపీఎస్ రద్దు11వ పీఆర్‌సీ జీవోలో పేర్కొన్న విధంగా ఐఆర్‌కంటే ఫిట్‌మెంట్ తక్కువ ఇవ్వాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా సీపీఎస్ రద్దు చేయకుండా దాని స్థానంలో జీపీఎస్‌ను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ, అలాగే గత ప్రభుత్వ హయంలో 10వ పీఆర్‌సీ అమలు చేసిన ఫిట్‌మెంట్, ఐఆర్, హెచ్‌ఆర్‌సీలను అమలు చేయాలని రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు జగన్ నయవంచనకు వ్యతిరేకంగా ధర్మపోరాటం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

జగన్ అధికారంలోకి వస్తే రెండున్నర లక్షల మందికి (2.50 లక్షలు మంది అందులో 90 వేలు ఉద్యోగ విరమణకాలం 1.4 లక్షల ప్రభుత్వరంగ కాలం) ఉద్యోగాలు ఇస్తామనీ, అందుకు ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని హామి ఇచ్చింది. 2021 జూన్ 18న ఒకసారి జాబ్ క్యాలండర్ ప్రకటించి 10,143 ఉద్యోగాలు ఏడాది లోపు భర్తీ చేస్తామని ప్రకటించారు. దీన్నే 'ఉద్యోగ విప్లవం' అంటూ పెద్దగా ప్రచారం చేసాడు. ఆశ్చర్యమేమిటంటే అది కూడా నేటికీ పూర్తి చేయలేదు. గడిచిన ఈ మూడేళ్ళలలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలకూ, గ్రామ వాలంటీర్, వార్డు, సచివాలయ ఉద్యోగ నియమకాలు తప్ప, అర్హులైన నిరుద్యోగులెవరికీ ప్రభుత్వ రంగంలో నూతన ఉద్యోగ భర్తీలను పూర్తి చేయలేదు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులున్నారని ఒక అంచనా. అందులో 15 లక్షల మంది అర్హులు ఉద్యోగాల కోసం ఎదిరిచూస్తున్నారు. జగన్ మోసపూరిత వాగ్దానాలకు దగాపడ్డ నిరుద్యోగులంతా రాష్ట్రవ్యాపితంగా ఆందోళన బాట పట్టారు.

జగన్ విద్య, వైద్య రంగాలలో మా ప్రభుత్వం విప్లవాత్మక మార్పు తెచ్చిందనీ, ఎవరు నమ్ముతారో లేదో అనే సంబంధం లేకుండా అసత్యాలతో గొప్ప ప్రచారాన్ని ప్రారంభించాడు. కేంద్రప్రభుత్వం విద్యను కేంద్రీకరణ, కాషాయికరణ, కార్పొరేటీకరణ చేసే జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టగా, జగన్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి, విద్యహక్కు చట్టాన్ని కూడా ఉల్లంఘించి మొత్తం ప్రభుత్వ పాఠశాలలను 6 రకాలుగా వర్గీకరించి, ప్రాథమిక పాఠశాలలను రకరకాలుగా విడగొట్టి, మూడు కిలోమీటర్ల లోపున్న 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం, ప్రాథమిక పాఠశాలలు ఒక కిలోమీటర్‌లోపు ఉండాలన్నా విద్యహక్కు చట్టం స్ఫూర్తికి భిన్నంగా 1,2 తరగతులను అంగన్‌వాడీలకు అప్పగించనున్నది. ఈ విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా సుమారు 5,250 ప్రాథమిక పాఠశాలలను మూసివేసింది. దీనితో సుమారు 2 లక్షల మంది విద్యార్థులు దూరభారం భరించలేక విద్యను మానేయడం లేదా ప్రైవేటు స్కూల్‌లకు వెళ్ళాల్సిన పరిస్థితి కల్పించింది. ఆన్‌లైన్ విద్యను ప్రవేశపెట్టి, ఉపాధ్యాయులను తొలగించి, విద్యను ప్రైవేటీకరించడంలో భాగంగా ఈ మధ్య జరిగిన దావోస్ సమావేశంలో 'బైజ్యూస్ ఆవ్ కంపెనీ'తో ఒప్పందం చేసుకున్నాడు. దీని ద్వారా 4 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రభుత్వం కట్టుకథలు చెబుతున్నది. ఉపాధ్యాయ నియమాలను నిలిపివేస్తే (రేషనలైజేషన్ పేరుతో) అదనపు ఋణాలు ఇస్తామని ప్రపంచబ్యాంకు విధించిన షరతులకు లోబడి, ఈ పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టాడు. దానితో స్కూల్ పిల్లలు, వారి తల్లిదండ్రులు "మాకు మీ అమ్మఒడి, విద్యా దీవెన, గోరుముద్దలు వద్దు, మా బళ్ళు మాకే తెరవండి" అంటూ స్కూళ్ళ మూసివేతకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారు.

దేశంలో మన ప్రభుత్వరంగంలో వైద్యవ్యవస్థ పరిస్థితి ఎలా ఉందో కరోనా కల్లోల సమయంలో అందరికీ స్పష్టమైందే. రాష్ట్రంలో కరోన వ్యాధి సోకిన పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల సరఫరా లేక, తగినంత సిబ్బందిలేక, చివరకు ఆక్సిజన్ లాంటి ప్రాణవాయువు అందక, లక్షల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ హాస్పిటళ్ళలో ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమతలేక, పక్క రాష్ట్రమైన తెలంగాణలోని హైదరాబద్‌కు తరలిపోతే, ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా రోగులను అడ్డుకోవడంతో వేలాదిమంది ఊపిరాడక పిట్టల్లా రాలిపోయారు. ఇదే కాకుండా ప్రతి సంవత్సరం ఆదివాసీ ప్రాంతాల్లో మలేరియా, డయోరియా, రక్తహీనత, మాతా, శిశు మరణాలతో వేలాది మంది మృత్యువాత పడుతున్నారు. జగన్ గత మూడు సంవత్సరాలుగా కొత్తగా 16 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనేక ప్రభుత్వ హాస్పిటళ్ళు నిర్మిస్తామని చేస్తున్న ప్రచారం ప్రకటనలకే పరిమితమైంది తప్ప, కొత్తగా ఒక నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేదు. అర్హులైన అనేక మంది వైద్య విద్యార్థులు విదేశాలకు వలస పోతున్నారు. లేదా కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యులుగా చేరుతున్నారు. కాని ఈ మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ అనుమతితో అనేక కార్పొరేట్ హాస్పిటళ్ళు పిట్టగొడుగుల్లా వెలిసాయి. ప్రభుత్వ 'ఆరోగ్యశ్రీ పథకం' కార్పొరేట్ హాస్పిటళ్ళ ఆదాయాన్ని పెంచే పథకమేననీ, పేదలకు వైద్యం అందించడమనేది వట్టి బూటకం అని తేలిపోయింది.

విశాఖ మన్యంలోని బాక్సైట్‌ను తవ్వితీసి అన్‌రాక్ కంపెనీకి సరఫరా చేయడానికి గతంలో జరిగిన ఒప్పందం (ప్రజల ఆందోళనతో

కొంతకాలం నిలిచిపోయింది)ను తిరిగి పునరుద్ధరించింది. మాకవరపాలెం మండలంలో 2,450 ఎకరాలలో ఆన్‌రాక్ అల్యూమినియం కంపెనీ నిర్మాణం గతంలోనే పూర్తయింది. ప్రస్తుతం కశింకోట మండలం, బయ్యవరం గ్రామం నుండి కంపెనీ వరకు 30 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టారు. త్వరలో కంపెనీ ఉత్పత్తిని ప్రారంభించబోతున్నారు. లాటరైట్ పేరుతో ఇప్పటికే తూర్పుగోదావరి, విశాఖ జిల్లాలలో పెద్దఎత్తున తవ్వకాలు కొనసాగుతున్నాయి. గతంలో ఆదివాసీ రైతాంగం ఏపీఎఫ్‌డీసీ యజమాన్యం కింద వున్న వేలాది ఎకరాల కాఫీ ఎస్టేట్లను 'జల్, జంగల్, జమీన్‌పై అధికారం ఆదివాసీలది, పీడిత ప్రజలదే' అనే నినాదంతో పోరాడి స్వాధీనం చేసుకొని ప్రజలు సాగు చేసుకుంటున్నారు. అయితే పోరాడే ప్రజలపై, ఆదివాసీ రైతాంగంపై సాయుధ అణచివేతను అమలు చేస్తూ, కాఫీ తోటలను ప్రభుత్వం తిరిగి ఆక్రమించుకుంటున్నది. విశాఖ జిల్లాలోని కొయ్యూర్, చింతపల్లి మండల సరిహద్దు ప్రాంతంలోని ఎర్రవరం జలపాతంపైన 1,200 మెగావాట్ల సామర్థ్యంతో ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ ఆద్వర్యంలో భారీ జలవిద్యుత్ కేంద్రాన్ని 5,400 కోట్ల వ్యయంతో నిర్మించడానికి రాష్ట్రప్రభుత్వం అనుమతినిచ్చింది. దాంతో 34 గ్రామాల ప్రజలని నిర్వాసితులుగా మార్చబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడానికి మన్యం ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చడానికి పథకం వేసింది. ఇది ఆదివాసీల అస్థిత్వానే మరింతగా ధ్వంసం చేస్తుంది. వీటన్నింటి ద్వారా ఆదివాసీలను అడవులు, భూములు, గ్రామాల నుండి ఖాళీ చేయించి, పర్యావరణాన్ని ధ్వంసం చేసి, ప్రజలను నిర్వాసితులుగా మార్చడానికి పూనుకుంటున్నది. ఆదివాసీ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలో స్థానిక నిరుద్యోగ ఆదివాసీ యువతకే ఉపాధ్యాయ నియమకాలు జరపాలని గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోనంబర్ 3ను సవాల్ చేస్తూ ఆదివాసేతరులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కోర్టు జీవోనంబర్ 3ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఆదివాసీ నిరుద్యోగ యువకులు ఆందోళనకు దిగినా, వారి తరపున ప్రభుత్వం కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదు. 1/70 చట్టాన్ని నీరుగార్చడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఆదివాసీ ప్రాంతాలలో గిరిజనేతరులు శాశ్వత గృహనిర్మాణం కోసం ఒకటిన్నర సెంట్ల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జీవోను జారీ చేసింది. వీటి ద్వారా గిరిజనుల ప్రత్యేక హక్కులనూ, చట్టాలను కాలరాచి గిరిజనేతర భూస్వాముల, దోపిడీదార్ల, కార్పొరేట్ల దోపిడీకి నిలయంగా ఆదివాసీ ప్రాంతాలను మార్చబోతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తున్న జగన్ ప్రభుత్వం, రాష్ట్రంలో దళితులు, మహిళలు, మత మైనార్టీలపై అమానవీయమైన దాడులు చేస్తున్నాడు. 'అభివృద్ధి వికేంద్రీకరణ' గురించి మాట్లాడే జగన్ రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నయా పైస కూడా కేటాయించలేదు. కానీ ఆ ప్రాంత వనరులనూ, సహజ, ప్రాకృతిక సంపదను దేశీయ కార్పొరేట్లకూ, సామ్రాజ్యవాదులకు దోచిపెట్టే ఒప్పందాలను చేసుకుంటూ ఉత్తరాంధ్రను స్మశానంగా మార్చడానికే పూనుకున్నాడు. కోస్టల్ కారిడార్ అభివృద్ధి కోసం వందల కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతాన్ని ఆక్రమించి వేలాది ఎకరాల రైతుల పంటభూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా రైతులనూ, సముద్రంలో చేపలవేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులను నిర్వాసితులను గావిస్తున్నారు. ఈ మూడేళ్ళ జగన్ ప్రభుత్వ పాలనా కాలంలో ఎన్నికల హామీలను 95 శాతం అమలు చేసామని అసత్యాలు, అర్ధసత్యాలతో కూడిన ఒక పుస్తకాన్ని ప్రచురించి, దాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని తన ఎమ్ఎల్ఏలకు దిశానిర్దేశం చేసి, 'గడపగడప'కు కార్యక్రమం చేపట్టాడు. ఈ కార్యక్రమంలో భాగంగా వెళ్ళిన వైఎస్ఆర్‌సీపీ నాయకులకు ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత, నిరసన, ప్రతిఘటన ఎదురవుతున్నది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, కొనసాగుతున్న ప్రజాందోళనలు, ప్రస్తుత రాష్ట్ర సంక్షుభిత, ఆర్థిక, రాజకీయ పరిస్థితిని తమ ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని ప్రతిపక్షపార్టీలు సర్కస్‌ఫీట్‌లకు దిగుతున్నాయి. దోపిడీ పాలకులెవరైనా సామ్రాజ్యవాద నిర్దేశిత విధానాలను అమలు చేసి, ప్రజలను దోపిడీ పీడనలకు గురిచేయడంలో ఆరితేరినవాళ్ళే. కనుక వాళ్ళ మోసపూరిత, దగాకోరు మాటలనూ, వాగ్దానాలను నమ్మి పదే పదే మోసపోకుండా ప్రత్యామ్నాయ ఉద్యమ మార్గం ఎంచుకోవాలి.

వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలన్నీ కూడా ప్రజలను దోపిడీ బంధనాలలో ఉంచి ప్రస్తుత దేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తూ, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ముందుకు తీసుకుపోయేవే. సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యంతోపాటు, తన ఆశ్రితులకు సేవ చేయడంలోనే మునిగితేలాడు. దళారీ పాలకవర్గాలు ఏవి కూడా ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించి స్వావలంబనతో కూడిన అభివృద్ధికి కృషి చేయవు, సరికదా రాష్ట్రాన్ని ఋణగ్రస్థంగా మార్చి ప్రజలను విచ్చలవిడి దోపిడీకి గురి చేస్తాయి.

ప్రస్తుత పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలముందున్న కీలకమైన రాజకీయ కర్తవ్యం కేంద్రంలోనూ, రాష్ట్రంలోను అధికారంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక ప్రతిఘాతుక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విశాల ప్రజలను ఐక్య ఉద్యమాలకు సిద్ధం చేయడమే. ఈ ఉద్యమాలను బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం, సామ్రాజ్యవాద ఎల్‌పీజీ విధానాలు భూమి, విస్థాపన, ప్రజాస్వామ్యం, ఉపాధి, ఉద్యోగుల, వివిధ సామాజిక సముదాయాల ప్రత్యేక సమస్యలు, సాగు, తాగు నీరు, విద్యా, వైద్యం, అధిక ధరలు, పాలకుల నిర్లక్ష్యం మూలంగా వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు రాష్ట్ర విభజన, పునర్వవస్థీకరణ-2013 చట్టంలో పొందుపరిచిన హామీల అమలు ప్రాతిపదికన సమరశీల ఐక్య ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. అయితే రాజ్యం అత్యంత ప్రతీఘాతుకంగా మారిన నేపథ్యంతోపాటు మనం బలమైన శతృవుతో పోరాడుతున్నాం. కనుక తమ సమస్యలపై విడివిడిగా కాకుండా, విశాల ప్రజలు తమ ఉమ్మడి శతృవుకు వ్యతిరేకంగా సమైక్యమై, సరైన రాజకీయ నాయకత్వాన్ని ఏర్పర్చుకొని బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి. అందులో అన్ని వర్గాల పీడిత ప్రజలు, సాంఘీక సమూహాలు, ప్రజాపక్షం వహించే ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల శక్తులు, నిజమైన దేశభక్తులు, సంస్థలు, పార్టీలు, వ్యక్తులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఈ పోరాటాల లక్ష్యం ప్రజలను రాజకీయంగా చైతన్యపరుస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే విధంగా కొనసాగాలి.

# ఏఓబీ విప్లవోద్యమంలో మహిళల పాత్ర

"శ్రామిక మహిళలు పాల్గొనకుండా మానవజాతి చరిత్రలో పీడిత ప్రజల ఏ ఒక్క ఉద్యమమూ సాగలేదు. పీడితులందరిలోకెల్లా అత్యధికంగా పీడించబడే శ్రామిక స్త్రీలు విముక్తి ఉద్యమాలకు ఎన్నడూ దూరంగా వుండలేదు. అలా ఎన్నటికీ ఉండలేరు కూడా" – కామ్రేడ్ స్టాలిన్.

ఏఓబీ విప్లవోద్యమంలో మహిళల క్రియాశీల భాగస్వామ్యం, సాహసిక, వీరోచిత ప్రాతను తెలుసుకోవాలంటే ముఖ్యంగా ఏఓబీ ప్రాంతానికి వున్న భౌగోళిక, సామాజిక, చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. 1980లో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో తూర్పుకనుమల్లో పురుడుపోసుకున్న విప్లవోద్యమం 2 దశాబ్దాలపాటు వీరోచిత ప్రజాపోరాటాలతో, సాయుధ ప్రతిఘటనలో, అనన్య త్యాగాలతో పురోగమిస్తూ విశాఖపట్నం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం విజయనగరం, మల్కనగిరి, రాయగడ, గజపతి, గంజాం జిల్లాలతో కూడిన 4 డివిజన్ల ఉద్యమంగా అభివృద్ధి చెంది, 2001 నాటికి విముక్తి ప్రాంత లక్ష్యంతో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏఓబీ) ఒక ప్రత్యేక జోన్‌గా ఏర్పడింది. అలా ఏఓబీ ప్రత్యేక జోన్‌గా ఏర్పడి నేటికి మరో 2 దశాబ్దాలు గడిచిపోయాయి. ఈ 4 దశాబ్దాల కాలంలో అనన్య త్యాగాలతో వీరోచిత చరిత్రను లిఖించిన మహిళల్లో ఏఓబీ మొట్టమొదటి అమరురాలు 1985లో కామ్రేడ్ లోతా రాజేశ్వరి మొదలుకుంటే 2021లో కామ్రేడ్ సోని వరకూ 98 మంది వీరనారులు తమ నెత్తురు ధారపోసారు. 2005 నాటికి ఏఓబీ విప్లవోద్యమం 25 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 2006లో ఏఓబీ మహిళా అమరవీరుల జీవిత చరిత్రలను 'నేలతల్లి విముక్తి కోసం నింగికెగసిన అరుణతారలు' అనే పేరుతో ఒక పుస్తకంగా ప్రచురితమయ్యింది. అందులో శ్రీకాకుళ సాయుధ పోరాటంలో వీరోచిత పాత్ర పోషించి కొన్ని తరాల మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన కామ్రేడ్ పంచాది నిర్మల, సరస్వతి, అంకమ్మల



చరిత్రలతోపాటు, వీరి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో 1980లో ప్రారంభమైన ఉద్యమం నుండి 2006 వరకూ ఏఓబీలో అమరులైన 35 మంది మహిళా అమరుల చరిత్రను నమోదు చేసారు. ఆ తదుపరి కాలంలో నేటికీ మరో 63 మంది ఏఓబీ విప్లవోద్యమాన్ని పురోగమింపచేస్తున్న క్రమంలో అమరత్వపు శిఖరాలను అధిరోహించారు. వీరందరిలో ప్రధానంగా ఏఓబీ నేలపై పుట్టి, పెరిగి, ఇక్కడే ఒరిగిపోయిన భూమి పుత్రికలు ఉండగా, ఎక్కడో పుట్టి ఇక్కడి ఉద్యమాన్ని చూసి స్పందించి ఈ ఉద్యమంలో భాగమై ఈ నేలను తమ నులివెచ్చని నెత్తురితో తర్పణ చేసినవారు కామ్రేడ్స్ మద్దిల స్వర్ణ, ప్రేమలత, చిన్నస్వర్ణ, జందనం సావిత్రి, కర్నాటక ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ అనిత, కామ్రేడ్ కరుణ, ఏపీ, తెలంగాణ ఉద్యమం నుండి ఏఓబీకి బదిలీ అయి కామ్రేడ్ భవాని, కామ్రేడ్ సరిత, కామ్రేడ్ లత, కామ్రేడ్ మహిత, కామ్రేడ్ భారతి, కామ్రేడ్ మీనాలు ఇక్కడి చరిత్రలో కలిసిపోయారు. దండకారణ్యంలో పుట్టిన కామ్రేడ్స్ మంజుల, బుద్రి, కుమారి, హారతి, రణతిలాంటి ఎందరో తమ అమరత్వంతో తూర్పు కనుమలకు అరుణిమనద్దిన వీర యోధురాళ్ళతోపాటు, సాధారణ మహిళలు కూడా ఎందరో ఈ చరిత్రలో భాగమయ్యారు. ఇలా అడవి, మైదానాలు, పట్టణాలను అనుసంధానిస్తూ, ఉద్యమించిన ఈ అమరవీరులు పుట్టి, పెరిగి, ఉద్యమాల్లోకి వచ్చిన నేపథ్యాల్లో భిన్నత్వాలు ఉన్నప్పటికీ, ఏఓబీ అమరులుగా ఈ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఈ అమరవీరనారులందరికీ తలవంచి వినమ్రంగా జోహార్లర్పిస్తూ ఏఓబీ విప్లవోద్యమ చరిత్ర నిర్మాణంలో వీరి కృషిని తెలుసుకుందాం.

ఏఓబీ ప్రాంతం భౌగోళికంగా దట్టమైన అడవులతో, చాలా ఎత్తైన కొండలతో కూడుకొని ఉంది. గోదావరి, శబరి, సీలేరు, తాండవ, లోతుగడ్డ, పంపా, వంశధార, నాగావళి, సువర్ణముఖి, బహుదా, వేగావతి వంటి అనేక జీవనదులతోపాటు, వేలాది ఊట చెలిమెలతో పుష్కల జలసంపదతో పెనవేసుకుని పచ్చని ప్రకృతిలో, అరుదైన జీవజాలంతో నిండిన ప్రాంతం. బాక్సైట్, గ్రానైట్, మాంగనీసు, లేటరైట్, జింక్ తదితర విలువైన ఖనిజ సంపద ఈ కొండల్లో నిక్షిప్తమై ఉంది. అపారమైన కలప, అటవీ ఉత్పత్తులు, వన మూలికలు, ప్రజలు పండించే అపరాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, కాఫీ, సిల్వర్, జామాయిల్, టేకు, పండ్ల తోటల వంటి వ్యాపార పంటలకూ ఈ ప్రాంతం ఎంతో అనువైనది.

సామాజికంగా ఈ ప్రాంతం అనేక తెగలతో కూడిన ఆదివాసీ సమాజం. భగత, కొండరెడ్లు, కొండదొర, కొండకమ్మరి, కోయదొర, కువ్వి, పొరజ, నూకదొర, నూకరెడ్లు, రిమో, కొటియా, గదబ, మటియా, సవర, డిడొయ్, భూమియా ... ఇలా 26 తెగల దాకా ఉన్నాయి.

ఏఓబీ ప్రాంతం సర్వసంపదలకు నిలయమే కాకుండా, ఆ సంపదలను దోపిడీ వర్గాల నుండి కాపాడుకునేందుకు వీరోచిత పోరాటాలను నిర్వహించిన ఎందరో భూమి పుత్రికలకు, పుత్రులకు కూడా నిలయమే. ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతల వలనే శతాబ్దాలుగా పరాయి రాజులు, బ్రిటీష్ వలసవాదులు, ఈ ప్రాంతంపై పట్టు సంపాదించి ఇక్కడి సంపదను దోచుకునేందుకు స్థానిక ఆదివాదీ ప్రజలపై అనేకసార్లు కౄరమైన దాడులు నిర్వహించారు. ఈ దాడులన్నింటినీ స్వేచ్ఛాప్రియులైన ఇక్కడి ఆదివాసీలు గొప్ప తిరుగుబాట్లతో ఎదుర్కొన్నారు.

ఏఓబీలోని తూర్పు కనుమల్లో మన్యం పేరు వింటే మనకందరికీ గుర్తొచ్చేది బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా అల్లూరి నాయకత్వంలో జరిగిన 'మన్యం పితూరి'. ఈ పోరాటంలో సాహసంగా పోరాడి ఆ ప్రాంత ప్రజానీకంలో అమరత్వాన్ని గడించిన రత్తి అనే ఆదివాసీ మహిళను గురించి వింటాం. ఆమెను ఎద్దుమామిడి అనే గ్రామంలో బ్రిటిషు పోలీసులు పట్టుకొని కిరాతకంగా చిత్రహింసలు పెట్టి చంపారు. 'మన్యం పితూరి' కంటే ముందు 1802-03లో రంపచోడవరం ప్రాంతంలో రాంభూపతి నాయకత్వంలో కోయ తిరుగుబాటు, 1879లో తమ్మనదొర నాయకత్వంలో కోయ, కొండరెడ్ల తిరుగుబాటు, 1918లో ద్వారబందాల రామచంద్రయ్య నాయకత్వంలో తిరుగుబాటు, ఒడిషాలో 'లక్ష్మణ్ నాయక్' నాయకత్వాన ప్రసిద్ధి చెందిన కోరాపుట్ తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లన్నింటిలోనూ మహిళల పాత్ర చాలా విశేషమైనది. ఈ తిరుగుబాట్లను అణచివేయడంలో భాగంగా మహిళలను అరెస్టులు చేసి, చిత్రహింసలు పెట్టి, అత్యాచారాలను చేసినా వారు శతృవు ముందు తలవంచలేదు. అత్యంత పాశవిక అణచివేతకు గురయిన ఈ తిరుగుబాట్లు ఓడిపోయినప్పటికీ, వాటి స్ఫూర్తి మాత్రం మాసిపోకుండా తరతరాలకు ప్రసారమవుతోంది. అదే విధంగా నాటి మహిళల పోరాట వారసత్వం కూడా కొనసాగుతూనే ఉంది.

1947 అధికార మార్పిడి తర్వాత కూడా ఇక్కడి ఆదివాసీ ప్రాంతాలపై రాజ్యంతోపాటు, బహుళజాతి సంస్థల, ఆదివాసేతర భూస్వాముల దోపిడీ పీడనలు యదేచ్ఛగా కొనసాగించాయి. ఈ వైరుధ్యం ఫలితంగా నక్సల్బరీ నిప్పురవ్వ దావానలంలా దేశమంతా వ్యాపించింది. 1960 దశకంలో భారత విప్లవ నేత కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో విప్లవ నగారా దేశం నలుమూలల్లో మ్రోగింది. తూర్పు కనుమల్లోని శ్రీకాకుళం సింహగర్జన చేసింది. సవర, జాతాపు ఆదివాసీ రైతాంగ ఉద్యమం ఉప్పెనై ఎగిసి పడింది. సముద్ర తీర ఉద్దానం ఉద్యమాల గడ్డ అయ్యింది. వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం నాయకత్వంలో సాయుధ ఆదివాసీ రైతాంగం దోపిడీ పాలకవర్గాలకు సింహస్వప్నమయ్యారు. 1967 అక్టోబర్ 31న మొండెంఖళ్ళులోని గిరిజన సమావేశానికి వెళుతున్న ఆదివాసీలపై లేవిడి వద్ద భూస్వాముల గూండాలు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో కోరన్న, మంగన్నలు అమరులయ్యారు. ఈ ఘటనలో మహిళలు ఎర్రచీరలు కట్టుకొని, ఎర్రజెండా పట్టుకొని విప్లవ గీతాలు పాడుతూ సమావేశానికి వెళుతుండగా గూండాలు వారిపై దాడి చేసి చీరలు చింపివేశారు, ఎర్రజెండాలు కాల్చివేసారు. అయినా మహిళలు కారంపొడి చల్లి గూండాల్ని రాళ్ళతో, కర్రలతో కొట్టి ప్రతిఘటించారు. అనేక మంది మహిళలను పోలీసులు అరెస్టు చేసారు. 1968 నవంబర్ 24న పంచాది నిర్మల, పాణిగ్రాహి సుబ్బారావుల నాయకత్వంలో గెరిల్లా దళం ఉద్దానం ప్రాంతం, గరుడబద్ర గ్రామానికి చెందిన భూస్వామి మద్ది కామేష్‌కి సంబంధించిన వరిపంటను కోసుకెళ్ళడంతో శ్రీకాకుళ ఉద్యమంలో గెరిల్లా పోరాటపు మొదటి దశ ప్రారంభమయ్యింది. కామ్రేడ్ పంచాది నిర్మల దళనాయకురాలిగా అనేక దాడులకూ, పోరాటాలకు నాయకత్వం వహించింది. ఆమె సహచరుడు, పోరుగురువు, మార్గనిర్దేశకుడు అయిన పంచాది కృష్ణమూర్తిని 1969 మే 27న పోలీసులు దారుణంగా కాల్చిచంపారు. ఆ విషాదాన్ని ఆమె అత్యంత చైతన్యవంతంగా ఎదుర్కొంది. మరింత వర్గకసితో వర్గపోరాటానికి నాయకత్వం వహించింది. ఆమె పేరు వింటే దోపిడీ వర్గాలకు హడలు పుట్టేది. పీడిత ప్రజలు ఆమెను దేవతగా భావిస్తే, ప్రజా శతృవులు

ఆమెను తమ పాలిట మృత్యుదేవతగా భావించేవారంటే అతిశయోక్తి కాదు. అలాంటి వీరనారిని 1969, డిసెంబర్ 22న తన సహచరులు కామ్రేడ్స్ అంకమ్మ, సరస్వతి, చాగంటి, పాణిగ్రాహి, తామాడ చినబాబు, రమేష్ సాహులతోపాటు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి, రంగమెటియా కొండల్లో కాల్చి చంపారు. నక్సల్బరిని ఒడిసి పట్టుకున్న సిక్కోలు పోరులో కామ్రేడ్ పంచాది నిర్మల లాంటి ఎందరో మహిళలు క్రియాశీల భాగస్వామ్యమే కాక, నాయకత్వాన్ని కూడా అందించి, వీరోచితంగా పోరాడుతూ 25మంది వీరనారీమణులు తృణప్రాయంగా తమ ప్రాణాలర్పించి శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాన్ని చారిత్రాత్మకం చేసారు.

నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలను అణచివేశామని పాలకవర్గాలు సంబరపడ్డాయి. దశాబ్దం తిరక్కముందే ఆ పోరు కెరటం మరింత ఉవ్వెత్తున జగిత్యాల, సిరిసిల్ల జైత్రయాత్రగా ఎగిసింది. 1977-78లో కరీంనగర్-అదిలాబాద్ నాగేటిచాళ్ళల్లో రగిలిన రైతాంగ ఉద్యమం భూస్వామ్యాన్నీ, దొరతనాన్ని చావుదెబ్బతీస్తూ ఊరూరు పోరైంది. తీవ్రమైన రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే ఆ ఉద్యమం గోదావరి నదికి ఆవల ఉన్న విశాల అటవీ ప్రాంతానికి విస్తరించింది. అలా 1980 నాటికి దండకారణ్య అటవీ ప్రాంతానికి 7 దళాలు ప్రవేశించాయి. అందులో ఒక దళం 1980 జూన్‌లో విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల మన్యంలోకి అడుగిడింది. అలా పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలోని దళం స్థానిక ప్రజలతో మమేకమవుతూ వారి విశ్వాసాన్ని చూరగొన్నారు. ప్రజలపై కొనసాగుతున్న సకల దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా ఆదివాసులను సంఘటితపరిచారు. ఫలితంగా ఆదివాసీ రైతాంగం తమ జీవితంలో సకల పార్శ్వాలనూ క్రూరంగా శాసిస్తున్న దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించింది. మొదటిగా అడవిలో ఫారెస్టు అధికారుల, రెవెన్యూ అధికారుల దోపిడీ ఆధిపత్యాలను కూకటివేళ్ళతో పెకిలించారు. షావుకార్ల, తునికాకు కాంట్రాక్టర్ల, పేపరుమిల్లు యజమానుల దోపిడీ దౌర్జన్యాలను ఎదిరించారు. ముఖ్యంగా ఆదివాసుల ప్రధాన జీవనోపాధి అయిన అడవినీ, భూమిని ప్రభుత్వం, బహుళజాతి సంస్థలు, ఆదివాసేతర భూస్వాములు కబ్జా చేయటాన్ని ఆదివాసీ రైతాంగం అడ్డుకున్నారు. 'కొండపోడు మా జన్మహక్కు', 'సంపదపై సకల అధికారాలు మావే'నని నినదించారు. బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం వేసిన జామాయిల్, సిల్వర్ ప్లాంటేషన్లను నరికి సాగుభూమిగా చేసుకున్నారు. నాటి నుండి నేటి వరకూ ఇలా స్వాధీనం చేసుకున్న భూమి లక్ష 50వేల ఎకరాలకు పైగానే వుంటుంది. ఇక మైదానాల నుండి వచ్చిన ఆదివాసేతర భూస్వాముల దోపిడీ, పీడనలకు అమానవీయ పద్ధతులకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలు ఉప్పెనలా కదిలారు. ఈ పోరాటాలకు అడ్డు వచ్చిన క్రూరమైన భూస్వాములను ఖతం చేసారు. ఇలా ఈస్ట్ డివిజన్‌లో 700 గ్రామాల ప్రజలు 17వేల ఎకరాల భూములనూ, శ్రీకాకుళంలో 34 గ్రామాల ప్రజలు వెయ్యి ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. బాసధార డివిజన్‌లో వేలాది మంది రైతాంగం కదిలి భూస్వాముల పంట పొలాలపై దాడి చేసి వందలాది ఎకరాలలో పంటలు స్వాధీనం చేసుకున్నారు. కోరాపుట్ జిల్లా నారాయణపట్నం, బందుగాం బ్లాక్‌లలో 11 పంచాయితీలకు చెందిన ప్రజలు భూస్వాముల నుండి, షావుకార్ల నుండి 4వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నారు. బైఫర్‌గూడ బ్లాక్‌లో అటవీశాఖ ఆధీనంలోఉన్న 15వందల ఎకరాల ప్లాంటేషన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్‌లో కూడా భూస్వాముల భూములను రైతాంగం స్వాధీనం చేసుకున్నారు. ఎమ్‌కేబీ డివిజన్ కటాఫ్ ప్రాంతంలో ప్రజల కనీస అవసరాలను కూడా పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమైన సమరశీల పోరాటాలను చేస్తూనే మరోవైపు గిరిజనేతర నుండీ భూస్వాములకు చెందిన వందలాది ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని ప్రజలకు పంపిణీ చేసుకున్నారు. విప్లవకర భూ సంస్కరణలనూ, వ్యవసాయ విప్లవ కార్యక్రమాలను చేపట్టి ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పును తీసుకువచ్చారు. విశాఖ మన్యంలో 80లలో ఏపీఎఫ్‌డీసీ కాఫీ ప్లాంటేషన్లలో కూలిరేట్ల కోసం ప్రారంభమైన పోరాటం క్రమంగా కాఫీతోటల ఆక్రమణ పోరాటాలుగా మారి 650 హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్లను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా గొప్ప మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. ఈ పోరాటాల ఫలితంగా దోపిడీ పాలకవర్గాలు తమ ప్రయత్నాలు విరమించుకోక తప్పలేదు. 97జీవోను రద్దు చేయక తప్పలేదు. ఒడిశాలో నవీన్ ప్రభుత్వం మాలి, దేవ్‌మాలి పర్వాతాలలో బాక్సైట్ గనులకు అనుమతిచ్చి ఆదివాసీలను నిర్వాసితులను చేయప్రయత్నిస్తే ప్రజలు అత్యంత మిలిటెంట్‌గా పోరాడుతున్నారు.

ఇలా పార్టీ ఇచ్చిన చైతన్యంతో ఆదివాసీ రైతాంగం గత 4 దశాబ్దాలుగా ఎక్కడ దోపిడీ ఉంటే అక్కడ తిరగబడ్డారు. నిత్య జీవితంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తూనే మరోవైపు రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన వివిధ రకాల పోరాటాలలో, ప్రతిఘటనలో భాగమయ్యారు.

ఈ పోరాటాలన్నింటిలోనూ మహిళలు అత్యంత చురుకైన, క్రియాశీలమైన వీరోచితమైన పాత్రను పోషిస్తున్నారు. మహిళల భాగస్వామ్యం లేని పోరాటం, ఆందోళన, ప్రదర్శన, ఊరేగింపు, ప్రతిఘటన, సభ, సమావేశం ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు. మహిళలే ముందు భాగాన ఉన్న సంఘటనలు, మహిళలు మాత్రమే ఉన్న సంఘటనలూ అనేకం ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనవి కొన్ని చెప్పుకుందాం.

- 1983, పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో ఆదివాసీలు సంఘటితమై చేస్తున్న పోరాటాలు ఉవ్వెత్తున్న ఎగిసిన కాలం. అలాంటి పోరాటాలలో అత్యంత మిలిటెంట్‌గా కదులుతున్న గ్రామాలపై కక్ష సాధింపు చర్యగా అటవీశాఖ అధికారులు, పోలీసులు కలిసి దాడులు చేయడం మొదలుపెట్టారు. తూర్పు గోదావరి జిల్లా పైడపాల అనే గ్రామంపై జూన్ 20వ తేదీన 12 మంది అటవీశాఖ సిబ్బంది దాడి చేసి ఇళ్ళలో ఉన్న కలప ముక్కలను లారీలో వేసుకోవడానికి ప్రయత్నించారు. గ్రామంలో భూస్వాములు వారికి అండగా నిలిచారు. అయితే గ్రామంలోని మహిళలంతా వెంటనే సమావేశమయ్యి మగవారిని కలుగజేసుకోవద్దని చెప్పి లారీలకు అడ్డంగా నిలబడ్డారు. తమ మీద దౌర్జన్యం చేయబోయిన అటవీ సిబ్బంది కళ్ళల్లో అకస్మాత్తుగా కారం చల్లారు. మహిళలంతా కలిసి వారిని చితబాదారు. చేసేది లేక సిబ్బంది మహిళల కాళ్ళు పట్టుకొని క్షమాపణ అడిగి తిరిగి వెళ్ళిపోయారు. తర్వాత 10 రోజులకు మళ్ళీ ఈ సారి 25 మంది అటవీ సిబ్బంది, 25 మంది స్పెషల్ పోలీసులు కలిసి ఆ గ్రామం మీద దాడి చేసారు. ఆ సమయానికి ఇళ్ళల్లో ఎవరూ లేరు. పనుల్లో ఉన్న మహిళలకు ఈ విషయం తెలిసి సుమారు 200 మంది మహిళలు జమయ్యి కారంనీళ్ళతో వచ్చి లారీలకు అడ్డంగా నిలుచున్నారు. పోలీసులు తుపాకులు లోడు చేసి కాల్చుతామని బెదిరించినా మహిళలు ధైర్యంగా

ఎదురు తిరిగి వారితో ఘర్షణ పడి వారు చూస్తుండగానే లారీల్లోకి ఎక్కించిన తమ కలపనంతా దించి తమ ఇళ్ళలోకి చేర్చుకున్నారు. ఆ మహిళల ఆగ్రహాన్ని చూసిన పోలీసులూ, అటవీ సిబ్బంది వారికి క్షమాపన చెప్పి వెనుతిరగక తప్పలేదు. ఆ మహిళలు తమ విజయానికి సంకేతంగా ఊరంతా పాటలు  పాడుతూ ఊరేగింపు జరిపారు.

– 1983 నుండి మన్యం ప్రాంతంలో మొదలైన తునికాకు పోరాటంలో మహిళలు ముందు వరుసలో ఉన్నారు. గ్రామస్తులందరి ముందు వాళ్ళు కాంట్రాక్టర్లతో చర్చలు జరిపేవారు. ఒక కాంట్రాక్టర్ సన్యాసమ్మ అనే ఆదివాసీ మహిళతో చర్చించడానికి నిరాకరించినప్పుడు ఆమె అతడితో “నీ జీపు తాళాలు ఇవ్వు నేను నడిపి చూపిస్తాను, నువ్వు తునికాకుల సంచి మోసి చూపించు” అని సవాలు విసిరింది.

1984 సెప్టెంబర్ 6న కోనలోవ భూస్వాములు, రంపచోడవరం సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 30 మంది పోలీసుల సాయంతో అచ్చంపేట ఊరును చుట్టుముట్టి రైతాంగ కార్యకర్త కామ్రేడ్ నల్లన్నను పట్టుకుని విపరీతంగా కొట్టి స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. వెంటనే 200 మంది ఆదివాసీ స్త్రీలు కదిలి అడ్డతీగల వెళ్ళి నల్లన్నను విడుదల చేయాలని తహశీల్దారును డిమాండ్ చేసారు. 24 గంటలు పోయాక చూద్దాం అని ఆర్‌డీఓ అధికార దర్పాన్ని ప్రదర్శించాడు. తమ నాయకుణ్ణి అంత సులువుగా విడుదల చేయరని గ్రహించిన మహిళలు, మరికొంత మంది పురుషులు కలిసి దారికాచి ఆర్‌డీఓ జీపును దారిలో ఆపి ఆర్‌డీఓ విష్ణుని బందీని చేసి, అడవికి తీసుకుపోయి ప్రభుత్వానికి సవాలు విసిరారు. 10 గంటల్లో తమ నాయకుడిని విడిపించుకున్నారు.

– 2002, మార్చి 8న అంతర్జాతీయ మహిళాదినం కార్యక్రమాన్ని అడ్డుకోవాలని వచ్చిన పోలీసులు శ్రీకాకుళం డివిజన్‌లోని దేరువాడ గ్రామం నుండి సంతకు వెళుతున్న ఇద్దరు గ్రామస్తులను పట్టుకుని తమ వెంట తీసుకుపోతుంటే వారిని విడిపించుకోవడానికి సుమారు 500 ప్రజలు కదిలారు. అందులో సగంకంటే ఎక్కువ మహిళలే. వారు రోడ్డు పక్కనున్న రాళ్ళను చేతుల్లోకి తీసుకున్నారు. ‘వెనక్కు వెళ్ళండి లేదంటే ఫైర్ చేస్తా’మని పోలీసులు చేసిన హెచ్చరికను లెక్క చేయకుండా పోలీసులపై రాళ్ళ వర్షం కురిపించారు. పోలీసుల తలలు పగిలి తాము పట్టుకుపోతున్న ఇద్దరు గ్రామస్తులను వదిలి పారిపోయారు.

– నారాయణపట్నలో ప్రారంభమైన భూపోరాటం 2009లో ఉవ్వెత్తున ఎగిసి గొప్ప చారిత్రాత్మక పోరాటంగా చరిత్రలో నమోదయ్యింది. అలాంటి పోరాటంలో ఆదివాసీ రైతాంగ మహిళలు ఉత్తేజకరమైన పాత్రను పోషించారు. గ్రామాలపై పోలీసుల, శాంతిసేన తదితర మూకల దాడులు నిత్యకృత్యమైపోయిన పరిస్థితుల్లో ప్రతిఘటించడం కోసం మహిళలు సాంప్రదాయక ఆయుధాలతోపాటు కారంపొడిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకున్నారు. “మేం ముందు ఉంటాం, మీరు మా వెనుక ఉండండి” అని పురుషులను వెనక్కు పంపి తామే ప్రతిఘటనకు నాయకత్వం వహించి పోలీసులతో ఘర్షణపడి, గాయపర్చిన, తరిమికొట్టిన సంఘటనలు ఎన్నెన్నో ఉన్నాయి.

బొరిగి పంచాయితీ లెల్లిపాయ్ అనే గ్రామంపై 2009 జూన్‌లో 50 మంది పోలీసులు దాడి చేసి పురుషులను పట్టుకెళ్ళడానికి ప్రయత్నిస్తే మహిళలంతా కలిసి ఒక పోలీసుని పట్టుకొని కొట్టారు. దాంతో భయపడిపోయిన పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి ఆ పోలీసులను విడిపించుకుని పారిపోయారు.

2009, ఆగస్టు 3న 35 మంది ఏపి గ్రేహౌండ్స్ పోలీసులు బందుగాం బ్లాక్ కేరుబడి పంచాయితీ, జంగిడివలస అనే గ్రామంపై దాడి చేసారు. ఆ సమయంలో గ్రామంలో మహిళలు మాత్రమే ఉన్నారు. వాళ్ళంతా పోలీసులను చుట్టుముట్టి ఘర్షణ పడుతూనే పనులకు వెళ్ళిన తమ పురుషులకూ, సమీప గ్రామాలకు కబుర్లు పంపటంతో కొద్ది సేపట్లోనే అన్ని వైపుల నుండి స్త్రీలు, పురుషులు సాంప్రదాయక ఆయుధాలతో వచ్చి పోలీసుల దగ్గరున్న ఆయుధాలనూ, సెల్‌ఫోన్లనూ, కిట్టుబ్యాగులను గుంజుకున్నారు. పోలీసులను తాళ్ళతో కట్టేసారు. వాళ్ళను బందీలుగా ప్రధాన రహదారి వరకూ నడిపించుకువెళ్ళారు. బీడీఓ, ఎస్‌ఐలు వచ్చి ‘గ్రామాలపై దాడులు చేయమని’ హామి పత్రం రాసి ఇస్తేగానీ ప్రజలు పోలీసులను విడిచిపెట్టలేదు.

2009 అక్టోబర్‌లో నారాయణపట్న ఛసిమూలియా సంఘనాయకులు నాచికలింగ, సింగన్నలను అరాచకులుగా చిత్రీకరించి పోలీసులు వారి ఫోటోలను ముద్రించిన పోస్టర్లు వేసారు. దీనికి వ్యతిరేకంగా 2వేల మంది మహిళలే కదిలి నారాయణపట్న పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోస్టర్లను చింపివేశారు. స్టేషన్‌గేట్లకు తాళాలు వేసినా, లాఠిచార్జి చేసినా గేట్లుదూకి లోపలికి వెళ్ళి స్టేషన్ ఎస్‌ఐను నిలదీశారు.

2009 నవంబర్ 20న నారాయణపట్న పోలీసుస్టేషన్‌కు వెళ్ళి నిలదీసిన సంఘటనలోనూ మహిళలు చురుగ్గా పాల్గొన్నారు. ఆ సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల అనంతరం అందరూ చెల్లాచెదురై పోయిన పరిస్థితుల్లో ఆ పోలీసు కాల్పుల్లో అమరులైన కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రుల శవాలకోసం మహిళలే వెళ్ళి పోలీసులతో కొట్లాడి శవాలను తీసుకొచ్చి, గౌరవప్రదంగా అంత్యక్రియలను జరుపుకున్నారు.

నవంబర్ 20 సంఘటన తర్వాత పోలీసులు గ్రామాలపై విచ్చలవిడిగా దాడులు చేసి, పురుషులను అరెస్టులు చేయడం సర్వసాధారణమయ్యింది. అలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులే ఉంటూ వ్యవసాయ పనులు చేస్తూ, సాంప్రదాయక ఆయుధాలతో సెంట్రీలు చేస్తూ తమ గ్రామాలనూ, ఆస్తులనూ, పంటలను రక్షించుకున్నారు. సంతలకు సైతం మహిళలే వెళ్ళేవారు.

– 2013, జనవరి 13వ తేదీన మల్కనగిరి జిల్లా, పొడియా ఏరియాలోని ఈలకట్ట గ్రామంపై సుమారు 300  మంది బీఎస్‌ఎఫ్ బలగాలు దాడి చేసి ఒక రోజంతా సోదాల పేరుతో ప్రజల డబ్బులనూ, విలువైన వస్తువులనూ, సాంప్రదాయక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 2వ రోజు కొందరు యువతులపట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో అప్పటి వరకూ మౌనంగా భరించిన మహిళలు 150 మంది వరకూ జమయ్యి ఆవేశంతో కారంపొడి, గొడ్డళ్ళు, కత్తులతో పోలీసులపై విరుచుకుపడ్డారు. గంటకుపైగా ఘర్షణపడి పోలీసులను గ్రామం నుండి తరిమికొట్టారు.

– 2013, మే 5న మల్కనగిరి జిల్లాలో పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా కలిమెల ఏవీఎమ్ఎస్ ర్యాలీకి పిలుపునిచ్చింది. దీన్ని అడ్డుకోవడానికి అన్ని వైపుల నుండి ఏరియా అంతా పోలీసు బలగాలు మోహరించాయి. అయినా వీటిని లెక్కచేయకుండా కలిమెల బ్లాక్‌లోని 7 పంచాయితీల నుండి విద్యార్థినులు, అన్ని వయసుల మహిళలు సుమారు 5వేల మంది కదిలి బొద్దేలు గ్రామం నుండి బెజ్జంగివాడ వరకు 3కి.మీ భారీ ర్యాలీ నిర్వహించారు.

– ఎమ్‌కేబీ డివిజన్ కటాఫ్ ఏరియాలోని డకడపోదూర్ గ్రామంలో దళం ఉందనే సమాచారంతో ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు 2018, అక్టోబర్ 11న రాత్రి గ్రామాన్ని అన్నివైపుల నుండి చుట్టుముట్టారు. ప్రజల సహకారంతో దళం తప్పుకుంది. ఉదయం పెట్రోలింగ్‌కు వెళ్ళిన ఇద్దరు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్టు చేసారు. ఈ సమాచారం తెలుసుకున్న 7గ్రామాల ప్రజలు, ప్రధానంగా మహిళలు అరెస్టు చేసి తీసుకుపోతున్న పోలీసు బ్యాచ్‌ని చుట్టుముట్టి అందులోని 10 మంది పోలీసులను అరెస్టు చేసి, పెద్దకొండపైకి ఎక్కించారు. అరెస్టు చేసిన మిలీషియా సభ్యులను బేషరతుగా విడుదల చేసి మాకు అప్పగిస్తేనే పోలీసులను వదిలిపెడతామని డిమాండ్ చేసారు. ఎంతో తర్జనా బర్జనా అనంతరం మహిళల డిమాండ్‌కు తలొగ్గి రాత్రి 10గం॥లకు అరెస్టు చేసిన వారిని విడుదల చేసి పోలీసులను విడిపించుకున్నారు.

– 2018, అక్టోబర్ 12న ఎమ్‌కేబీ డివిజన్, ఒండ్రుపల్లి వద్ద దళంపై పోలీసుల దాడిలో డీవీసీఎమ్ కామ్రేడ్ మీన అమరురాలైంది. ఆ ఘటన సందర్భంగా గ్రామంలో ఉన్న ముగ్గురు మహిళా మిలీషియా సభ్యురాళ్ళను అరెస్టు చేసి, తీసుకువెళుతున్న పోలీసులను చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి ప్రజలు వందల సంఖ్యలో చుట్టుముట్టి కామ్రేడ్ మీన శవాన్ని తమకు అప్పగించాలనీ, అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలని ఘర్షణకు దిగారు. చూస్తుండగానే జనాల సంఖ్య 3వేలకు పెరిగిపోయింది. మహిళలు ముందువరసలో నిలబడ్డారు. తమ వాళ్ళను ఎంతకూ విడిచిపెట్టకపోవడంతో ఆవేశం, కసితో రగులుతున్న ప్రజల్లో నుండి ఒకరు ఎస్ఐకి గురి చూసి 'గులివేరు'తో తలకు కొట్టాడు. పోలీసులు ప్రజలపై కాల్పులు జరిపారు. మహిళలు రాళ్ళు, కర్రలతో పోలీసులపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో ఎస్ఐతోపాటు 11 మంది గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి.

– 2019 జనవరిలో విశాఖజిల్లా, పెదబయలు ఏరియా, పుట్టకోట గ్రామ సంఘనాయకుడు రాంమూర్తిని గ్రేహౌండ్స్ బలగాలు అర్ధరాత్రి ఇంటిపై దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ఆయనను విడిపించుకోవడానికి గ్రామ మహిళలు పోలీసులతో తీవ్రంగా ఘర్షణ పడ్డారు. ఈఘర్షణలో ఐదుగురు పోలీసులకూ, కొందరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటనను నిరసిస్తూ, వందలాది మంది మహిళలు తెల్లవారి ఐటీడీఏ ముందు ర్యాలీ నిర్వహించి పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసారు.

– 2019 ఫిబ్రవరిలో విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, జాడిగూడ గ్రామాన్ని సుమారు 150 మంది బీఎస్ఎఫ్ బలగాలు రాత్రికిరాత్రే చుట్టుముట్టి సంఘనాయకులను అరెస్టు చేయడానికి ప్రయత్నించగా, వందలాది మంది మహిళలు అడ్డుకొని ఘర్షణకు దిగడంతో పోలీసులు కాల్పులు ప్రారంభించారు. కాల్పులను లెక్క చేయకుండా కర్రలు, రాళ్ళతో ప్రతిఘటించడంతో ముగ్గురు పోలీసులు గాయపడగా, మిగిలినవాళ్ళు కాళ్ళకు బుద్ధిచెప్పి పారిపోయారు. ఆ సందర్భంగా మహిళలు, పోలీసులకు చెందిన వాకీ, కొన్ని తూటాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

– 2019 సెప్టెంబర్‌లో మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, రంగినిగూడ గ్రామ సంఘనాయకుడు, పార్టీ సభ్యుడైన కామ్రేడ్ చిన్నారావు అనారోగ్యంతో వైద్యం కోసం తన కూతురుతో కలిసి జనతాపాయి సంతకు వెళ్ళాడు. పోలీసు ఏజెంటు ఇచ్చిన సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు వచ్చి సంతలో పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకువెళ్ళి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, హత్య చేసి శవాన్ని దాచి పెట్టారు. కుటుంబ సభ్యులు వెళ్ళి అడిగితే తమకు తెలియదని బుకాయించారు. ఆగ్రహించిన ప్రజలు అదే రోజు సాయంత్రానికి సుమారు 1500 మంది కర్రలు, విల్లుకాడులతో బొడపడ బీఎస్ఎఫ్ క్యాంపుపై దాడి చేసారు. బంకర్‌లో ఉన్న సెంట్రీని మహిళలు పట్టుకుని చెప్పులతో కొట్టారు. స్టేషన్‌లో సామాగ్రిని ధ్వంసం చేసి కాల్చివేశారు. జనతాపాయి బీఎస్ఎఫ్ క్యాంపుపై దాడి చేసి ఐదుగురు పోలీసులను గాయపర్చి, కామ్రేడ్ చిన్నారావు శవాన్ని తీసుకుని భారీ ఊరేగింపుతో గ్రామానికి వెళ్ళి, విప్లవ సాంప్రదాయాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేసారు. మరుసటిరోజు ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లోని అనేక గ్రామాలకు చెందిన 7వేల మంది ప్రజలు సమావేశమై నిర్బంధానికి వ్యతిరేకంగా డిమాండ్లను రూపొందించి అత్యంత సమరశీలంగా 8 రోజులపాటు ఆందోళనను నిర్వహించారు. ఈ ప్రతిఘటనా ఉద్యమంలో మహిళలు ముందు భాగాన ఉండి క్రియాశీల పాత్రను పోషించారు.

– 2020, జనవరి 20వ తేదీన పెదబయలు ఏరియా నీరుమామిడి అనే గ్రామం నుండి పనిపై వేరే గ్రామానికి వెళుతున్న ఇద్దరు గ్రామస్తులను మార్గమధ్యంలో పోలీసులు పట్టుకుని ఇంటరాగేషన్ చేయడం మొదలుపెట్టారు. పనికి వెళ్ళిన తమవాళ్ళు ఎంతకూ రాకపోవడంతో, చుట్టుపక్కల పోలీసు బ్యాచీలు కూడా వచ్చిన విషయం అర్థమయిన నీరుమామిడి గ్రామ మహిళలు, పురుషులు తమ పక్కన ఉన్న మరో 2 గ్రామాల ప్రజలను కలుపుకుని తమ వారి కోసం కొండలన్నీ వెతకడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో వీరికి ఒక గ్రామంలో వంటలు చేసుకుంటున్న ఒక పోలీసు బ్యాచ్ తారసపడింది. ప్రజలందరూ తమ వారిని ఎక్కడ పెట్టారో చెప్పాలని ఈ బ్యాచ్‌తో ఘర్షణకు దిగారు. ముఖ్యంగా మహిళలు గొడ్లను కట్టే తాళ్ళతో నలుగురు పోలీసులను కట్టివేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ఘర్షణలో మహిళల గాజులు పగిలి పోలీసుల చేతులకు గాయాలయ్యాయి. తమవారు నలుగురిని విడిచిపెడితేనే మిమ్మల్ని విడిచిపెడతామని పోలీసులను కదలనీయకుండా చుట్టూ కూర్చున్నారు. ఈ ఘర్షణ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. చివరకు పోలీసులు వాకీటాకీలతో మాట్లాడుకుని గ్రామస్తులను నలుగురినీ విడిచిపెట్టడంతో ప్రజలు పోలీసులను విడిచిపెట్టారు.

– 2020 సెప్టెంబర్‌లో పెదబయలు ఏరియా, కోండ్రు గ్రామంలో దళం ఉందనే పక్క సమాచారంతో ఉదయం 10గం॥ సమయంలో గ్రామాన్ని అన్నివైపులనుండి చుట్టుముట్టడానికి ప్రయత్నిస్తుండగా దళాన్ని రక్షించడానికి దాని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 400 మంది ప్రజలు ప్రధానంగా మహిళలు గ్రామం బయటనే అడ్డుకొని 'మా కందిచేళ్ళు తొక్కుతున్నారు'ని పోలీసులతో ఘర్షణపడటంతో తప్పనిసరి పరిస్థితులలో పోలీసులు వెనక్కి తగ్గారు. ప్రజలంతా తిరిగి గ్రామాలకు వెళ్ళిన తర్వాత మరిన్ని అదనపు బలగాలను పిలిపించుకొని సాయంత్రం 5గం॥ సమయంలో మరోసారి అన్ని వైపులనుండి గ్రామాన్ని దిగ్బంధించారు. దాంతో కోండ్రు గ్రామానికి చెందిన ప్రజలే సాంప్రదాయక ఆయుధాలను ధరించి, మహిళలు ముందువరుసలో నిలబడి ఒకవైపు పోలీసులను ప్రతిఘటిస్తూనే మరోదిశలో పోలీసుల కళ్ళుగప్పి దళాన్ని సురక్షితంగా తప్పించారు.

ఈ విధంగా రాజ్యహింసకు వ్యతిరేకంగా, గ్రామాలపై పోలీసు దాడులను ప్రతిఘటించడంలో, సంఘనాయకత్వాన్ని విడిపించుకోవడం,

దళాలకు సమాచారాన్ని ఇవ్వడం, దళాలను రక్షించుకోవడంలో మహిళలు అత్యంత సాహసంగా ప్రాణాలకు తెగించి పోరాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ క్రమంలో తాము కూడా పోలీసు బలగాల అత్యంత క్రూరమైన చిత్రహింసలకూ, అత్యాచారాలకూ, హత్యలకు గురైన హృదయాన్ని కలచి వేసే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాంటి సంధర్భాలలోనూ శతృవుకు తలవంచక వాడి చిత్రహింసలను గేలిచేస్తూ ధీరత్వాన్ని ప్రదర్శించిన మహిళలెందరో ఉన్నారు. ఉద్యమాలను అణచివేయడంలో భాగంగా ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న మహిళలనూ, ఉద్యమానికి మద్దతిస్తున్న మహిళలను ఉద్యమం నుండి దూరం చేయడం కోసం రాజ్యం మహిళలపై అత్యాచారాన్ని ఒక ఆయుధంగా ప్రయోగిస్తోంది.

1985-87 నిర్బంధకాలంలో మన్యంలో 120 మందికిపైగా మహిళలు కిరాతక పోలీసుమూకల సామూహిక అత్యాచారాలకు బలైపోయారు. చింతపల్లి మండలం లక్కవరం, అన్నవరం గ్రామాల్లో ఆంధ్ర స్పెషల్ పోలీసులు ఇద్దరు ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేయడంతో వాళ్ళు మతి చలించి పిచ్చివాళ్ళయ్యారు. లోతుగడ్డ గ్రామంలో 14 మంది పోలీసులు ఒక ఆదివాసీ యువతిపై కిరాతకంగా అత్యాచారం జరపడంతో ఆమె చనిపోయింది. దాకోడు గ్రామంలో తిరగబడ్డ రైతులను కట్టేసి వారి మహిళలను వారిముందే పోలీసులు సామూహికంగా అత్యాచారం చేసారు. పాడేరు మండలంలో పనసపల్లి గ్రామంలో ఒక మహిళను మొగనాలి తగువులో క్యాంపుకు తీసుకువెళ్ళి సీఐతోపాటు పోలీసులందరూ 3 రోజులపాటు ఆమెపై అత్యాచారం చేశారు. సింగవరంపాడు మునసబు భార్యను దళానికి భోజనాలు పెడుతున్నావంటూ 8 మంది పోలీసులు సామూహికంగా అత్యాచారం చేసారు.

– ఈస్ట్ డివిజన్‌లో తూర్పుగోదావరి జిల్లా శంకవరం మండలం డి.పైడిపాల గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళా కామ్రేడ్ చిన్న బుల్లక్క 1983లో పార్టీ పరిచయం అయినప్పటి నుండీ పార్టీ రాజకీయాలతో ప్రభావితమవుతూ, మహిళా సంఘంలో క్రియాశీల నాయకత్వం వహిస్తూ, అనేక ప్రజాపోరాటాలలోనూ, మిలిటెంట్ చర్యలలోనూ భాగస్వామ్యం అవుతూ తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసింది. 1990లో పార్టీ సభ్యురాలయ్యింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర వహిస్తున్న తన సహచరుడు అప్పల్నాయుడు సహజంగానే భూస్వాములకు శతృవయ్యాడు. పోలీసులకు టార్గెట్ అయ్యాడు. వీరిద్దరి కోసం పోలీసులు వేట మొదలుపెట్టడంతో నిర్బంధానికి భయపడకుండా, శతృవుకు లొంగకుండా ఇద్దరూ రహస్యంగా ఉండసాగారు. సాంప్రదాయక ఆయుధాలతో అడవిలో రక్షణ తీసుకుంటూ, ప్రజలను కలుస్తూ, పోరాటాలను నడిపారు. వీరిని ఎలాగైన పట్టుకోవాలని పోలీసులు అనేక కుట్రలు పన్నారు. 1991 మార్చిలో జిల్లాం అనే ఊరికి దళం వచ్చిందనీ, వారిద్దరినీ రమ్మన్నారనీ ద్రోహులుగా మారిన 5, 6గురు మాజీ సంఘ సభ్యులు వచ్చి చెప్పడంతో నిజమేనని నమ్మిన ఆ జంట వెలుతుండగా అకస్మాత్తుగా ఆ ద్రోహులు వారి మీదపడి కట్టేసి దగ్గరలో ఉన్న పోలీసుల దగ్గరకు తీసుకువెళ్ళారు. పోలీసులు కామ్రేడ్ అప్పల్నాయుడిని హింసించి హత్య చేసారు. కామ్రేడ్ చిన్న బుల్లక్కను సామూహికంగా అత్యాచారం చేసి ఆ తర్వాత గొయ్యితీసి, గొయ్యిలో వేసి, గొంతు వరకూ పాతిపెట్టి రాళ్ళతో కొట్టి క్రూరంగా హత్య చేసారు.

– 1991లో ఈస్ట్ డివిజన్‌లోని ఉల్లిపోగుల చీడపాలెం అనే గ్రామంపై ఒక సంఘనాయకుడిని పట్టుకోవడం కోసం పెద్ద సంఖ్యలో పోలీసులు దాడి చేసారు. అన్ని ఇండ్లలోనూ వెతకడం మొదలుపెట్టారు. ఆ సమయంలో మహిళాసంఘ నాయకురాలు కామ్రేడ్ సత్యవతి ధైర్యంగా ఆ సంఘ నాయకుడిని తన ఇంట్లో దాచి పెట్టింది. పోలీసులు వచ్చినప్పుడు అతడిని తన భర్త అని చెప్పి అతడిని కాపాడింది. అయితే ఆ తర్వాత పోలీసులకు ఆమె అబద్ధం ఆడిందని తెలిసి మళ్ళీ ఊరిపై దాడిచేసి గర్భవతిగా వున్న ఆమెను విచక్షణారహితంగా కొట్టి, చిత్రహింసలు పెట్టటంవలన ఆమె చనిపోయింది. ప్రాణాలు అర్పించి అయినా సరే సంఘాన్నీ, పోరాటాన్ని కాపాడుకోవాలనే ఒక ఉన్నతమైన ఆదర్శాన్ని నెలకొల్పి కామ్రేడ్ సత్యవతి అమరురాలయ్యింది.

– తూర్పుగోదావరి జిల్లా కొండకమ్మరి తెగలో పుట్టిన కామ్రేడ్ నూకాలమ్మ 1991, 1992 ప్రాంతంలో జరిగిన కూలిరేట్ల పోరాటాలు, భూపోరాటాలు, తునికాకు, వెదురు, పొగాకు గిట్టుబాటు ధరల పోరాటాల్లో చురుకైన పాత్ర వహించింది. క్రమంగా మహిళా సంఘ నాయకురాలయ్యింది. భూస్వాములనూ, పెత్తందార్లను ఎదిరించే శక్తిగా ముందుకొచ్చింది. దీన్ని సహించలేని భూస్వాములు, పెత్తందార్లు పోలీసులను ఆమెపైకి ఉసిగొల్పారు. 1992లో పోలీసులు గ్రామానికి వచ్చి ఆమెను పట్టుకొని అందరూ చూస్తుండగా తీవ్రంగా చిత్రహింసలు పెట్టి అత్యాచారం చేసి క్రూరంగా హత్య చేసారు.

– 2007, ఆగస్టు 20వ తేదీన కూంబింగ్ పేరుతో మన్యంలోకి ప్రవేశించిన పోలీసు బలగాలు వాకపల్లి గ్రామాన్ని చుట్టుముట్టి 11 మంది మహిళలపై సాముహికంగా అత్యాచారం జరిపారు. ఆ ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళనల సెగలు ఇంకా చల్లారక ముందే బరితెగించిన గ్రేహౌండ్స్ పోలీసులు ముంచంగిపుట్ మండలం బాబుశాల పంచాయితీ భల్లుగూడ గ్రామంలో నలుగురు ఆదివాసీ మహిళలపై 2010, జనవరి 22న అత్యాచారానికి పాల్పడ్డారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ తమ పురుషులను అరెస్టు చేసి, తమ చంకల్లోని చంటి పిల్లలను లాగి పారేసి తమపై పోలీసులు అత్యాచారం చేశారని ఈ నలుగురు మహిళలు స్థానిక ఎమ్ఎల్ఏ, తదితరులకు మొర పెట్టుకున్నారు. పోలీసుల ఈ దుర్మార్గ చర్యను ఖండిస్తూ మరోసారి మహిళా, ప్రజాసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమన్నాయి.

– 2012లో మల్కనగిరిలో బీఎస్ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేసిన దగ్గర అంతటా మహిళలను వేధించడం, అత్యాచారాలకు పాల్పడడం సార్వసాధారణమయ్యింది. గొడబెడ గ్రామం నుండి వెదురు కూలికి వెళ్ళి వస్తున్న వారిని చెకింగ్ పేరుతో భర్త ముందే పక్కకు తీసుకుపోయి అత్యాచారం జరిపి బయట చెబితే చంపుతామని బెదిరించి వదిలిపెట్టారు.

మల్కనగిరి ఎమ్‌వీ-3వ నంబర్ క్యాంపులో బీఎస్ఎఫ్ జవాను గ్రామంలో చొరబడి ఒంటరిగా వున్న మహిళపై అత్యాచారానికి ప్రయత్నించగా గ్రామస్తులు దేహశుద్ధి చేసారు. గోవిందపల్లిలో రాత్రి ఒంటరిగా వెళుతున్న ఇద్దరు యువతులను పెట్రోలింగ్‌కు వెళ్ళిన పోలీసులు సాముహికంగా అత్యాచారం చేసి ఎక్కడా చెప్పవద్దని బెదిరించారు.

2011లో మల్కనగిరిలో జిల్లా తెంతులిపొదూర్ వద్ద పోలీసులతో ఫైరింగ్‌లో అమరురాలయిన ఒక మహిళా కామ్రేడ్ శవంపై ఎస్‌ఓజీ,

బీఎస్ఎఫ్ జవానులు అత్యంత అమానవీయంగా అత్యాచారం జరిపి ఆ దృశ్యాన్ని వీడియో తీసారు.

2017, అక్టోబర్ 10న కోరాపుట్ జిల్లా కుందిలి పరిసర ప్రాంతంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై నలుగురు పోలీసులు జరిపిన అమానవీయ అత్యాచార ఘటన, దాన్ని వ్యతిరేకిస్తూ 2రోజులపాటు 'జాతీయ రహదారి బంద్' కోరాపుట్ జిల్లాలోనేకాక, యావత్తు ఒడిశా రాష్ట్రాన్నే కుదిపివేసింది. ఈ ఘటనలో దళిత కుటుంబానికి చెందిన ఆ బాలిక న్యాయం కోసం పోరాటం చేసి, చేసి అలసిపోయి చివరకు పోలీసుల, రాజకీయ నాయకుల ఒత్తిళ్ళతో, బెదిరింపులతో తనకిక న్యాయం జరగదని భావించి ఆత్మహత్య చేసుకుని చనిపోయింది.

– 2007లో వాకపల్లి మహిళలపై అత్యాచారం జరిగిన నాటి నుండీ పోలీసుల బెదిరింపులనూ, రాజ్యం ఒత్తిడిని లెక్కచేయకుండా ఆ మహిళలు న్యాయపోరాటాన్ని కొనసాగిస్తున్నారు. 2017 అగస్టు 20 నాటికీ 10ఏళ్ళు పూర్తయినా, కోర్టుల్లో వారికీ ఎలాంటి న్యాయం లభించలేదు. దానితో 2018 జనవరి 10వ తేదీన వాకపల్లి మహిళల న్యాయపోరాటానికి మద్దతుగా ఆదివాసీ విప్లవ మహిళాసంఘం నాయకత్వంలో సుమారు 7వేల మంది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించి, మహిళలపై పోలీసులు జరిపిన అత్యాచార సంఘటనలన్నింటిపై తక్షణమే న్యాయ విచారణ పూర్తిచేసి, దోషులైన పోలీసు అధికారులకు శిక్ష విధించాలని డిమాండ్ చేసారు. అలాగే అత్యాచారానికి గురైన మహిళలకు ఆర్థికంగా, హార్థికంగా మద్దతును అందించారు.

ఏఓబీ విప్లవోద్యమంలో భాగమవుతున్న మహిళలపై ఎంత హింసను ప్రయోగించినప్పటికీ, రాజ్యం ఆ మహిళలను ఉద్యమాలకు దూరం చేయలేకపోయింది. అణచివేత మరింత తిరుగుబాటుకే దారితీస్తుందనీ, ప్రతిఘటన ద్వారానే ఈ హింసను ఓడించగలమని గుర్తించిన ఈ మహిళలు మరింత చురుగ్గా పోరాటంలో పాల్గొంటున్నారు. వెనుకబడిన ఆదివాసీ సమాజంలో పుట్టి పెరిగిన మహిళలు ఇంత చైతన్యవంతంగా మారటం వెనుక మావోయిస్టు పార్టీ చేసిన రాజకీయ కృషి ఎంతగానో ఉంది.

1980 నుండి ఈ ప్రాంతంలో ఆదివాసీ రైతాంగాన్ని సంఘటితపర్చి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన పార్టీ ఆ పోరాటాలన్నింటిలోనూ పురుషులతోపాటు, స్త్రీలు పెద్దఎత్తున పాల్గొంటుండటంతో మొదట వారిని రైతుకూలీసంఘంలోనే భాగం చేసింది. అయితే పురుషుడితోపాటు, దోపిడీకి గురవుతున్న ఆదివాసీ మహిళ అదనంగా తెగలోని పితృస్వామ్యం, వివక్ష, అణచివేత వంటి ప్రత్యేక సమస్యలను కూడా ఎదుర్కొంటున్న కారణంగా ప్రత్యేకంగా మహిళా సంఘాలను నిర్మించాలని నిర్ణయించింది. అలా 1985 నుండే గ్రామాల్లో 'గిరిజన మహిళా సంఘాలు' ఏర్పర్చినప్పటికీ, 1990లో 'క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం' (కేఏఎమ్ఎస్) ఏర్పడిన తర్వాత అవి ఏరియా, జిల్లా స్థాయి నిర్మాణాలగా అభివృద్ధి చెందాయి. 1995లో దీనిపేరు ఆదివాసీ విప్లవ మహిళా సంఘం(ఏవీఎమ్ఎస్)గా మారింది.

1994లో శ్రీకాకుళం డివిజన్, ఉద్దానం ప్రాంతంలో మహిళా సంఘాలను చైతన్య మహిళా సంఘమనీ, కొండబారిడి ప్రాంతంలో సమతా మహిళా సంఘమనీ, మండలస్థాయి సంఘాలను నిర్మించారు. 1996 నుండి ఇక్కడ కూడా ఏవీఎమ్ఎస్ పేరుతోనే మహిళా సంఘాలను నిర్మించి పని చేయించడం జరుగుతుంది. 1995లో గుంటూరులో జరిగిన చైతన్య మహిళా సమాఖ్య మహాసభకు శ్రీకాకుళం డివిజన్ నుండి దాదాపు 200 మంది మహిళలు వెళ్ళారు. 1997 మార్చి 8, 9 తేదీలలో హైదరాబద్‌లో జరిగిన జాతీయ స్థాయి మహిళా సదస్సుకు సుమారు 200 మంది మహిళలు వెళ్ళారు. శ్రీకాకుళం డివిజన్ తరపున 'శ్రీకాకుళం పోరాటంలో మహిళల పాత్ర నాడు, నేడు' అనే అంశం మీద సెమినార్ పేపరును సమర్పించారు. ప్రత్యేకంగా మహిళా సంఘాల నిర్మాణం జరిగిన తర్వాత విప్లవోద్యమంలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 1990ల ప్రారంభంలో ఆదివాసీ క్రాంతికారి విప్లవ మహిళాసంఘం చేపట్టిన పోరాటంలో సారా వ్యతిరేక ఉద్యమం ముఖ్యమైనది. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసేతరులు, షావుకార్లు సారా వ్యాపారం చేస్తూ, ఆదివాసీ రైతాంగాన్ని సారా బట్టీల దగ్గర కూలీలుగా మారుస్తూ, ఆదివాసీల జీవితాలనూ, కుటుంబాలను నాశనం చేస్తున్న సారాకు వ్యతిరేకంగా జోన్ వ్యాప్తంగా అన్ని డివిజన్లలోనూ, అన్ని ఏరియాలలోనూ మహిళలు ప్రభంజనంలా కదిలి ఎన్నో మిలిటెంట్ పోరాటాలను నిర్వహించారు. ఆదివాసీ సాంప్రదాయం పేరుతో జరిగే బలవంతపు పెళ్ళిళ్ళకు వ్యతిరేకంగా, బహుభార్యత్వానికి వ్యతిరేకంగా మహిళలను చైతన్యపరుస్తూ ప్రచార క్యాంపెయిన్‌లను చేపట్టింది. అనేక మహిళా సమస్యలపై ప్రజాకోర్టులు నిర్వహించింది. మహిళలపై అత్యాచారాలు చేసిన వారికి శిక్షలు విధించింది. సమాన పనికి సమాన వేతనం కోసం అనేక పోరాటాల్లో మహిళల్ని కదిలించింది. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినాన్ని ప్రతీ సంవత్సరం విప్లవ సాంప్రదాయంగా, అత్యంత ఉత్తేజభరితంగా జరుపుకుంటూ అంతర్జాతీయతను ఎత్తిపడుతున్నారు.

ఏఓబీలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడం, మహిళా నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో 2003 చివరి నుండి డివిజన్ స్థాయిలో, బ్యూరోస్థాయిలో మహిళా కో–ఆర్డినేషన్ కమిటీ (ఎమ్‌సీసీ)లను ఏర్పర్చి కొంతకాలం పని చేయించారు. 2004 జూన్‌లో 4గురు మహిళా కామ్రేడ్స్‌తో జోన్ స్థాయిలో ఎమ్‌సీసీ నిర్మాణం ఏర్పడింది. ఈ కామ్రేడ్స్ డివిజన్ మహిళా సంఘం కార్యవర్గాలలో ఉంటూ మహిళా ఉద్యమాలకు మార్గదర్శకత్వం అందించారు. మహిళలను చైతన్యపర్చడం కోసం పత్రికను ఒక ఆర్గనైజర్‌గా గుర్తించి 2002లో ప్రారంభించిన ఏఓబీ మహిళా పత్రిక 'విప్లవి'ని కొన్ని సంచికలు తీసుకువచ్చారు. మహిళా ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఈస్ట్ డివిజన్‌లో ప్రత్యేక మహిళా సమావేశం ఏవీఎమ్ఎస్ మహాసభలను శ్రీకాకుళం డివిజన్‌లో మహిళా వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ వెలుగులో సర్క్యులర్స్ లేదా గైడ్‌లైన్స్‌ను రాసుకున్నారు.

మహిళలు విముక్తిని పొందడం అంటే భూస్వామ్యాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడం, పితృస్వామ్యాన్ని అంతం చేయడం, నిజమైన అర్థంలో జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం పోరాడటమేననే లక్ష్యంతో ఏవీఎమ్ఎస్‌లో సంఘటితమైన మహిళలు తమ రాజకీయ చైతన్యాన్ని మరింతగా పెంచుకుంటూ పార్టీ సభ్యులుగా, గ్రామ సెల్ కార్యదర్శులుగా, ప్రజల రాజ్యాధికార అంగాలైన ఆర్‌పీసీల అధ్యక్షులుగా, అత్యంత క్రియాశీలమైన పాత్రను పోషిస్తూ తమ వర్గా సోదరులతో భుజం, భుజం కలిపి పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. ఈ క్రమంలో అసమాన్య త్యాగాలను చేస్తూ తమ నెత్తురుతో నూతన చరిత్రను నిర్మిస్తున్నారు. గ్రామాల్లో యువతులు తెగ సాంప్రదాయాలనూ, ఆచారాలనూ, కట్టుబాట్లనూ, పితృస్వామ్య

సంకెళ్ళను తెంచుకుంటూ బేసిక్ మిలీషియా నిర్మాణాలలో భాగమవుతూ తమ సాంప్రదాయక ఆయుధాలతో అనేక మిలిటెంట్ చర్యలలోనూ, ఖతం కార్యక్రమాలలోనూ, దళాలతో కలిసి అనేక దాడుల్లోనూ, ప్రతిఘటనలోను పాల్గొంటున్నారు. పార్టీ సంస్థాగత పనులరీత్యా నిర్వహించే అనేక క్యాంపులలో మిలీషియా మహిళలు రక్షణ బాధ్యతలను నిర్వహించారు.

విప్లవోద్యమ ప్రారంభకాలంలో ఒకరు, ఇద్దరుగా దళాల్లోకి రిక్రూట్ అయిన మహిళలు తర్వాత కాలంలో పురుషుల కంటే ఎక్కువగా దళాలల్లోకి రావటం యాదృశ్చికం కాదు. ఎందుకంటే ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలు మహిళా విముక్తికి మార్గాన్ని చూపించాయి. అత్యంత దోపిడీ, పీడన, అణచివేతకు గురవుతున్న ఆదివాసీ మహిళలను వీర గెరిల్లాలుగా తీర్చిదిద్దాయి. ఏఓబీ విప్లవోద్యమం నమోదు చేసుకున్న ప్రజాయుద్ధ చర్యలన్నింటిలోనూ మహిళా గెరిల్లాలు వీరోచిత పాత్రను నిర్వహించారు.

భారతదేశ చరిత్రలో 1930లో జరిగిన 'చిట్టాగాంగ్' జిల్లా హెడ్‌క్వార్టర్‌పై రైతాంగ గెరిల్లాల దాడితో పోల్చుతూ మళ్ళీ అంతటి చారిత్రక ప్రాముఖ్యత కలిగిన దాడిగా 2004లో జరిగిన 'కోరాపుట్ మల్టీ రెయిడ్' చరిత్రలో నమోదయ్యింది. ఈ చారిత్రాత్మక దాడిలో ప్రారంభం నుండీ చివరి వరకూ ప్రతి దశలోనూ రైతాంగ మహిళలు, మిలీషియా మహిళలు, మహిళా గెరిల్లాలు దాడి సన్నాహాలలో, రెక్కీలలో, అస్సాల్ట్‌టీంలలో, ఆంబుష్‌లలో, అడ్మినిస్ట్రేషన్‌లలో, కమ్యూనికేషన్, వైద్యసేవల్లో, సెంట్రీల్లో, త్యాగనిరతిలో... ఇలా అన్నింటిలోనూ వారు నిర్వహించిన సాహసిక పాత్రను అమరుడు కామ్రేడ్ బాలకృష్ణ ఎంతో శ్రద్ధ తీసుకొని నమోదు చేసిన పుస్తకంలో మనం చూడవచ్చు. ఒక్క కోరాపుట్ దాడిలోనే కాదు, దానికంటే ముందు జరిగిన మోటు-కలిమెల, అనకాపల్లి-చోడవరం, ఆ తర్వాత జరిగిన ఉదయగిరి, నయాగడ్, దామన్‌జోడి వంటి రెయిడ్స్‌లోనూ, గునికిరాయి, తెల్లరాయి, బలిమెల వంటి చారిత్రాత్మక ఆంబూష్‌లలోనూ, అనేక సింగిల్ యాక్షన్స్‌లోనూ, ఎమ్ఎల్ఏ కిడారి ఆపరేషన్‌లోను ఇలా ఏఓబీలో జరిగిన అన్ని ప్రతిఘటనా చర్యలలో క్రియాశీల భాగస్వామ్యమే కాదు, నాయకత్వం వహించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మహిళా కామ్రేడ్స్ అనేక ఎన్‌కౌంటర్లలో అత్యంత ధైర్యసాహసాలతో శత్రువును ప్రతిఘటిస్తూ నాయకత్వాన్ని కాపాడుతూ ప్రాణాలర్పించిన వీరోచిత చరిత్ర వుంది.

4 దశాబ్దాల ఏఓబీ విప్లవోద్యమంలో మహిళలను రాజకీయంగా, సైద్ధాంతికంగా, మిలటరీపరంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చేసేందుకు పార్టీ ప్రత్యేక శ్రద్ధతో, కేంద్రీకరణతో అనేక కార్యక్రమాలను చేపట్టింది. మహిళలకు ప్రత్యేక మిలటరీ క్యాంపులనూ, రాజకీయ తరగతులను నిర్వహించింది. ప్రత్యేక మహిళా సమావేశాలనూ, వర్క్‌షాప్‌లను నిర్వహించి పార్టీలోనూ, పీఎల్‌జీఏలోనూ, ప్రజాసంఘాలలోను మహిళల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న పితృస్వామ్యాన్ని లోతుగా గుర్తించి, ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్, బోల్షివీకరణ క్యాంపెయిన్ల ద్వారా పితృస్వామ్య వ్యతిరేక పోరాటాలను చేపట్టింది. ఈ విధంగా మహిళలను సమర్థవంతమైన ఆర్గనైజర్లుగా, పీఎల్‌జీఏ సైనికులుగా, సాహసిక కమాండర్లుగా, డాక్టర్లుగా, టీచర్లుగా, సాంస్కృతిక యోధులుగా, మిలటరీ ఇన్‌స్ట్రక్టర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, కమ్యూనికేషన్, టెక్నీషియన్స్‌గా... ఇలా అనేక రంగాలలో తర్ఫీదునూ, బాధ్యతలను ఇస్తూ తీర్చిదిద్దుతున్నది. నేడు తక్కువ సంఖ్యలోనే అయినప్పటికీ, డీవీసీ, ఎస్‌జడ్‌సీ స్థాయికి ఎదిగిన మహిళా కామ్రేడ్స్ ఏఓబీ విప్లవోద్యమంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తున్నారు.

4 దశాబ్దాల సుదీర్ఘ చరిత్రలో ఏఓబీ విప్లవోద్యమం అనేక ఆటు-పోట్లనూ, ఎగుడు దిగుళ్ళనూ, విజయాలు-వైఫల్యాలను చవి చూసింది. అత్యంత విలువైన అనుభవాలనూ, గుణపాఠాలను నమోదు చేసుకున్నది. నేడు ఏఓబీ విప్లవోద్యమం తాత్కాలిక వెనుకంజలో ఉన్నది. అందులో భాగంగానే ఏఓబీ విప్లవోద్యమంలో చరిత్రను సృష్టించిన ఆదివాసీ విప్లవ మహిళా సంఘాలు కూడా అనేక ఆటుపోట్లకు గురవుతూ నేడు బలహీనపడ్డాయి. మహిళా ఉద్యమమూ బలహీనపడింది. తీవ్రమైన శత్రునిర్బంధం, పాశవిక దమనకాండల మధ్య ఉద్యమాలు తాత్కాలికంగా వెనుకపట్టు పట్టవచ్చు. అయితే గత పోరాటాలు, అనుభవాలు అందించిన ఉజ్వల చైతన్యం మాత్రం ఎప్పటికీ ఉంటుంది. మహిళా అమరవీరులు అందించిన స్ఫూర్తి, వారి త్యాగాలు ఎన్నటికీ వృధా కావు. నేడు నివురుకప్పిన నిప్పులా ఉన్న ఏఓబీ ఉద్యమం, అందులో భాగంగా మహిళా ఉద్యమం రెట్టింపు చైతన్యంతో ప్రజ్వరిల్లక తప్పదు. నేడు దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద శక్తులు కలగలసి మహిళలపై మరింత, మరింతగా చేస్తున్న దాడులనూ, అణచివేతనూ, దోపిడీ పీడనలనూ, పితృస్వామ్య బానిస సంకెళ్ళను తెంచుకొని మహిళలు ప్రజాయుద్ధంలో భాగం కావడం తప్ప, మహిళా విముక్తికి మరో మార్గం లేదు. ఆకాశంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లోనూ తమ సగభాగాన్ని సాధించుకోక తప్పదు. ఇది తరతరాల పోరాటాల చరిత్ర రుజువు చేసిన సత్యం.

**"స్త్రీలను సంపూర్ణంగా విముక్తి గావించకుండా కార్మికవర్గం సంపూర్ణ విముక్తిని సాధించలేదు"**

- వి.ఐ లెనిన్

# పార్టీ 'మూడు గొప్ప పని శైలులు'

**చైనా కమ్యూనిస్టు పార్టీ-మౌలిక అవగాహన పుస్తకంలోని (అధ్యాయం 9) 88వ పేజి**

**- షాంఘైటెక్స్‌బుక్ 1974**

పార్టీ నింబంధనావళి ప్రకారం పార్టీలో కామ్రేడ్స్ అందరూ 'సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేసే శైలి, ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం, విమర్శ, స్వయం విమర్శ ఆచరించడం' చేయాలి. పార్టీ మూడు గొప్ప పని శైలులు చైర్మన్ మావో స్వయంగా రూపొందించిన చక్కని సాంప్రదాయం. ప్రజలను ఐక్యం చేయడానికీ శతృవును ఓడించడానికి మన పార్టీ విలువైన వారసత్వం. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ప్రతి ఒక్కరు పార్టీ అద్భుతమైన పని శైలిని అధ్యయనం చేసి, ఎత్తిపట్టి, సోషలిస్టు విప్లవం నిర్మాణ ఆశయంలో మరిన్ని గొప్ప విజయాలు సాధించడం కోసం దాన్ని కొనసాగించాలి.

**'మూడు గొప్ప పని శైలులు' మన పార్టీ చక్కని సాంప్రదాయం**

సుదీర్ఘ విప్లవ పోరాట కాలంలో మన పార్టీ మూడు గొప్ప పని శైలులు మన పార్టీకి బూర్జువా, రివిజనిస్టు రాజకీయ పార్టీలకు మధ్య తేడా చెప్పే ఒక అంశం. వివిధ వర్గాల రాజకీయ పార్టీలకు వివిధ ఆలోచనా, పని శైలులు ఉంటాయి. మన పార్టీ ఎల్లప్పుడూ మార్క్సిజం-లెనినిజం-మావో సేటుంగ్ ఆలోచనా విధానానికి, అలాగే గతితార్కిక, చారిత్రక భౌతికవాద ప్రాపంచిక దృక్పథానికి దృఢంగా కట్టుబడి ఉంటుంది. మార్క్సిజం-లెనినిజం విశ్వజనీన సత్యాన్ని మన దేశంలో విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించడం, అధ్యయనం, పరిశోధన చేపట్టడం, వాస్తవాల నుండి సత్యాన్ని రాబట్టడం గురించి మన పార్టీ చైతన్యయుతంగా బోధిస్తుంది. ప్రజలే నిజమైన వీరులనీ, కార్మికవర్గ విముక్తి అంటే లక్షలాది ప్రజల విముక్తి అని పార్టీ బోధిస్తుంది. అందుకని అన్ని పరిస్థితులలో మనం ప్రజల మీద ఆధారపడాలి. వారిపై విశ్వాసం ఉంచాలి. వారితో సన్నిహిత సంబంధాల నెలకొల్పుకొని ప్రజాపంథాను అనుసరించాలి. మన పార్టీ కార్మికవర్గ, శ్రామిక ప్రజల మౌలిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుందని మనకు విశ్వాసం ఉన్నది. అది నిలబడే ఆశయం పూర్తిగా న్యాయమైనది. అందుకని కమ్యూనిస్టులమైన మనం మన మాటల్లో, చేతల్లో బహిరంగంగా ఉండాలి. ధైర్యంగా, విమర్శనూ, స్వయం విమర్శను ఆచరించాలి. పార్టీ మూడు గొప్ప పని శైలులు కార్మికవర్గ వర్గ లక్షణాలను దాని నిర్దిష్ట రాజకీయ స్వభావాన్ని తెలియజేస్తాయి. ఇక బూర్జువా, రివిజనిస్టు పార్టీల విషయానికి వస్తే అవి వ్యక్తిగత ప్రయోజనాల పునాదిగా ఉన్నాయి. అవి ప్రాతినిధ్యం వహించేది దోపిడీ వర్గాల ప్రయోజనాలకే. వాటి ప్రాపంచిక దృక్పథం ఎల్లప్పుడూ భావవాదంగా, పిడివాదంగా ఉంటుంది. అందుకనే వారిలో ఎప్పుడూ తప్పుకూ, ఒప్పుకు మధ్య గందరగోళం ఉంటుంది. వారి మాటలకూ, చేతలకు పొంతన ఉ ఒడదు. ప్రజలను మోసం చేస్తారు. ప్రజల నుంచి ఒంటరులవుతారు. విమర్శ, స్వయం విమర్శలకు భయపడతారు. తమ వైపు సత్యం లేకపోవడం వల్ల, ప్రజలు లేకపోవడం వల్ల వాళ్ళు తమ లక్ష్యాన్ని తప్పించుకోలేరు- ఈ భూమి మీద నుండి వాళ్ళు మాయమైపోతారు.

పార్టీ పని శైలి ఎల్లప్పుడూ దాని పంథాతో సన్నిహితంగా ముడిపడి ఉంది. కచ్చితమైన పని శైలి, ఖచ్చితమైన రాజకీయ పంథాకు అనుగుణంగా ఉంటుంది. సరైన పంథా మార్గదర్శకత్వంలో కార్మికవర్గ అద్భుతమైన పని శైలి అత్యున్నత స్థాయికి పెంపొందించవచ్చు. అయితే ఈ సరైన పంథా నుంచి పక్కకు మళ్ళీ, తప్పుడు పంథాను అనుసరిస్తే, బూర్జువావర్గం వ్యాపింపజేసే అన్ని రకాల అనారోగ్యకర పనిశైలులు, అలవాటులను చూడవచ్చు. మన పార్టీకి మితవాద, 'అతివాద' అవకాశవాద పంథాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటంలో నడిపిస్తున్నప్పుడూ చైర్మన్ మావో ఎల్లప్పుడూ పార్టీ పని శైలిని పరిష్కరించడం పట్ల సన్నిహితంగా శ్రద్ధ వహించాడు. మొదటి విప్లవ అంతర్యుద్ధ కాలంలో చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ అన్న చైర్మన్ మావో రచన మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ సిద్ధాంతాన్ని చైనా విప్లవ నిర్దిష్ట వాస్తవంతో సమైక్యం చేసే ఒక అద్భుతమైన ఉదాహరణ. ఎర్రసైన్యాన్ని స్థాపించిన ప్రారంభదినాలలో, మన పార్టీకీ, మన సైన్యానికి చక్కని పనిశైలిలో శిక్షణనిచ్చేందుకు ప్రజలతో సమైక్యమై నిరంతర పోరాటంలో నిలబడేందుకు చైర్మన్ మావో 'మూడు క్రమశిక్షణా సూత్రాలు, శ్రద్ధ వహించవలసిన 6 అంశాల'ను నెలకొల్పాడు. (ఇవి ఆ తర్వాత 'మూడు క్రమశిక్షణా సూత్రాలు , ఎనిమిది శ్రద్ధ పెట్టవలసిన అంశాలు'గా రూపొందాయి). 1942 యేనాన్‌లో స్వయంగా దిద్దుబాటు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు 'అధ్యయన శైలిని సరిదిద్దుకోవడం కోసం స్వీయాత్మకత మీద పోరాడండి, పార్టీ సంబంధాలలో శైలిని సరిదిద్దుకోవడం కోసం ఒంటెద్దుపోకడ మీద పోరాటం చేయండి, రచనా శైలిని సరిదిద్దుకోవడం కోసం పార్టీ యాంత్రిక పద్ధతుల మీద పోరాటం చేయండి' అని చైర్మన్ మావో పిలుపునిచ్చాడు. భావజాలపరంగానూ, పనిశైలిలోను మితవాత 'అతివాద' అవకాశవాద పంథాల ప్రభావాన్ని దెబ్బ కొట్టాడు. ఏడో పార్టీ కాంగ్రెస్‌లో చైర్మన్ మావో పార్టీ నిర్మాణంలో మన మౌలిక

అనుభవాన్ని గొప్పగా క్రోడీకరించాడు. మూడు గొప్ప పార్టీ పనిశైలిల గురించి మరింత వివరించాడు. ఈ చక్కని సాంప్రదాయానికి కొత్త ఊపునిచ్చాడు. మన దేశ సంపూర్ణ విముక్తి సందర్భంగా ఏడో కేంద్రకమిటీ, రెండవ ప్లీనరీ సెషన్‌లో విజయం అహంకారానికీ, స్వార్థానికీ, ఆత్మసంతృప్తికీ, విలాసానికి దారి తీయవచ్చునని చైర్మన్ మావో యావత్తు పార్టీని హెచ్చరించాడు– 'కామ్రేడ్స్‌కు వినమ్రంగా, నిశితంగా, స్వేచ్ఛగా ఉండడం బోధించాలి. వారి పనిలో అహంకారం, దురుసుతనం కూడదు. కామ్రేడ్స్‌కు సాదాజీవనం, కఠిన పోరాట శైలిని నిలబెట్టుకోవడం నేర్పించాలి'. యావత్తు దేశం విముక్తి చెందిన తర్వాత మూడు గొప్ప పని శైలులైన వినమ్రత, జాగరూకత, కఠిన పోరాటాలకు కట్టుబడి ఉండటం ద్వారా మన పార్టీ బూర్జువా సిద్ధాంతపు చక్కెరపూత పూసిన తూటాల విధ్వంసక దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టింది. తద్వారా విప్లవాన్ని నిర్మాణాన్ని నిరంతరం కొనసాగించింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం తర్వాత, ముఖ్యంగా లిన్ పియావోను విమర్శించి, పార్టీ పనిశైలిని సరిదిద్దే ఉద్యమం తర్వాత, వాస్తవాల నుంచి సత్యాన్ని రాబట్టే పని శైలి అలాగే వినమ్రత, జాగరూకత, కఠిన పోరాట మహత్తర సాంప్రదాయాలు– లిన్ పియావో అతని ముఠా ధ్వంసం చేసిన పనిశైలి, సాంప్రదాయాలకు భిన్నంగా ఒక నూతన అభివృద్ధిని సాధించాయి. యావత్తు పార్టీ నూతన శక్తితో ముందుకు వెళ్ళేందుకు దోహదపడ్డాయి. పార్టీ మూడు గొప్ప పని శైలులు యావత్తు పార్టీ మీదనూ, వివిధ జాతుల ప్రజల మీదను గాఢమైన ప్రభావం వేసాయని, చైర్మన్ మావో విప్లవపంథా అమలుకు హామి ఇస్తూ, విప్లవం, నిర్మాణం విజయవంతంగా అభివృద్ధి కావడం ముఖ్యమైన పాత్ర వహించాయని చారిత్రక అనుభవం తెలియజేస్తుంది. మన పార్టీ ఈ చక్కని సాంప్రదాయం పాతతరం కమ్యూనిస్టులకు పరిచయమే. అయితే నూతన చారిత్రక పరిస్థితులలో దాని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలన్న ప్రశ్నను వాళ్ళు ఎదుర్కొంటున్నారు. ఇక అనేక మంది పార్టీ నూతన సభ్యులు దాన్ని నేర్చుకోవడం, అందుకోవడం, దాన్ని ముందుకు తీసుకెళ్ళడం అనే దాన్ని ఎదుర్కొంటున్నారు. మన పార్టీ ఈ చక్కని సాంప్రదాయాన్ని తరం నుంచి తరానికి మనం తీసుకువెళ్ళాలి. ఇది పార్టీని సంఘటితం చేయడానికి అత్యంత ముఖ్యమైనది.

**సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేసే పని శైలి**

ఇక్కడ ప్రస్థావించిన సిద్ధాంతం కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం. – మార్క్సిజం–లెనినిజం–మావో సే టుంగ్ ఆలోచనా విధానం – వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగం అన్న మూడు గొప్ప విప్లవ ఉద్యమాల ఆచరణ. సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేయడం అంటే మార్క్సిజం–లెనినిజం–మావో సే టుంగ్ ఆలోచనా విధానం వైఖరినీ, దృష్టినీ, పద్ధతిని వినియోగించుకొని విప్లవ, నిర్మాణ క్రమంలో ఎదురైన ఆచరణాత్మక సమస్యలను అధ్యయనం చేయడం, పరిష్కరించడం. చైర్మన్ మావో ఇలా వ్యక్తం చేసినట్లు – 'లక్ష్యాన్ని బాణంతో కొట్టడం'. లక్ష్యానికి బాణానికి సంబంధం ఎటువంటిదో, సిద్ధాంతానికి ఆచరణకు మధ్య సంబంధం అటువంటిది. సిద్ధాంతం అనే బాణాన్ని ఆచరణ అనే లక్ష్యం మీదికి కొట్టడం కోసం మనం ఈ కింది పద్ధతికి కట్టుబడి ఉండాలి– మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఆచరణను ప్రారంభ బిందువుగా ఉపయోగించడం, మూడు గొప్ప విప్లవ ఉద్యమాలలో ఎదురైన సమస్యలను పరిష్కరించడం, ఈ సిద్ధాంతం నుంచి మన వైఖరి, దృష్టి పద్ధతి రూపొందుతాయి. సిద్ధాంతం, ఆచరణ విడిపోతే మనం ఎక్కడపడితే అక్కడ కొడతాం. ఉత్తుత్తమాటలతో, ఏమి చేయకుండా పక్కన పెట్టడం కోసమే సరైన సిద్ధాంతాన్ని తీసుకుంటే, ఆ సిద్ధాంతం ఎంత చక్కనిదైనప్పటికీ, దానివల్ల ఉపయోగం ఉండదు. విప్లవ ఆచరణలో ఎదురయిన సమస్యలను పరిష్కరించినప్పుడే, వాటిని మార్క్సిజం–లెనినిజం అనే సైద్ధాంతిక ఆయుధంతో విశ్లేషించి, అధ్యయనం చేసి పరిష్కరించినప్పుడే సిద్ధాంతాన్ని ఆచరణతో ముడిపెట్టగలుగుతాం. బాణంతో లక్ష్యాన్ని కొట్టగలుగుతాం.

చైర్మన్ మావో ఇలా అన్నాడు – 'చైనా విప్లవ ఆచరణతో మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని సన్నిహితంగా సమైక్యం చేయడమే మన పార్టీ నిరంతరం అనుసరిస్తున్న సైద్ధాంతిక సూత్రం'. మన పార్టీ చరిత్ర మార్క్సిజం–లెనినిజం విశ్వజనీనసత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో నిరంతరం సమైక్యం చేస్తూ సాగింది. ఇది చైర్మన్ మావో నాయకత్వంలో మితవాద 'అతివాద' అవకాశవాద పంధాలమీద యావత్తు పార్టీ విజయం సాధించిన చరిత్ర. చైనా విప్లవ దీర్ఘకాలిక పోరాటాన్ని నడిపించడంలో చైర్మన్ మావో ఎల్లప్పుడూ క్షుణ్ణమైన పరిశోధనా, చైనా సమాజపు లక్షణాల ప్రతి వర్గం పరిస్థితుల గొప్ప విశ్లేషణ చేపట్టాడు. ప్రజాస్వామిక విప్లవ కాలంలో, సోషలిస్టు విప్లవ కాలంలో ఎదురైన వరుస సమస్యలను సరిగా పరిష్కరించాడు. మన పార్టీ సరైన రాజకీయ దృక్పథాన్నీ, పంధానూ, సూత్రాలను రూపొందించాడు. మన దేశంలో విప్లవం, నిర్మాణం ఆశయంలో మరిన్ని గొప్ప విజయాలకు హామి ఇచ్చాడు. చైర్మన్ మావో విప్లవ పంధా ప్రకారం సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేస్తూ, పురోగమించడం ద్వారా పార్టీ ఎల్లప్పుడూ అభివృద్ధి చెందుతూ వచ్చిందనీ, విప్లవ ఆశయం ఎల్లప్పుడూ విజయవంతం అయిందని పార్టీ చారిత్రక అనుభవం తెలియజేసింది. ఇందుకు భిన్నంగా సిద్ధాంతాన్ని ఆచరణ నుంచి విడదీసినప్పుడు చైర్మన్ మావో విప్లవ పంధా నుంచి విడివడినప్పుడు పార్టీ వెనకడుగులు ఎదుర్కొంది. విప్లవ ఆశయం వైఫల్యాలు ఎదుర్కొంది. అందుకనే చైనా విప్లవ విజయం మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా విప్లవ ఆచరణతో సమైక్యం చేయడంలో అపారమైన విజయంగా, చైర్మన్ మావో విప్లవ పంధా, మావో సే టుంగ్ ఆలోచనా విధానం అపారమైన విజయంగా చెబుదాం.

సిద్ధాంతాన్ని ఆచరణలో ఐక్యం చేయడమే చైర్మన్ మావో చెప్పిన కార్మికవర్గ విప్లవ అధ్యయన శైలి. మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడంలో రెండు పరస్పర విరుద్ధ వైఖరులు ఉన్నాయి. మొదటిది సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేసే మార్క్సిస్టు–లెనినిస్టు వైఖరి. ఈ వైఖరితో మనం మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని పద్ధతిని వినియోగించి, వాతావరణాన్ని క్రమబద్ధంగా, వివరంగా అధ్యయనం చేయడానికి, పరిశోధనా చేయడానికి ఆచరణాత్మకతను విప్లవోత్సాహంతో జోడించడానికి ఉపయోగిస్తాం. ఈ వైఖరితో మనం బాణాన్ని లక్ష్యం మీద విసరగలం. మరో వైఖరి, స్వీయాత్మకమైనది.

సిద్ధాంతాన్ని ఆచరణతో విడదీసే వైఖరి. ఇది చెడు అధ్యయన శైలి. మార్క్సిస్టు-లెనినిస్టు వ్యతిరేక శైలి -సమస్త అవకాశవాదులు, రివిజనిస్టుల హానికమైన శైలి. అధ్యయన శైలి ఆలోచనా పద్ధతికి సంబంధించిన అంశం అనీ, నాయకత్వ నిర్మాణాలకు సమస్త కేడర్లకూ, యావత్తు పార్టీ సభ్యులకు దీనితో సంబంధం ఉన్నదని మనకు తెలుసు. మార్క్సిజం-లెనినిజం పట్లను తమ పనిలో సమస్త పార్టీ కామ్రేడ్స్‌కు ఉన్న వైఖరితో సంబంధం ఉన్న విషయం ఇది. రెండు అధ్యయన శైలిల మధ్య పోరాటం అధ్యయనం సమస్య మీద రెండు పంథాల మధ్య పోరాటాన్ని ప్రతిభింబిస్తున్నది. అధ్యయన శైలి సమస్యను పార్టీ స్ఫూర్తికి సంబంధించిన విషయస్థాయికి పెంపొందిస్తూ చైర్మన్ మావో సిద్ధాంతాన్ని ఆచరణతో విడదీసే స్వీయాత్మకత పనిశైలి సారాన్ని గొప్పగా తెలియజేసాడు- 'ఈ శైలితో పని చేయడం ఆ వ్యక్తికి హానికరం. ఇతరులకు బోధించడం, ఇతరులకు హాని చేయడం. దాని విప్లవాన్ని నడిపించడానికి ఉపయోగించడం విప్లవానికి హాని చేయడం'. 'పార్టీ స్ఫూర్తి ఉన్నదా, లోపంగా ఉన్నదా... అన్న దానికి ఇది వ్యక్తీకరణ'.

లీ షావ్ చీ, లిన్ పియావో మొదలైన కుట్రదారులు, వివిధ అవకాశవాద పంథాల ముఖ్యులు సైద్ధాంతికంగా స్వీయాత్మకతను వస్తుగతత్వం నుంచి విడదీసే, సిద్ధాంతాన్ని ఆచరణతో విడదీసే లక్షణాన్ని కలిగి ఉన్నారు. సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేసే సూత్రాన్ని వాళ్ళు ఎల్లప్పుడూ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎల్లప్పుడూ మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానంపై పోరాడుతూ వచ్చారు. అందుకు బదులుగా ముందుగానే తెలిసి ఉన్నామన్న భావవాద వైఖరిని ప్రోత్సహించారు. రివిజనిజాన్ని ఆచరించడం కోసం వాళ్ళు ముందుగా మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాలను వ్యతిరేకించారు. మార్క్సిస్టు-లెనినిస్టు గ్రంథాలు, కేవలం 'గతాని'కి సంబంధించిన అంశాల గురించే మాట్లాడాయనీ, అవి 'మన నుండి చాలా దూరం పోయాయ'నీ, ఇప్పటికే 'కాలం చెల్లించి పోయాయ'నీ, వాటిని అధ్యయనం చేయడం అవసరం లేదని లిన్ పియావో వాధించాడు. ఈ అతి ప్రతీఘాతుక సిద్ధాంతంతో తన రివిజనిస్టు చెత్తను ముందుకు తీసుకురావడానికి పెట్టుబడిదారీ పునరుద్ధరణ విప్లవ ప్రతీఘాతక కుట్రను సాధించడానికి మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాలను వ్యతిరేకించాడు. అలాగే లిన్ పియావో తన శక్తికొద్దీ విప్లవ కార్యాచరణను వ్యతిరేకించాడు. 'ప్రతిభ' అనే ప్రతీఘాతుక సిద్ధాంతాన్ని ప్రచారం చేసాడు. ఆచరణ విజ్ఞానానికి మౌలికవనరన్న అంశాన్ని నిరాకరించాడు. మనం స్వీయాత్మకం నుంచి వస్తుగత'నికి 'భావం నుంచి వాస్తవాని'కి సాగాలని వాధించాడు. సిద్ధాంతానికీ, ఆచరణకు మధ్య స్వీయాత్మకతను వస్తుగతత్వానికి మధ్య సంబంధాలను పూర్తిగా వెనక్కి తిప్పాడు. అందుకని లిన్ పియావో విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను విమర్శించేటప్పుడూ మనం అతను ప్రచారం చేసిన తప్పుడు, మార్క్సిస్టు-లెనినిస్టు అధ్యయన శైలిని తీవ్రంగా విమర్శించాలి. దానిని నిర్మూలించాలి.

సిద్ధాంతాన్ని ఆచరణలో సమైక్యం చేసే సూత్రాన్ని ఎత్తిపట్టడం కోసం మనం వాస్తవాలనుంచి సత్యాలను రాబట్టే శాస్త్రీయవైఖరిని అవలంభించాలి. 'వాస్తవాలు' భౌతికంగా ఉండే అంశాలు. 'సత్యం' వాటి అంతస్సంబంధాల గురించి మాట్లాడుతుంది. 'రాబట్టడం' అంటే వాటిని అధ్యయనం చేయడం. రోజువారి పనిలో వాస్తవాల నుంచి సత్యాలను రాబట్టే శాస్త్రీయ వైఖరిని ప్రదర్శించడం అంటే మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో భౌతిక అంశాల అభివృద్ధిని పాలించే నియమాలను అధ్యయనం చేయడం, గ్రహించడం. పార్టీ రాజకీయ పంథాను దృక్పథాన్ని సూత్రాలను ముడి పెట్టడం. అలాగే పై స్థాయిల నుంచి వచ్చే ఆదేశాలను, మన ప్రాంతం, లేదా యూనిట్‌లలో వాస్తవ పరిస్థితికి ముడిపెట్టడం, వాలాగే వాటిని చర్చించడం, క్షుణ్ణంగా అమలు చేయడం కూడా. స్వీయాత్మకం వస్తుగతానికి అనుగుణంగా ఉండేటు కృషి చేయడం. సిద్ధాంతాన్ని అచరణతో సమైక్యం చేయడం, తద్వారా మన పనిలో బాణంతో లక్ష్యాన్ని కొట్టడం, ఆశించిన ఫలితాలు సాధించడం.

సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేసే సూత్రాన్ని ఎత్తిపట్టేందుకు మనం సామాజిక పరిస్థితిని అధ్యయనం చేసి పరిశోధించాలి. అధ్యయనం పరిశోధనా మార్క్సిజం-లెనినిజం శాస్త్రీయపద్ధతి మనం అటువంటి ఒక కర్తవ్యాన్ని చేపట్టినప్పుడూ వాస్తవ పరిస్థితిని లోతుగా వివరంగా పరిశోధించాలి. ఆ తర్వాత సేకరించిన సమాచారాన్ని విశ్లేశించి అధ్యయనం చేయాలి. 'అనవసరమైనది వదిలేసి అవసరమైనదాన్ని ఎంపిక చేసుకోవాలి, తప్పుడుదాన్ని నిర్మూలించి నిజాన్ని నిలబెట్టుకోవాలి. ఒకదాని నుంచి మరొకదానికి బయటనుంచి లోపలకు సాగాలి.... ఇలా గ్రాహ్యజ్ఞానం నుంచి హేతుబద్ధ విజ్ఞానానికి గెంతు వేయాలి'. వాస్తవానికి అనుగుణంగా ఉండే నిర్ధారణలు చేయడం కోసం ముఖ్యమైన దాన్ని, అప్రధానమైనదాని నుంచి తేడా చేసి చూడడం తెలియాలి. వాస్తవికత పునాదిగా మన పనిని కొనసాగించాలి.

**ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకునే పని శైలి**

ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం, వారితో అన్ని వ్యవహారాలు చర్చించడం మన పార్టీ చక్కని సాంప్రదాయ పనిశైలి. మన బలం అదే. దీనితోనే మనం శత్రువును ఓడించి అన్ని కష్టాలను అధిగమించాం.

ప్రజలే చరిత్ర నిర్మాతలని మార్క్సిజం చెబుతుంది. సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళే నిర్ణయాత్మక శక్తి ప్రజలు. ప్రజలు ప్రపంచ భౌతిక, ఆధ్యాత్మిక సంపదకు సృష్టికర్తలే కాక, తమ విప్లవ పోరాటాలే సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళే చోధకశక్తులు. బానిసలు చరిత్ర నిర్మాణాలు. ఇది మౌలిక చారిత్రక భౌతికవాద దృష్టి. మార్క్స్, ఏంగెల్స్ ఇలా పేర్కొన్నారు- 'చరిత్ర గమనం ప్రజలపని'. లెనిన్ ఇలా రాసాడు- 'సజీవ, సృజనాత్మక సోషలిజం ప్రజల ఫలితమే'. చైర్మన్ మావో కూడా ఇలా సూచించాడు. 'ప్రజలు, ప్రజలు మాత్రమే ప్రపంచ చరిత్రకు చోధకశక్తి'. ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం కోసం మనం 'ప్రజలే చరిత్ర నిజమైన నిర్మాతలు' అన్న భావాన్ని దృఢంగా నింపుకోవాలి. విప్లవబలం ప్రజలలో ఉన్నదని విశ్వసించాలి. చరిత్ర నిర్మాతలుగా వారి మహత్తర పాత్రను పూర్తిగా గుర్తించాలి. ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది కనుకనే మన పార్టీ ప్రజలకు నాయకత్వం వహించగలుగుతుంది. వారికి మనస్ఫూర్తిగా సేవ

చేయగలుగుతుంది. వారిలో విశ్వాసం ఉంచుతున్నది. వారిమీద ఆధారపడుతున్నది. వారితో సన్నిహిత సంబంధాలలో ఉంటున్నది. కమ్యూనిజం సాధన కోసం పోరాటాలు చేస్తున్నది.

ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉంచుకోవడం మన పార్టీ మహత్తర సాంప్రదాయం. ప్రజాస్వామిక విప్లవ కాలంలో చైర్మన్ మావో విప్లవ పంథాలో మన పార్టీ ప్రజావిముక్తి సైన్యాన్ని స్థాపించింది. ప్రజలను పూర్తిగా సమీకరించి వారిని విశ్వసించడం ద్వారా విప్లవ బేస్‌లను నెలకొల్పింది. ఈ రకంగా 28 సంవత్సరాల వీరోచిత పోరాటం తర్వాత, కేవలం ఇంత పప్పు, నాటు తుపాకులతో అజేయులమని నమ్మిన జపాన్ ఫాసిస్టు బంధిపోటులను విజయవంతంగా ఓడించింది. అమెరికా సామ్రాజ్యవాదం సరఫరా చేసిన 80 లక్షల బలమైన ప్రతీఘాతుక కొమింగ్‌టాంగ్ సైన్యాన్ని తుడిచిపెట్టింది. ఈ కఠిన పోరాట కాలంలో మన పార్టీ, ప్రజాసైన్యం ప్రజలతో తమ సంతోషాన్ని, బాధలను పంచుకున్నారు. శక్తివంతమైన శతృవును ఓడించాయి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో సంపూర్ణ విజయం సాధించింది. యావత్తు దేశ విముక్తి తర్వాత ప్రజలను పూర్తిగా సమీకరించడం, వారి మీద నిశ్చయాత్మకంగా ఆధారపడడం ద్వారా మన పార్టీ దేశం లోపలా, బయటినుంచి శతృవులు రేపిన విచ్చిన్నాలు, విధ్వంసాలను ధ్వంసం చేసింది. విప్లవ స్వతంత్ర స్ఫూర్తి, స్వావలంబన, కఠిన పోరాటాలను ప్రదర్శిస్తూ, ఎల్లప్పుడు ముందుకు సాగడానికి అన్ని విధాలుగా ముందుకు వెలుతూ పాత, పేద, వెనకబడిన సంక్షోభంలో కూరుకుపోయిన చైనాను సుసంపన్నమైన నూతన సోషలిస్టు చైనాగా మార్చింది. చైర్మన్ మావో వ్యక్తిగతంలో ప్రారంభించి నాయకత్వం వహించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ క్రమంలో మన పార్టీ ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించింది. వారి మీద ఆధారపడింది. కార్మికవర్గ నియంతృత్వం కింది విస్తృతమైన ప్రజాస్వామ్యాన్ని ఆచరించింది. తద్వారా అపారమైన ప్రజాఉద్యమాన్ని రేకెత్తించింది. ఇది తుఫానులా రేగి లీ షావ్ చీ, లిన్ పియావోల నేతృత్వంలో ఉన్న రెండు బూర్జువా కేంద్రాలను ధ్వంసం చేసింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో అనేక ముఖ్యమైన విజయాలు గెలుచుకుంది. మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానంతో సాయుధమైన ప్రజలు అజేయులని లెక్కలేనన్ని వాస్తవాలు నిరూపిస్తాయి. అయితే మనకు ప్రజల మీద విశ్వాసం ఉండాలి. వారి మీద ఆధారపడాలి. వారితో సన్నిహిత సంబంధాలు సాగించాలి. అప్పుడు మనం తప్పకుండా విజయం సాధిస్తాం.

ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం, లేదా వారి నుండి విడిపోవడం (లేదా వారంటే భయపడడం, విప్లవ ప్రజా ఉ ద్యమాన్ని వ్యతిరేకించడం) అన్నది కేవలం పద్ధతికి సంబంధించిన ప్రశ్న కాదు. వైఖరికీ, ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన మౌలిక ప్రశ్న. చైర్మన్ మావో విప్లవపంథాకూ మితవాద, 'అతివాద' అవకాశవాద పంథాలకు మధ్య పోరాటంలో ఇది ముఖ్యమైన ప్రశ్న. అవకాశవాద పంథాల ముఖ్యులందరూ భావవాదులు. బూర్జువా వర్గ పక్షం వహిస్తారు. ప్రజల మీద ఎల్లప్పుడూ తమ శక్తి కొద్దీ బురద జల్లుతారు, ఖండిస్తారు. చరిత్ర నిర్మాతలుగా ప్రజల గొప్ప పాత్రను నిరాకరిస్తారు. పార్టీ ప్రజాపంథాను వ్యతిరేకిస్తారు. పార్టీ నాయకత్వంలో జరిగిన విప్లవ ప్రజా ఉద్యమాల పట్ల శతృపూరిత వైఖరిని కలిగి ఉంటారు. మొదటి విప్లవ అంతర్యుద్ధంలో మితవాద, అవకాశవాద పంథా ముఖ్యుడు చెన్ టూ షియూ చైనా కార్మికవర్గ 'బాల్య చేష్ట'గా మాట్లడాడు. అది 'స్వతంత్య విప్లవ శక్తిగాలేద'న్నాడు. చైనా ప్రజలకు 'క్రమశిక్షణ లేదని', 'సాంప్రదాయవాదుల'ని, 'విప్లవంలోకి వాళ్ళను గెలుచుకోవడం కష్టం అని అన్నాడు. విప్లవ శక్తిపై అతనికి విశ్వాసం లేదు. మితవాద లొంగుబాటు పంథాను కొనసాగించాడు. వీరోచిత విప్లవోద్యమానికి ఓటమి తెచ్చాడు. సోషలిజం చారిత్రక కాలానికి పార్టీ మౌలిక పంథాను మార్చడం కోసం, లీ షావ్ చీ, లిన్ పియావో మొదలైన కుట్రదారులు పార్టీ ప్రజాపంథాను ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండే అద్భుత పని శైలిలు నాశనం చేయడానికి తమ శక్తి కొద్ది కృషి చేసారు. 'వెనకబడిన ప్రజలు' అన్న సిద్ధాంతంతో లీ షావ్ చీ 'నాలుగు శుభ్రాల ఉద్యమం'లో ప్రజలను సమీకరించడాన్ని వ్యతిరేకించారు. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో బూర్జువా ప్రతీఘాతుక పంథాను అమలు చేసారు. విప్లవ ప్రజా ఉద్యమాన్ని అణచివేసారు. లిన్ పియావో విషయానికి వస్తే అతను 'ప్రతిభ సిద్ధాతం'తో పెద్ద గొడవ రేపాడు. 'అంతర్గత విజ్ఞానం' కలిగి ఉండటం గురించి 'అంతర్గత చైతన్యం' కలిగి ఉండడం గురించి నిస్సిగ్గుగా మాట్లాడాడు. అదే సమయంలో విశాల కార్మిక-రైతాంగ ప్రజల మీద బురదజల్లి వారిని కేవలం 'ధనికులు కావాలనీ, విలాసంగా ఉండాలని అనుకునే'వాళ్ళుగా చూసాడు. వారికి 'నూనె, ఉప్పు, సోయరసం, వెనిగర్, కట్టెలు' తప్ప మరేమి తెలియదని అన్నాడు. అలాగే లిన్ పియావో అతని ముఠా 'వీరులు, బానిసలు కలిసి చరిత్రను సృష్టిస్తారు' అన్న చెత్త మాట్లాడి తద్వారా మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాలను వ్యతిరేకించి ద్వంద జిత్తును వాడుకున్నాడు. లీ షావ్ చీ, లిన్ పియావోల ప్రతీఘాతుక భావవాద చారిత్రక సూత్రీకరణలను మనం క్షుణ్ణంగా విమర్శించాలి. పార్టీకీ, ప్రజలకు మధ్య నిరంతరం సంబంధాలు పటిష్టం చేయాలి. 10వ కాంగ్రెస్ రాజకీయ పంథా ప్రకారం ధైర్యంగా సాగాలి.

ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం కోసం వారితో వ్యవహారాలు చర్చించాలి. వారి అభిప్రాయాల్ని వినమ్రంగా వినాలి. చైర్మన్ మావో ఇలా బోధిస్తాడు. 'నిజమైన వ్యక్తిగత పరిజ్ఞానం ఉన్న ప్రజలే ప్రపంచ వ్యాపితంగా ఆచరణలో ఉన్నారు'. మూడు గొప్ప విప్లవోద్యమాలకు అగ్రభాగంలో ఉండి పోరాడిన విశాల ప్రజానీకానికీ, సుసంపన్నమైన ఆచరణాత్మక పరిజ్ఞానం ఉంది. ప్రజల అభిప్రాయాలను వినమ్రంగా వినడం, వారితో వ్యవహారాలు చర్చించడం ద్వారా మాత్రమే మనం వారి తెలివిని కేంద్రీకరించగలం. వారి ఆవిష్కరణలను వినియోగించుకోగలం. వారి అనుభవాన్ని సంశ్లేషించుకోగలం. విప్లవ ఆచరణకు నాయకత్వం వహించే సరైన పరిజ్ఞానాన్ని తీసుకోగలం. ప్రజలతో వ్యవహారాలు చర్చించడం కోసం మనం వారి అభిప్రాయాల్ని వినాలి. మనకు నైపుణ్యం లేనప్పుడూ, కష్టాలు ఎదురైనప్పుడు లేదా తగినంత అనుభవం లేనప్పుడూ వారివి వినాలి. మనకు పరిస్థితి చక్కగా తెలిసినప్పుడూ, పని చక్కగా నడుస్తున్నప్పుడూ, మనం విజయాలు సాధించినప్పుడు అది మరింత అవసరం. మనం అంగీకరించినా,

అంగీకరించకపోయినా ప్రజల అభిప్రాయాలన్ని వినాలి. ప్రతి ఒక్కరు తమ అభిప్రాయం చెప్పేట్టు చూడాలి. ప్రజలను తమ మనసులల్లో ఉన్నదాన్ని వ్యక్తం చేయనివ్వాలి. ప్రజల విజ్ఞానాన్ని సేకరించాలి. మావో సే టుంగ్ ఆలోచనా విధానం పునాదిగా ఏది విలువైనదో, ఏది కాదో తేడా చూడాలి. మావో సే టుంగ్ ఆలోచనా విధానం పునాదిగా ఆలోచనలలో ఐక్యం సాధించాలి. ఈ రకంగా మాత్రమే మనం ప్రజల చొరవను సృజనాత్మకతను పూర్తిగా ఆచరణలోకి తీసుకురాగలుగుతాం. వారి తెలివిని పూర్తిగా కేంద్రీకరించగలుగుతాం. విప్లవం, నిర్మాణం అభివృద్ధి కావడానికి మరింత ఊపునివ్వగల్గుతాం. కొందరు కామ్రేడ్స్ తామే అంతా మాట్లాడుతూ ప్రజలను అభిప్రాయాలు చెప్పనివ్వరు. అది పరిశోధనా పని అయినా, ఒక సమస్యను పరిష్కరించడమైనా తాము మాత్రమే చూడాలని అనుకుంటారు. ఎవరిని మాట్లాడనివ్వరు. ఇతరులు కేవలం విని తమ ఆదేశాలను గౌరవించాలనుకుంటారు. ఈ పని శైలి పూర్తిగా తప్పు. దాని వల్ల ప్రజలు తమ అభిప్రాయాలు పూర్తిగా వ్యక్తం చేయడాన్ని నిరాకరిస్తుంది. వారి చొరవను దెబ్బ తీస్తుంది. వారికీ పార్టీకి మధ్య సంబంధాలకు హాని చేస్తుంది.

ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం కోసం మనం వారి పట్ల సరైన వైఖరి అవలంభించాలి. వారితో సరిగా వ్యవహరించాలి. ప్రజలలో విశ్వాసం ఉంచడం ద్వారా, వారి మీద ఆధారపడడం ద్వారా, వారితో సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవడం ద్వారా మాత్రమే ప్రతీ వ్యక్తి తన పాత్రను పూర్తిగా పోషించగలరు. ప్రజల ఆశయం కోసం ఉన్నతంగా దోహదం చేయగలరు. వ్యక్తి పాత్రను మనం అతిగా అంచనా వేస్తే, ప్రజల బలాన్ని తక్కువగా అంచనా వేస్తే, మనం చేసినదంతా మంచేనని నమ్మితే, ప్రజలు చేసినది ఏమి లేదని అనుకుంటే అప్పుడు మనం ప్రజల, వ్యక్తుల స్థానాలను తిరగేసినవాళ్ళమవుతాం. చారిత్రక భావవాదపు ఊబిలో కూరుకుపోతాం. పార్టీ సభ్యులు కేడర్లకు సంబంధించినంతవరకు ప్రజలతో సరిగా వ్యవహరించాలంటే, వాళ్ళు ఇష్టపూర్వకంగా ప్రజలకు విద్యార్థులు కావాలి. వారి నుండి వినమ్రంగా నేర్చుకోవాలి. వారి దృష్టిలో సరళమైన శ్రామిక ప్రజలుగా ఉండాలి. వారిలో లోతైన వేళ్ళు తవ్వాలి. పార్టీ కేడర్లను సమిష్టి ఉత్పత్తి శ్రమలో పాలుపంచుకోవడం కొనసాగించాలి. శ్రామిక ప్రజల లక్షణాలను ఎన్నటికీ పరిరక్షించుకోవాలి. ప్రజలలో ఒకరు కావాలి.

ప్రజలతో సరిగ్గా వ్యవహరించాలంటే వారికి నాయకత్వం వహించేందుకు మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానాన్ని ఎలా వినియోగించాలో కూడా తెలిసి ఉండాలి. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ప్రజలతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవడమంటే, వారి నుండి నేర్చుకోవడం. అలాగే వారిని సాయుధం చేసి, సంఘటితం చేసేందుకు వారిలో మార్క్సిజం-లెనినిజం- మావో సే టుంగ్ ఆలోచనా విధానాన్ని ప్రచారం చేయడం కూడా. ప్రజలతో వ్యవహరించే పద్ధతికి వస్తే, ఒకపక్క మనం 'నాయకత్వానికి అంతా తెలుసు', 'ప్రజల వెనకబాటుతనం' అన్న సిద్ధాంతాన్ని వ్యతిరేకించాలి. నిరంకుశత్వం, ఆధిపత్యవాదం అనే చెడు పనిశైలిని ఓడించాలి. మరోపక్క మనం 'ప్రజలకు కావాలనుకుంటే అలానే ఉండనీ' అన్న పంథాను వ్యతిరేకించాలి. తోక పట్టుకుపోయే హానికరమైన ధోరణిని ఓడించాలి. ఈ రకంగా మాత్రమే మనం చైర్మన్ మావో విప్లవ పంథాను సరిగా అన్వయించగల్గుతాం. పార్టీ పనిని సరిగా నెరవేర్చగలుగుతాం.

ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడానికి మనం వినమ్రత, జాగరూకత, కఠినపోరాట పనిశైలిని ఆచరించాలి. అన్ని సమయాలలోనూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా ప్రజలు పీల్చే ఊపిరినే పీల్చుతూ వారి దగ్గర ఉన్నదే పంచుకోవాలి. మనం సౌకర్యాన్నీ, విలాసాలను కోరుకోకూడదు. కఠిన జీవితాన్ని విడనాడరాదు. మనం పైస్థాయిలోకి వెలుతున్నప్పటికీ వినమ్రంగా, జాగరూకతతో, ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉండే పనిశైలికి దూరం కాకూడదు. మనకు మెరుగైన జీవన పరిస్థితులు ఉన్నప్పటికీ, కఠిన పోరాటశైలిని విడిచిపెట్టరాదు. ఈ రకంగా మాత్రమే మనం బూర్జువా భావాల, జీవన శైలుల ప్రభావానికి గురికాకుండా ఉంటాం. ప్రజల నుంచి ఎన్నడూ దూరం కాకుండా ఉంటాం. అప్పుడూ మన పార్టీ నీటిలో చేపలా ఎన్నటికీ ప్రజలతో సంబంధాలు నెలకొల్పుకొనే ఉంటుంది. విప్లవంలో, నిర్మాణంలో మరిన్ని విజయాలు గెలుచుకోగలుగుతుంది.

**విమర్శ, స్వయం విమర్శ పనిశైలిని ఆచరించే పనిశైలి**

పార్టీని సైద్ధాంతికంగా నిర్మించడానికీ, దాని ఐక్యతను సంఘటితం చేయడానికీ, దాని పోరాట సామర్థ్యాన్ని పెంచడానికి విమర్శా, స్వయం విమర్శ తీవ్రమైన ఆయుధాలు. భౌతికంగా పార్టీలో వైరుధ్యాలు ఉంటాయి. పార్టీలో వర్గవైరుధ్యాలకు సమాజంలో పాతకూ, కొత్తకు మధ్య పోరాటానికి ఇది ప్రతిబింబం. పార్టీలో అంతర్గత పోరాటాన్ని సరిగా చేయడానికీ, పార్టీ అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించడానికి విమర్శా, స్వయం విమర్శ మౌలిక సాధనాలు. యావత్తు సోషలిజం చారిత్రక కాలంలో వర్గాలు, వర్గవైరుధ్యాలు, వర్గపోరాటం ఉంటాయి. కనుక, ఇంకా బూర్జువా వర్గపు, ఇతర దోపిడీ వర్గపు పాత భావాలు పాత సంస్కృతి, పాత అలవాట్లు మన పార్టీ సభ్యుల మీద ప్రతిరోజు ప్రతినిమిషం ప్రభావం వేస్తూనే ఉంటాయి. బూర్జువా వర్గపు రాజకీయ మట్టి నుంచి, క్రిముల నుంచి, మన పార్టీ శరీరానికి పట్టిన చీముకు వ్యతిరేకంగా పోరాడడానికి పార్టీ సభ్యులు బూర్జువా భావాలకు ఇతర దోపిడీవర్గాల భావాలకు లొంగిపోకుండా చూడటానికి మనం చురుకైన సైద్ధాంతిక పోరాటం చేయాలి. సమస్త కార్మికవర్గేతర భావాలు కార్మికవర్గ భావజాలంతో ఓడించాలి. పార్టీ అంతర్గత పోరాటాలను సరైన పద్ధతుల ద్వారా క్రమబద్ధం చేయాలి. ప్రజలలో భావజాల సమస్యల విషయంలో మనం దూషణాపూరితంగా గానీ, పిడికిళ్ళు, ఆయుధాలు ఉపయోగించడం కానీ చేయకూడదు. ఈ వివాదాలను పరిష్కరించడానికి మనం కేవలం చర్చ మళ్ళీ మళ్ళీ చెప్పడం, విమర్శా, స్వయం విమర్శలను వినియోగించాలి. విమర్శా, స్వయం విమర్శల అనుకూల అంశాలను పెంపొందించడానికీ, లోపాలను అధిగమించడానికీ, తప్పులను సరిదిద్దుకోవడానికి తద్వారా పార్టీ ఐక్యతనూ, సంఘటితీకరణను సరైన పంథా పునాదిగా పటిష్టం చేయడానికి ఉపయోగపడేటట్లు చూడాలి.

సైద్ధాంతికంగా 'పాతను వదిలించుకొని, కొత్తను స్వీకరించడానికి', తమ ప్రాపంచిక దృక్పథాన్ని తిరిగి మలుచుకోవడానికి కమ్యూనిస్టులకు

విమర్శా, స్వయం విమర్శ ఒక అత్యవసరమైన ఆయుధం. మన పార్టీ సభ్యులకు వివిధ వర్గమూలాలు ఉన్నాయి. వివిధ రకాల నుంచి వచ్చినవాళ్ళు ఉన్నారు. వర్గాలు, బూర్జువా భావాలు ఉన్న సమాజంలో జీవిస్తున్నారు. పాత అలవాట్లు పార్టీ సభ్యుల మీద నిరంతరం ప్రభావం వేస్తూ ఉంటాయి. పార్టీ శ్రేణులను నాశనం చేస్తూ ఉంటాయి. అనేక మంది కామ్రేడ్స్ మెదళ్ళలో కార్మికవర్గేతర భావాలు ఇంకా కొంతమేరకు ఉన్నాయి. విమర్శా, స్వయం విమర్శ ఆయుధాన్ని గ్రహించడం ద్వారానే 'పాతను వదిలించుకొని కొత్తను స్వీకరించేందుకు' కష్టపడి పని చేయడం ద్వారానే మనం వివిధ కార్మికవర్గేతర భావాలను ఓడించగల్గుతాం. బూర్జువా భావజాలం, ఇతర దోపిడీ వర్గాల భావజాలం ప్రభావం వేయకుండా చూడగలం. అంతేకాక భౌతిక ప్రపంచం గురించిన మన పరిజ్ఞానం పరిమితమైనది కనుక మన పనిలో లోపాలనూ, పొరపాట్లను నివారించడం కష్టం. మన పనిలో పైకి వచ్చే పొరపాట్లనూ, లోపాలను బహిర్గతం చేయడానికి తరచు విమర్శా, స్వయం విమర్శను ఆచరించడం ద్వారా మనం భావవాదాన్ని తుడిచిపెట్టగల్గుతాం. మన అనుభవాలను క్రోడీకరించి నిరంతరం ముందుకు సాగుతాం. మనం పని మెరుగుగా చేయడానికి పార్టీకీ, ప్రజలకు మరిన్ని గొప్ప దోహదాలు చేయడానికి ఇది మనకు దోహదం చేస్తుంది.

చైర్మన్ మావో విమర్శా, స్వయం విమర్శకు ఎల్లప్పుడూ గొప్ప ప్రాధాన్యతనిచ్చాడు. పార్టీలో తప్పుడు భావాలను సరిదిద్దడం అన్న వ్యాసంలో 'పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడానికీ, దాని పోరాట సామర్థ్యాన్ని పెంచడానికి పార్టీ అంతర్గత విమర్శ ఒక ఆయుధం'. 1942లో యేనాన్‌లో జరిగిన దిద్దుబాటు ఉద్యమం మొత్తంగా మార్క్సిస్టు బోధనా ఉద్యమం. పెద్ద ఎత్తున సాగిన విమర్శా, స్వయం విమర్శ ఉద్యమం. యావత్తు దేశం విముక్తి చెందిన తర్వాత మన పార్టీ మరోసారి అనేక దిద్దుబాటు ఉద్యమాలు నడిపింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన కొద్ది మంది పార్టీ వ్యక్తులను ఎండగట్టేందుకు లక్షలాది మంది ప్రజలు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పడం, పెద్దక్షరాల పోస్టర్లు, మహత్తర వాద వివాదాలు, విప్లవ అనుభవాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం అన్న ఆయుధాలను వినియోగించుకున్నారు. ఇలా లీ షావ్ చీ, లిన్ పీయావోల నేతృత్వంలో ఉన్న రెండు బూర్జువా కేంద్రాలను ధ్వంసం చేసారు. మన పనిలో తప్పులనూ, లోపాలను బహిర్గతం చేసి విమర్శించారు. తద్వారా పార్టీ ఐక్యతను ఎంతగానో పటిష్టం చేసారు. లిన్ పీయావోను విమర్శించే, పని శైలిని సరిదిద్దుకునే ఉద్యమంలోనూ, పార్టీ వ్యతిరేక లీన్ పీయావో ముఠా విప్లవ ప్రతీఘాతుక నేరాలనూ, రివిజనిస్టు తప్పుడు ధోరణులను లోతుగా విమర్శించడం ద్వారాను యావత్తు పార్టీ సభ్యులు రెండు పంథాల పోరాటంలో అనుభవాన్ని పెంచుకున్నారు. విమర్శా, స్వయం విమర్శ ఆచరించడంలో తమ చైతన్యాన్ని పెంపొందించుకున్నాయి. పార్టీలో విమర్శా, స్వయం విమర్శను పటిష్టం చేసారు.

విమర్శా, స్వయం విమర్శలను సరిగా వ్యవహరించడం కోసం మనం ముందుగా 'ఐక్యతా-విమర్శా-ఐక్యతా' సూత్రాన్ని జాగరూకతతో అన్వయించాలి. అంటే ఐక్యతా ఆకాంక్షతో మనం మొదలు కావాలి. విమర్శా, పోరాటాల ద్వారా నిజానికీ, అబద్ధానికి స్పష్టమైన తేడా చూడాలి. ఈ నూతన పునాదిగా నూతన ఐక్యత సాధించాలి. విమర్శా, స్వయం విమర్శ చేసేటప్పుడూ మనం రెండు తప్పుడు వైఖరుల మీద పోరాడాలి. మొదటిది తప్పులనూ, లోపాలను విమర్శించకుండా, వాటిని ఎదురించకుండా కేవలం ఐక్యతా గురించి మాట్లాడడం. ఈ వైఖరి అవలంభించే కామ్రేడ్స్ వైరుధ్యాలను నివారించాలనే చూస్తారు. పోరాటం జరుగుతున్నప్పుడూ తమ నోళ్ళు మూసుకుంటారు. తప్పుడు అభిప్రాయాలను విన్నప్పుడు ఖండించరు. పార్టీకి హాని చేసే చర్యలు కనిపించినప్పుడూ వ్యతిరేకించరు. ఎటువంటి పరిస్థితులలోనైనా వారు ఏ వైఖరీ తీసుకోరు. మరింత క్లిష్టత కాకుండా చూసుకుంటారు. ఈ రకంగా 'తెలివైన వృద్ధుడిలా' ప్రవర్తించడం పూర్తిగా తప్పు. రెండవ వైఖరి కేవలం విమర్శ గురించి, పోరాటం గురించి మాట్లాడడం. తప్పులు చేసిన కామ్రేడ్స్‌తో ఐక్యతకు ఆకాంక్ష లేకపోవడం. ఈ వైఖరి అవలంబించే కామ్రేడ్స్ దురుసుగా తీర్పులిస్తారు. ఎలా పడితే అలా ఆరోపణలు చేస్తారు. ఈ పద్ధతి సమస్యను పరిష్కరించలేకపోవడం మాత్రమే కాక, వ్యక్తిగతంగా కామ్రేడ్స్‌కు పార్టీ ఐక్యతకు హానికరమైనది. చైర్మన్ మావో ఇలా బోధించాడు- 'వాస్తవాల పునాదిగా వ్యాఖ్యలుండాలి, రాజకీయాలు కేంద్రంగా విమర్శ ఉండాలి' విమర్శా, స్వయం విమర్శ నిర్వహించేటప్పుడూ మనం వాస్తవాల నుండి సత్యాలను గ్రహించాలి. ప్రజలను హేతుబద్ధమైన వాదనలతో ఒప్పించాలి. ఇది క్రమబద్ధంగా సకాలంలో చేయాలి. సమస్యలు పేరుకునే వరకు అవి అత్యంత తీవ్రంగా తయారయ్యే వరకు ఆగి, ఒకేసారి అన్ని సరిదిద్దేందుకు ప్రయత్నించరాదు. ఈ పద్ధతి అనుసరిస్తే భారీ నష్టాలకు దారి తీయవచ్చు. సకాలంలో జోక్యం కలిగించుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. పార్టీ నిర్మాణపరమైన జీవితం శక్తివంతంగా నిలబడేందుకు మనం విమర్శా, స్వయం విమర్శలను లోతుగా చేపట్టాలి. అన్ని స్థాయిలలోను పార్టీ నిర్మాణాలలో నాయకత్వ కామ్రేడ్స్ సాధారణ సభ్యుల మాదిరిగానే నిర్మాణ జీవితంలో పాలుపంచుకోవాలి. ఇతర సభ్యుల అభిప్రాయాలనూ, విమర్శలను వినమ్రంగా వినాలి. క్రమబద్ధంగా స్వయం విమర్శా చేపట్టాలి. సాధ్యమైనంత ఉత్తమమైన పని చేయడానికి కృషి చేయాలి.

విమర్శా, స్వయం విమర్శలను సరిగా నిర్వహించాలంటే, విమర్శించేవాళ్ళు ఈ సూత్రానే అన్వయించాలి- మీకు తెలిసినదంతా చెప్పండి. పరిమితులు లేకుండా చెప్పండి. సూచనలు చేయాలనుకుంటే చేయండి. లోపాలు, తప్పులు కనిపిస్తే విమర్శించండి, అలాగే వారి వైఖరీ, పద్ధతి, ఫలితాల పట్ల జాగ్రత్తగా శ్రద్ధ వహించాలి. విమర్శకు గురయ్యేవాళ్ళు పార్టీ ఆశయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. సూత్రాల ప్రకారం నడుచుకోవాలి- 'మాట్లాడేవాళ్ళను కాక వారి మాటల్ని హెచ్చరికగా తీసుకోండి'. 'మీరు తప్పులు చేసి ఉంటే సరిదిద్దుకోండి. చేయకపోతే జాగ్రత్త పడండి'. ఎదుటివాళ్ళ విమర్శను వినమ్రంగా వినాలి. నిజాన్ని ధైర్యంగా అంగీకరించాలి. మన తప్పులను సరిదిద్దుకోవాలి. విమర్శ చేసే వారి విషయానికి వస్తే, అది సరైనదైతే మనం అంగీకరించాలి. ఎదుటివాళ్ళు చేసిన విమర్శ వాస్తవం కాకపోయినా లేదా విశ్లేషణా, విమర్శ చైతన్యవంతంగా చేయకపోయినా

కూడా మనం ఓపికగా వినాలి. అందరిలో మంచిని తీసుకోవాలి. విమర్శకులను దూషించరాదు. దీనిని సాకుగా తీసుకొని విమర్శను నిరాకరించరాదు. పొగడ్తలకు చిరునవ్వు నవ్వి, విమర్శలకు కోపం తెచ్చుకోరాదు. లేదా 'నీవు ముట్టుకోకూడదని పులి'లాగా ప్రవర్తించకూడదు. కొందరు కామ్రేడ్స్ తప్పు చేసినప్పుడూ, విమర్శకు గురైనప్పుడూ దాని నుంచి అనుకూల పద్ధతిలో పాఠం నేర్చుకోవడానికి కాక, అందుకు విరుద్ధంగా 'ఇక మన తలలెత్తుకోలేం' అని ఆలోచిస్తారు. తమ పనిలో నిర్లిప్తంగా, మాములుగా తయారవుతారు. ఇది కొత్త తప్పులకు దారి తీస్తుంది. ఇక విమర్శకు గురైనవాళ్ళు కొందరు కోపం పెట్టుకొని తమను విమర్శించినవారి మీద ప్రతీకారం తీసుకోవాలనుకుంటారు. అది పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా పని చేయడమే. దీనికి వ్యతిరేకంగా మనం నిశ్చయాత్మకంగా జాగ్రత్త పాడాలి. ముఖ్యంగా పార్టీ కేడర్లు తమ పట్ల తాము ఖచ్చితంగా ఉండి ప్రజలకూ, పార్టీ సభ్యులకు నమూనాగా పని చేయాలి. వాళ్ళు ఒకరిని విమర్శించేటప్పుడూ తప్పనిసరిగా సూత్రాన్ని ఎత్తిపట్టాలి. అయితే పద్ధతిపట్ల కూడా శ్రద్ధ పెట్టాలి. పరిశోధించి వాస్తవాల నుండి సత్యాలను రాబట్టాలి. ఎన్నడూ తేలికగా మాట్లాడరాదు. వ్యవహరించరాదు. లేదా కారణం లేకుండా ఎవరిని దూషించరాదు. పార్టీ సభ్యులు, ప్రజలు చేసిన విమర్శలకు సంబంధించి, వాళ్ళకు కార్మికవర్గ విశాలత్వం ఉండాలి. వినమ్రంగా వినాలి. ఎదుటివారి సూచనల నుంచి నిర్ధారణలకు రావాలి. వాటి నుండి తమ రాజకీయ బోధనకు సామాగ్రిని తీసుకోవాలి. తమ లోపాలనూ, తప్పులను సరిదిద్దుకొని తమ పనిని చక్కగా చేయాలి.

విమర్శా, స్వయం విమర్శ నిర్వహించడానికి మనను మనం తీవ్రంగా 'ఖండించుకోవాలి'. ఛైర్మన్ మావో ఇలా బోధిస్తాడు– 'ప్రపంచాన్నీ మార్చాలని కార్మికవర్గం, విప్లవ ప్రజానీకం చేస్తున్న పోరాటంలో ఈ కింది కర్తవ్యాలను పరిపూర్తి చేయాలి– భౌతిక ప్రపంచాన్ని మార్చాలి. అదే సమయంలో తమ స్వీయాత్మక ప్రపంచాన్ని కూడా మార్చాలి– గ్రాహ్యసామార్థ్యాన్ని మార్చాలి. స్వీయాత్మకతా, భౌతిక ప్రపంచం మధ్య సంబంధాలను మార్చాలి'. మన సొంత స్వీయాత్మక ప్రపంచాన్ని మార్చుకోవడానికి ముందుగా మనల్ని మనం ఖండించుకోవాలి. అన్ని విషయాలలోనూ ఒకటి రెండుగా విభజితమవుతుంది. మనలను మనం పరిక్షించుకున్నప్పుడు కూడా ఇది నిజం. మన బలాలను మనం సాధించిన వాటిని పరిగణించడం అవసరమైనప్పటికీ, మన లోపాలనూ, పొరపాట్లను మరింతగా దృష్టిలో ఉంచుకోవాలి. మన లోపాలనూ, తప్పులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మనం మన వినమ్రమైన, నిశితమైన పనిశైలిని నిలబెట్టుకోగల్గుతాం. మనను మనం సరిగా అర్థం చేసుకోగల్గుతాం. మన నిజమైన విలువను అంచనా వేసుకోగల్గుతాం. మనను మనం తెలుసుకోకపోతే ఒకటి రెండుగా విభజితమవుతుందన్న సూత్రాన్ని మనం అన్వయించుకోలేం. మన విజయాలను మాత్రమే చూసి, లోపాలను చూడకపోతే మనం ఖచ్చితంగా గుడ్డివాళ్ళమవుతాం. మనం మన లోపాలనూ, తప్పులను విశ్లేషించుకొని క్షుణ్ణంగా నిర్మూలించకపోతే మనకు మనం హాని చేసుకున్నవాళ్ళమవుతాం. విప్లవానికి హాని చేసినవాళ్ళమవుతాం. క్రమబద్ధంగా, చైతన్యవంతంగా విమర్శా, స్వయం విమర్శనూ ఆచరించడం ద్వారానే మనలో మనం సంతృప్తి పడకుండా ఉంటాం. మన లోపాలు గుర్చుపెట్టుకుంటాం. మనం విజయాలు సాధించినప్పుడూ అహంకారానికి గురై వైఫల్యాలు ఎదుర్కొన్నప్పుడు నిరుత్సాహపడకుండా ఉంటాం. ఎల్లప్పుడూ స్పష్టంగా ఉంటాం. పూర్తిగా విప్లవ స్ఫూర్తితో విప్లవ పోరాటానికి గట్టిగా ఉంటాం. విప్లవాన్ని కొనసాగించే మార్గంలో ఎన్నడూ ఆగిపోం. కార్మికవర్గ పురోగామి శక్తులుగా తయారు కావడం కోసం మనకు మనం శిక్షణనిచ్చుకున్నవాళ్ళమవుతాం.

**"వాగాడంబరాన్ని తగ్గించుకొని నిరాడంబరమైన దైనందిన కార్యక్రమం మీద శ్రద్ధ వహించాలి. రాజకీయ బేషజాలు మాని కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికి అవసరమైన విషయాలపై దృష్టిని కేంద్రీకరించాలి"**

***- కామ్రేడ్ లెనిన్ (9వ సంపుటి, పేజి 440)***

# భారతదేశంలో కుల సమస్య - మన దృక్పథం ప్రత్యేక కార్యక్రమం

ఈ వ్యాసం 'భారతదేశంలోని కుల సమస్య – మన దృక్పథం' అనే దస్తావేజు నుంచి తీసుకోబడింది. ఈ దస్తావేజుని సీ.పీ.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ జనవరి 2021లో, తన అధికారిక దస్తావేజుగా విడుదల చేసింది. ఈ దాస్తావేజులోని 7వ అధ్యాయాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

*- (తెలుగు దస్తావేజు 80వ పేజి నుంచి 87 వ పేజి వరకు)*

నేటి భారతదేశంలో కులవ్యవస్థను కాపాడుతున్నటువంటి ఫ్యూడలిజాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా కులవ్యవస్థ సమూల నిర్మూలనకు కావలసిన అనుకూలమైన భౌతిక పరిస్థితిని సృష్టించే లక్ష్యంతో సకల రంగాలలో కులవ్యతిరేక పోరాటం కొనసాగించాలి. ఈ లక్ష్య సాధన కోసం ఈ క్రింది వ్యూహాత్మక, ఎత్తుగడల కర్తవ్యాలు చేపట్టాలి.

### వ్యూహాత్మక కర్తవ్యాలు

1. మనదేశంలో అశేష ప్రజారాశులను వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకు కట్టిపడవేసి ఉంచడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సంకెలుగా ఉన్న; మెజారిటీ ప్రజల దోపిడీ పీడనలకూ, దారిద్ర్యానికీ దయనీయ స్థితికీ, అమానవీయమైన అంటరానితనానికీ కులపీడనకూ మూలభూతంగా ఉన్న; దేశ నిజమైన స్వాతంత్ర్యానికీ ప్రజాస్వామ్యానికీ సార్వభౌమత్వానికీ ఆర్థిక రాజకీయ సాంస్కృతిక పురోభివృద్ధికీ పెను ఆటంకంగా ఉన్న కుల ఆధారిత భూస్వామ్య విధానంతో పాటు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్ని కూలదోయడానికి కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు విప్లవకర వర్గాల ప్రజలను, దళిత–ఆదివాసీ–మతమైనారిటీ–పీడిత జాతుల ప్రజలను, మహిళలను కదిలించి నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారా కులవ్యవస్థ పునాదులను పెకిలించివేసి శాశ్వితంగా కుల వ్యవస్థ నిర్మూలనకు కావలసిన భౌతిక పరిస్థితులను సృష్టించడం.

2. కార్మికవర్గ మహత్తర సిద్ధాంతమైన మార్క్సిజం–లెనినిజం–మావోయిజం (ఎంఎల్ఎం) మార్గదర్శకత్వాన కార్మికవర్గ పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవ కాలంలో బ్రాహ్మణీయ కులాధారిత భూస్వామ్య భావజాలాన్నీ సంస్కృతినీ, వాటి వివిధ వ్యక్తీకరణలనూ ప్రధానంగా టార్గెట్ చేసి పోరాడుతూనే సామ్రాజ్యవాద భావజాలానికీ, సంస్కృతికీ, వాటి వివిధ వ్యక్తీకరణలకూ వ్యతిరేకంగానూ పట్టువిడవకుండా పోరాడడం; సాంస్కృతిక రంగంలో విప్లవాన్ని ప్రభావవంతంగా కొనసాగించడంలో భాగంగా స్వీయాత్మక శక్తుల–ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని శాస్త్రీయంగా మలచడానికి గతితార్కిక చారిత్రిక భౌతికవాద సిద్ధాంతాన్ని, ప్రజాస్వామిక భావాలను, సోషలిస్టు భావజాలాన్నీ, నూతన ప్రజాస్వామిక రాజకీయాలను, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని విస్తృతంగా ప్రజల ముందుకు తేవడం ద్వారా స్వీయాత్మక శక్తులను, అశేష పీడిత ప్రజారాశులను నూతన ప్రజాస్వామిక విప్లవంలో చైతన్యయుతంగా, విస్తృతంగా సమీకరించడం; రాజకీయ రంగంలో కొనసాగే విప్లవంతో పాటే సాంస్కృతిక రంగంలో విప్లవాన్ని కొనసాగిస్తూ కాలంచెల్లిన అభివృద్ధి నిరోధక శక్తులకు ప్రాతినిధ్యం వహించే బ్రాహ్మణవాద, కులాధిపత్య, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులను తుడిచిపెట్టి అంటరానితనానికి, కులపీడనకు తావులేని నిజమైన ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతిని నెలకొల్పడం.

3. సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలచే అత్యంత తీవ్రంగా వర్గ దోపిడీ పీడనలతో పాటు సామాజిక అణచివేతకు గురవుతున్నదీ; నూతన ప్రజాస్వామిక విప్లవంలో పాల్గొనేదీ; వర్గ సెక్షనల్ సంఘాలను, సంస్థలను ఏర్పరచుకునేదీ; విప్లవానికి నాయకత్వం వహించే కార్మికవర్గం చేతుల్లో అద్భుత ఆయుధాలుగా ఉండే పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన నిర్మాణాలలో ఉండేదీ; ఈ విప్లవాన్ని విజయవంతం చేసి నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించుకునేదీ; ముందు జనతా ప్రజాస్వామిక నియంతృత్వం కింద సోషలిస్టు పరివర్తనను పూర్తి చేసి తదనంతరం కార్మికవర్గ నియంతృత్వం కింద నిరంతరాయ వర్గపోరాటం ద్వారా సోషలిజం, కమ్యూనిజం లక్ష్యంతో పురోగమించేదీ; ప్రధానంగా దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్యతరగతి ప్రజలే, ప్రత్యేకంగా కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదరైతులు, అర్ధశ్రామికులే. మన సామాజిక నిర్దిష్ట పరిస్థితులలో వీరిలో అత్యధికులు దళిత తదితర పీడిత సెక్షన్లకు చెందినవారే. ఇలాంటి పరిస్థితులలో నూతన ప్రజాస్వామిక విప్లవ ఐక్యసంఘటనలో, నూతన విప్లవకర రాజకీయాధికారంలో వారికి నిర్దిష్ట ప్రాతినిధ్యం ఉండాలి. అయితే సామాజిక విప్లవంలోని సకల రంగాలలో పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజల చైతన్యయుత, క్రియాశీల పాత్రను పెంపొందిస్తూ కార్మికవర్గ నాయకత్వాన్ని స్థాపించడం అనే వ్యూహాత్మక కర్తవ్యం అత్యంత కీలకమైనది. ఈ కర్తవ్యాన్ని మన పార్టీ మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మార్గదర్శకత్వంలో మన దేశ సామాజిక నిర్దిష్ట పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వర్గపంథాను, ప్రజాపంథాను

సృజనాత్మకంగా అన్వయిస్తూ పనిచేయడం ద్వారా పరిపూర్తి చేయాల్సి ఉంటుంది.

4. మా–లె–మా సిద్ధాంత మార్గదర్శకత్వాన పనిచేసే మన పార్టీకి గల శాస్త్రీయమైన, స్పష్టమైన, సరైన అవగాహన ప్రకారం భారత సమాజంలో వర్గాలు ఏర్పడినప్పటి నుండి నేటివరకు గడచిన వేల సంవత్సరాల చరిత్రంతా పీడక, పీడిత వర్గాల మధ్య జరిగిన వర్గపోరాట చరిత్రే. భారతదేశంలో వర్ణాలుగా వర్గాలు ఏర్పడినప్పటి నుండి వివిధ సామాజిక దశలలో–వర్ణ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ/కులవ్యవస్థ, వలస–భూస్వామ్య/అర్ధభూస్వామ్య వ్యవస్థ, అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలలో జరిగిన వర్గపోరాటమే సామాజికాభివృద్ధికి ప్రధాన కారణం. ఈ సమాజాలన్నిటిలోనూ భావజాల, సామాజిక, సాంస్కృతిక, ధార్మిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ తదితర రంగాలలో నిరంతరాయంగా వర్గపోరాటం కొనసాగింది. పీడితులెపుడూ పీడకులకు వ్యతిరేకంగా పోరాడకుండా లేరు. ఈ పోరాటం హింసాయుతంగానో హింసేతరంగానో, తీవ్ర స్థాయిలోనో, మంద్రస్థాయిలోనో రూపాలు, తీవ్రత ఏవైనప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూనే వచ్చింది. వీటిలో పీడితులకు లభించిన జయాపజయాల సంఖ్య, స్థాయి ఏదైనప్పటికీ ఈ పోరాటం కొనసాగుతూనే ఉన్నది. పీడితులు పీడకులకు వ్యతిరేకంగా కొనసాగించిన పోరాట వారసత్వాన్నీ, పాజిటివ్ అనుభవాలన్నిటినీ మనం ఎత్తిపట్టాలి. ఇందులో భాగంగా వర్గపీడనకు, సామాజిక పీడనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల పాజిటివ్ అంశాలన్నిటినీ ఎత్తిపట్టాలి, వీటి పరిమితులను ఎత్తిచూపాలి, వీటి నెగెటివ్ అంశాలను తిరస్కరించాలి. పీడితులు జరిపిన ఈ పోరాటాల కొనసాగింపుగా, అభివృద్ధిగా నేడు మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న వర్గపోరాటం/ప్రజాయుద్ధం తుదివిజయం వరకు నడిపి వర్గపీడన నుండి, సామాజిక పీడన నుండి విముక్తి సాధించాలి. దీని ద్వారా దేశ జనాభాలో 90 శాతానికి పైగా ఉన్న పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజలు విముక్తమవుతారు.

**ఎత్తుగడల కర్తవ్యాలు**

వ్యూహాత్మక కర్తవ్యాలను సఫలం చేయడానికి ఈ కింది సాధారణ ఎత్తుగడల కర్తవ్యాలు రూపొందించుకుంటాం. వీటిని అమలు చేసేటప్పుడు మన దేశ అసమానాభివృద్ధినీ, వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఇచ్చిన ఎత్తుగడల కర్తవ్యాలతోపాటు, ఇతర పోరాట నిర్మాణ రూపాలను సృజనాత్మకంగా చేపట్టాలి.

1. కులనిర్మూలనా లక్ష్యంతో కులపీడనకు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలోని వివిధ వర్గ సంఘాలు, సెక్షనల్ సంఘాలు దళిత తదితర పీడిత కులాల, ప్రజాస్వామిక వర్గాల, సెక్షన్ల ప్రజలను రాజకీయంగా సమీకరించి ఉద్యమాలు నిర్మిస్తాయి. నేటి ఉద్యమ విస్తృతిని, ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఈ సమస్యపై కొనసాగే పోరాటాలను ఉన్నత స్థాయికి అభివృద్ధి చేయటానికి కృషి చేయవలసి ఉంటుంది. ఈ పోరాటాలను వ్యవసాయ విప్లవ పోరాటాలతోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతోనూ సమన్వయించి ప్రభావవంతంగా నడపాలి. అలాగే మన వర్గసంఘాలు ఈ సమస్యపై పనిచేసే వివిధ ప్రత్యేక సంస్థలతోనూ, ఐక్యసంఘటన వేదికలతోనూ సమన్వయించి తమ కార్యకలాపాలు కొనసాగించాలి.

ఇదే సమస్యపై దళిత తదితర పీడిత కులాల ప్రజలనూ, కులపీడనను వ్యతిరేకించే పైకులాల లోని ప్రజాస్వామిక శక్తులను రాజకీయంగా సమీకరిస్తూ తగిన ప్రత్యేక పోరాట, నిర్మాణ రూపాలను రూపొందించుకోవాలి. దేశ సామాజిక, విప్లవోద్యమ పరిస్థితులలోని అసమానాభివృద్ధిని దృష్టిలో పెట్టుకునీ, ప్రజల రాజకీయ చైతన్యంపై, పోరాట సంసిద్ధతపై ఆధారపడి తగిన ప్రత్యేక నిర్మాణాలను ఏర్పరచుకోవడం ద్వారా పోరాట క్రమంలో తమ స్వీయానుభవంతో ప్రజలు మరింత ఉన్నత పోరాట, నిర్మాణ రూపాలను చేపట్టగలుగుతారు.

ఈ సమస్యపై మన అవగాహనకు దగ్గరగా ఉన్న ఎం.ఎల్. పార్టీలతో, వారి ప్రజాసంఘాలతో, ఇతర ప్రజాస్వామిక సంస్థలతో, వ్యక్తులతో ఎత్తుగడలపర ఐక్యసంఘటనా వేదికలను నిర్మించాలి. అలాగే కొన్ని సమయాల్లో సమస్య ప్రాతిపదికన కలిసివచ్చే రివిజనిస్టు పార్టీలతో, వాటి ప్రజాసంఘాలతో, వ్యక్తులతో తాత్కాలిక ప్రాతిపదికన కలిసి పనిచేయాలి. వీటన్నింటి ద్వారా దళిత తదితర పీడిత కులాల ప్రజలను, కులపీడనను వ్యతిరేకించే ఇతర కులాల లోని ప్రజాస్వామిక శక్తులను రాజకీయంగా సమీకరించి దేశంలో విశాలమైన, బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ కార్యకలాపాలన్నింటి నిర్వహణకు మన లక్ష్యం కులవ్యవస్థను రద్దు చేయడమే.

ఈ క్రమంలో ఉద్యమ నిర్మాణం విస్తృతం, పటిష్టం కావడమే గాకుండా దీని నాయకత్వం కూడా సమర్థవంతంగా తయారవుతుంది. ఈ ఉద్యమ శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా మలచి మన పార్టీలోకి తీసుకొనిరావడం ద్వారా మన పార్టీ యొక్క ప్రజాస్వభావం పెంపొందడమే గాకుండా వర్గపునాది, సామాజిక పునాది బలోపేతం అవుతుంది.

2. బ్రాహ్మణీయ కుల ఆధారిత భూస్వామ్యానికి వ్యతిరేకంగా భావజాల రంగంలోనే గాకుండా రాజకీయ రంగంలోనూ పార్టీ వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. ముఖ్యంగా ప్రభుత్వాలు, బ్రాహ్మణవాద సంస్థలు, హిందూ మత దురహంకార సంస్థలు బ్రాహ్మణవాద–పీడక కుల అనుకూల భారత రాజ్యాంగాన్నీ, రాజ్యాంగ యంత్రాంగాన్ని వివిధ రకాలుగా వినియోగించుకొని చేపట్టే భావజాల, మత, సాంస్కృతిక ప్రచారాన్ని, కార్యక్రమాలను ప్రజలలో ఎండగట్టాలి, ఎదుర్కోవాలి, రాజ్యాంగపు–రాజ్యాంగ యంత్రపు హిందూమత, పీడక కుల అనుకూల పక్షపాతాన్ని బహిర్గతం చేయాలి.

3. పార్టీ యూనిట్లు సామాజిక సంబంధాలపై పరిశోధనా కార్యక్రమం చేపట్టినప్పుడు, నేటికీ పునాదిలో, ఉపరితలంలో వివిధ రూపాలలో ఉన్న కులాన్ని కూడ దృష్టిలో వుంచుకొని వర్గ వైరుధ్యాలను అధ్యయనం చేయాలి. అలాగే కుల వైరుధ్యాల వివిధ వ్యక్తీకరణలను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. నిర్దిష్ట అధ్యయన క్రోడీకరణల ప్రాతిపదికగా వ్యవసాయక విప్లవ కార్యక్రమానికి కుల నిర్మూలనా కార్యక్రమాన్ని జోడించి అమలు చేయాలి. ఏక కాలంలో తీసుకునే ఈ రెండు కార్యక్రమాలు ఒక దానిపై మరొకటి సకారాత్మక ప్రభావాన్ని వేస్తాయి.

4. పార్టీలో చేరే నూతన శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా ప్రోలిటేరియనైజు చేయడానికీ, పాత శక్తులలో తలెత్తే కార్మికవర్గేతర ధోరణులను ప్రక్షాళన చేసి ప్రోలిటేరియనైజు చేయడానికీ, విప్లవానికి సమర్థవంతంగా నాయకత్వం వహించడానికి తగినట్లు పార్టీ సైద్ధాంతిక రాజకీయ స్థాయిని, నిర్మాణ పటిష్టతను పెంపొందించడానికీ నిరంతరాయంగా కొనసాగించే కృషిలో

భాగంగా, ఇందుకు చేపట్టే క్యాంపెయిన్లలో భాగంగా, పార్టీలోనూ, విప్లవోద్యమం లోని వివిధ రంగాలలోనూ ఉన్న కుల భావజాల ప్రభావంపై కూడా చర్చించాలి. ఈ చర్చల్లో కుల భావజాల ప్రభావ నిర్దిష్ట సైద్ధాంతిక, సాంస్కృతిక, రాజకీయ, నిర్మాణ వ్యక్తీకరణలను, అవి కలిగించే నెగెటివ్ ప్రభావాన్ని-నష్టాన్ని గుర్తించి వాటిని సరిదిద్దడానికి స్వయంవిమర్శ-విమర్శ పద్ధతిని అనుసరించాలి. దీనికి తోడ్పడడానికి ఈ సమస్యపై అధ్యయనం, ఎడ్యుకేషన్ కొనసాగించాలి. ఈ సమస్యపై తలెత్తే తప్పుడు ధోరణుల తీవ్రతనీ, విస్తృతిని దృష్టిలో పెట్టుకొని, సైద్ధాంతిక రాజకీయ పోరాటం కొనసాగించాలి. ఈ పద్ధతి యావత్తు పార్టీ (అన్ని రంగాలలోని పార్టీ యూనిట్ల)లోనూ ప్రవేశపెట్టాలి. నేటి మన అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజాన్ని నూతన ప్రజాస్వామిక సమాజంగా మార్చే తక్షణ లక్ష్యంతో, తదనంతరం సోషలిస్టు సమాజంగా, కమ్యూనిస్టు సమాజంగా మార్చే అంతిమ లక్ష్యంతో సాగుతున్న సామాజిక విప్లవానికి నాయకత్వం వహించే పార్టీ ఈ విషయంలో కూడా ప్రజల ముందు పీఠీన నిలవాల్సిన అవసరం ఉంది.

5. ప్రజాస్వామిక ఉద్యమంలో భాగమైన అస్థిత్వ ఉద్యమాలను సమర్థిస్తూనే వీటిపై పడే పోస్ట్‌మోడర్నిస్టు సిద్ధాంత ప్రభావాన్ని సిద్ధాంతపరంగా ఎత్తిచూపుతూ ఇవి సరైన దిశలో సాగడానికీ, విప్లవోద్యమంలో భాగం చేయడానికి కృషి చేయాలి. వివిధ సామాజిక సెక్షన్లు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలు తమ ప్రజాస్వామిక డిమాండ్ల కొరకు పోరాడుతూనే, తమ కన్నా సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి పోయిన సెక్షన్ల, ప్రజల హక్కులను గౌరవించడమే కాకుండా వారి పోరాటానికి మద్దతు తెలిపే ప్రజాస్వామిక దృక్పథాన్ని అలవర్చుకునే విధంగా వారిని ఎడ్యుకేట్ చేయడానికి కృషి చేయాలి. అప్పుడే మనం సాధించాల్సిన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం దిశగా విశాల పీడిత ప్రజానీకం మధ్య ఐక్యత ఏర్పడుతుంది.

6. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఎత్తుగడలపర ఐక్యసంఘటన నిర్మించాలి. కుల నిర్మూలనా సంఘాల తోనూ, ప్రజాస్వామిక స్వభావం కలిగిన వివిధ దళిత, ఆదివాసీ, మత మైనారిటీ, పీడిత జాతుల సంస్థలతోనూ, మహిళా సంఘాలతోనూ, లౌకికవాద శక్తులతోనూ, కలిసి వచ్చే ఎం-ఎల్ శక్తులతోనూ దీన్ని నిర్మించాలి. హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా దేశంలో కొనసాగుతున్న ఉద్యమానికి ఒక సరైన దిశనిచ్చి రాజకీయంగా సంఘటిత పరచాలి. కలసి వచ్చే రివిజనిస్టు పార్టీల , బూర్జువా పార్టీల ప్రజా సంఘాలతోసమస్య ప్రతిపాదికన మాత్రమే ఎత్తుగడలపరంగా తాత్కాలిక ఫ్రంట్ కట్టాలి. పార్లమెంటరీ పార్టీలతో సమస్య ప్రాతిపదికపై తాత్కాలిక ఫ్రంట్ కట్టేటపుడు ప్రజలలో వీరి పట్ల భ్రమలు ఏర్పడకుండా చూడాలి.

7. పీడిత ప్రజలలో ఉన్నటువంటి వెనకబాటు భావజాలాన్ని తొలగించడానికి వారికి శాస్త్రీయ భావజాలాన్ని అందించడం ద్వారా, వారిని ప్రజాస్వామిక విప్లవ రాజకీయోద్యమాలలోకి సమీకరించడం ద్వారా చైతన్యవంతులను చేయాలి. ఇందుకు మన పార్టీతో పాటు మన పార్టీ నాయకత్వంలోని వివిధ ప్రజాసంఘాలు ప్రణాళికాబద్ధంగా, నిరంతరాయంగా కృషి చేయాలి. ఇందులో విద్యార్థి యువజనుల, సాహితీ సాంస్కృతిక రంగాల పాత్ర చాలా ప్రముఖంగా ఉంటుంది.

కుల భావజాలానికి, అన్ని ఇతర రూపాలలోని కులతత్వ ఆలోచనలకు వ్యతిరేకంగా భావజాలపరమైన పోరాటం నడపాలి. మనుస్మృతి-వేదాలు, రామాయణ, మహాభారతాలు మొదలైన వాటిలో గల కులతత్వ భావజాలాన్ని ఎండగట్టాలి. ఉపరితలంలో విప్లవాన్ని కొనసాగించడంలో భాగంగా బ్రాహ్మణవాదాన్నీ, కులతత్వాన్నీ భావజాలపరంగా ఎదుర్కోవడంపై కేంద్రీకరించి పనిచేయాలి.

పాలకవర్గాలు, ప్రత్యేకంగా బీజేపీ-సంఘ్‌పరివార్ శక్తులు నిరంతరాయంగా మాస్ మీడియాతో పాటు అన్ని రకాల ప్రచార, ప్రసార సాధనాలను, వివిధ రకాల హిందూమత ఛాందసవాద-దురహంకార సంస్థలతో పాటు వీటి అనుకూల దేశ విదేశీ సంస్థలను, వీటి అనుకూల స్వచ్ఛంద సంఘాలను-సేవా ముసుగులో ఉన్న సంస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని పెద్దెత్తున వినియోగించుకొని భావజాలపరంగా, సైద్ధాంతికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రజల మెదళ్లను తమ కనుకూలంగా మలచుకుంటూ తమ, సామ్రాజ్యవాదుల దోపిడీ, పీడనలను, ఆధిపత్యాన్ని మరింత తీవ్రంగా కొనసాగిస్తూ సమాజంలో అత్యంత ప్రమాదకర స్థితిని కల్పించిన నేటి పరిస్థితులలో వీటన్నింటినీ క్రియాశీలంగా, ప్రభావవంతంగా ఎదుర్కోవలసిన అవసరం ఉంది. సామాజిక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే పీడిత ప్రజలను సమైక్యంగా, క్రియాశీలంగా, సమరశీలంగా కదిలించడానికి వారి అభిప్రాయాలను విప్లవీకరించడం అత్యంతావశ్యకం. అందువల్ల ఈ లక్ష్య సాధనకు ఉపరితలంలో ప్రతీఘాతుక విప్లవాన్ని ఎదుర్కోవడాన్ని అత్యంత ముఖ్యమైన భావజాల, సైద్ధాంతిక కర్తవ్యంగా చేపట్టాలి. ఇందుకు మన పార్టీ మీడియా, సామాజిక, సాహితీ సాంస్కృతిక, విద్యా, మేధో, యువజన రంగాల్లో ప్రత్యేకంగా కేంద్రీకరించి పనిచేయాలి, అవసరమైన పోరాట నిర్మాణ రూపాలను రూపొందించుకోవాలి.

మూఢ నమ్మకాలు, అంటరానితనం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాలి.

కుల అస్థిత్వాన్ని సూచించే, హీనపరిచే సంకేతాలను, భాషను, కులతత్వాన్ని కలిగిన సంస్కృతిని వ్యతిరేకించాలి. ప్రజాస్వామిక దృష్టితో భాషా, సంస్కృతులలో అవసరమైన మార్పు తీసుకు రావడానికి మన సాహితీ సాంస్కృతికరంగ సంస్థలు కృషి చేయాలి.

గోహత్య నిషేధాన్ని వ్యతిరేకించాలి. గోమాంస భక్షణ నిషేధాన్ని వ్యతిరేకించాలి. పీడిత కులాలు ఆచరించే కొన్ని వృత్తులను, ఆవు, ఎద్దు, పంది, తదితర జంతు మాంసాలు భుజించే ప్రజల సాంప్రదాయాలను హీనంగా చూడడాన్ని వ్యతిరేకించాలి.

సామాజిక వేడుకల్లో పీడిత కులాల సమాన భాగస్వామ్యం కోసం పోరాడాలి. వర్గపోరాటంలో పాల్గొనే వివిధ కులాలకు చెందిన ప్రజల మధ్య సామాజికంగా కలిసిపోయే ధోరణిని పెంచటానికి ప్రయత్నించాలి. వివిధ కులాల ప్రజల మధ్య సహపంక్తి భోజనాలను ప్రోత్సహించాలి. మన ప్రజాసంస్థలు వివిధ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాల సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో సహపంక్తి భోజనాలను ఏర్పరచి, వీటినే ఒక ముఖ్యమైన ఎడ్యుకేషన్ వేదికలుగా వినియోగించుకోవడానికి కృషి చేయాలి.

ప్రజాసంఘాలలోని కార్యకర్తలలో కులపరమైన విశ్వాసాలను, ఆలోచనలను వ్యతిరేకించాలి, వీటిని తొలగించటానికి ఎడ్యుకేట్ చేయాలి.

పీడక కులాలలోని పేద ప్రజలలో, తాము తమ కులాలలోని

ధనవంతులతో సామాజికంగా సమానమన్న తప్పుడు చైతన్యాన్ని, భ్రమల్ని పోగొట్టాలి.

8. రాజ్య వ్యతిరేక పోరాటాలలో పీడిత కులాల ప్రజలను విస్తృతంగా సమరశీలంగా సమీకరించాలి. ఈ పోరాటాలకు వివిధ పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజల మద్దతును కూడగట్టడానికి కృషి చేయాలి. అలాగే ఇతర పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజల పోరాటాలకు పీడిత కులాల ప్రజలు మద్దత్తుగా నిలిచేలా కృషి చేయాలి.

కులవ్యవస్థ యథాతథ స్థితిని కాపాడటానికి తోడ్పడుతున్న కులపరమైన వేర్పాటుపై ఆధారపడిన గృహ పథకాలను అమలుచేస్తున్న ప్రభుత్వాల ఆధిపత్యకుల అనుకూల ఉద్దేశ్యాలను బహిర్గతపరచాలి.

కులాంతర మతాంతర వివాహాలకు మద్దతు, ప్రోత్సాహం అందించాలి. కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారి పిల్లలు తల్లిదండ్రులలో ఎవరికి లభించే సదుపాయాలనైనా పొందటానికి అర్హులవుతారని చెప్పాలి. ఈ విషయంలో అన్ని ప్రజా ఉద్యమ సంస్థల కార్యకర్తలు ఆచరణలో ఆదర్శవంతంగా ఉండాలి. కులాంతర మతాంతర వివాహాలపై అన్ని ప్రజాఉద్యమ సంస్థల నాయకత్వం తన సంబంధిత సంస్థలలో, ప్రజలలో క్యాంపెయిన్లు కూడా నిర్వహించాలి.

రిజర్వేషన్ల విధాన సక్రమ అమలు కోసం పోరాడాలి. రిజర్వేషన్లను ఎత్తివేయాలనే సంఘ్‌పరివార్ ఎజెండాకనుగుణంగా మోడీ నాయకత్వం లోని ఎన్‌డిఏ ప్రభుత్వం రిజర్వేషన్లను నీరుగార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలి. అలాగే ఇతర కులాలలోని పేదవారి పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యనందించడం కోసం పోరాడాలి. ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లను నీరుగారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌సి, బిసి, ఎస్‌టి ప్రజలతో పాటు ఇతర కులాల పేద ప్రజలను, ప్రత్యేకంగా విద్యార్థి యువజనులను, నిరుద్యోగులను, ఉపాధ్యాయులను, కార్మిక సంఘాలను, ఉద్యోగులను, ప్రజాస్వామిక విద్యావేత్తలను కదిలించి పోరాటాలు నిర్వహించాలి. విద్య కాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడాలి. పాఠ్యాంశాల నుంచి దళిత వ్యతిరేక కులతత్వ భావజాలాన్ని తొలగించాలనీ, ఆత్మగౌరవ ఉద్యమాలను కుల వ్యతిరేక/నిర్మూలనా ఉద్యమాలను చేర్చాలని పోరాడాలి.

ఎస్.సి., ఓ.బి.సి.లకు రుణాలు, సబ్సిడీలు ఇవ్వడంలో కొనసాగే పాలనాపరమైన జాప్యానికి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి.

గ్రామీణ ప్రాంతంలో దళితులు సాధించుకున్న హక్కులను వమ్ముచేయటానికి భూస్వాములకు మద్దతుగా ప్రభుత్వం అమలుపరచుతున్న నిర్బంధపూరిత చట్టాలకు, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలి.

9. ఆత్మగౌరవం కోసం దళితులు చేసే పోరాటాలను సమర్థించాలి, వాటిలో పాల్గోవాలి, వాటికి నాయకత్వాన్నందించడానికి కృషి చేయాలి. మన ఉద్యమ ప్రాంతాలలో ఈ సమస్యపై మనమే ఉద్యమాన్ని నిర్మించాలి. పరువు హత్యల పేరుతో అమానవీయంగా కొనసాగుతున్న దళిత హత్యలను ఖాప్ పంచాయితీలను వ్యతిరేకిస్తూ పోరాడాలి.

10. కుల నిర్మూలనా లక్ష్యంతో, అంటరానితనానికీ, కుల వివక్షతకు వ్యతిరేకంగా, పీడిత కులాల పైన జరిగే ఊచకోతకు, అత్యాచారాలకు, అవమానాలకు, దౌర్జన్యాలకు, అణచివేతకు వ్యతిరేకంగా కులనిర్మూలనా సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు పీడితులకు లీగల్ ఎయిడ్ నందించాలి, వారికి అండగా ఉండి నైతిక, ఆర్థిక, పాదార్థిక మద్దత్తునందించాలి, వారికండగా సాలిడారిటీ ఉద్యమాలు నిర్మించాలి. ఆచరణ క్రమంలో కులపీడనకు వ్యతిరేకంగా సృజనాత్మక పోరాట నిర్మాణ రూపాలు కూడా ముందుకు వస్తున్నాయి. మన పార్టీ వీటిని బలపరచాలి, వీటికి నిర్మాణాత్మక సలహాలందిస్తూ నాయకత్వాన్నందించడానికి కృషి చేయాలి. ఈ ఉద్యమాలను రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితపరుస్తూ కులనిర్మూలనా లక్ష్య సాధనా దిశగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి.

11. పీడక కుల సంఘాల సాంఘిక, సాంస్కృతిక ఆధిపత్య స్వభావాన్ని బట్టబయలు చేయడంతో పాటు ఇవి చేపట్టే దళిత తదితర పీడిత కుల వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడాలి. పీడక కుల దురహంకారాన్ని రెచ్చగొట్టే సంఘాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. వీటిపై మన దాడిని ఎక్కుపెట్టాలి.

పీడిత ప్రజల వర్గ ఐక్యతను, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజల ఐక్యతను నిరోధించే పీడిత కులాల లోని కులతత్వ నాయకత్వశక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. పీడక కులాధిపత్యంపై మన దాడిని ఎక్కుపెడుతూనే, పీడిత కులాలలో తలెత్తే సెక్టేరియన్ ధోరణులను వ్యతిరేకించాలి.

హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. హిందూ ఐక్యత పేరుతో పీడక కుల ఆధిపత్యాన్నీ, కులవ్యవస్థనూ కొనసాగించే ప్రయత్నాలను వ్యతిరేకించాలి. కులపరమైన అత్యాచారాలకు, దాడులకు వ్యతిరేకంగా ప్రతిఘటించడం కోసం మనం చొరవ చేయాలి. అత్యాచారాలకు పాల్పడే వారిని శిక్షించి పీడిత ప్రజలకు న్యాయం చేయడంలో ముందుండాలి. ఇందుకోసం ఆత్మరక్షణా దళాలను నిర్మాణం చేయాలి.

ఈ ప్రత్యేక కర్తవ్యాలతో పాటు మనం ఇంతవరకు చేపట్టిన ఇతర కర్తవ్యాలను కూడా వినియోగించుకోవాలి. మన సామాజిక, ఉద్యమ అసమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్నపుడు ఈ కర్తవ్యాల సాధనకు సృజనాత్మకంగా కృషి చేస్తూనే వాటికి మాత్రమే పరిమితమై ఆలోచించకూడదు. ఇతర విషయాలలో వలెనే కర్తవ్యాల విషయంలోనూ అధిభౌతికవాద దృష్టితో ఆలోచించకూడదు. సాధారణంగా మన పార్టీ అంతర్జాతీయ, దేశీయ రాజకీయార్థిక పరిస్థితులలో కలిగే మార్పులను దృష్టిలో పెట్టుకొని, ఉద్యమంలో కలిగే మార్పులను దృష్టిలో పెట్టుకుని నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణపై ఆధారపడి ఉద్యమాభివృద్ధికీ–లక్ష్యసాధనకు తోడ్పడే కర్తవ్యాలను రూపొందించుకుంటుంది. మనం అశేష పీడిత ప్రజారాశులను ఎంత ఎక్కువగా, ఎంత క్రియాశీలంగా రాజకీయ రంగంలోకి సమీకరించగలుగుతామో, ఎంత ఎక్కువగా సంఘటితపరచగలుగుతామో వారి స్వీయ కార్యాచరణ నుండి అంత ఎక్కువగా సృజనాత్మక పోరాట నిర్మాణ రూపాలు ముందుకు వస్తాయి. అందుకనుగుణంగా ఎత్తుగడలపర కర్తవ్యాలలో కూడా మార్పు వస్తుంది. వాటిని నాయకత్వం మెరుగుపరచి అభివృద్ధి చేయాలి. కుల సమస్యపై కర్తవ్యాలు, ఎత్తుగడలు రూపొందించుకునే విషయంలోనూ మన యావత్తు పార్టీ యూనిట్లు, ప్రజాసంఘాలు సృజనాత్మకంగా, చొరవగా మన సాధారణ అవగాహనను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి.

# శత్రు గూఢాచారి వ్యవస్థ అనుభవం-5

భారత కమ్యూనిస్టు పార్టీలో దశాబ్దాలపాటు కొనసాగిన రివిజనిజంతో తెగతెంపులు చేసుకొని, సరైన విప్లవకర పంధాను రూపొందించుకొని, స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో సాగిన నక్సల్బరీ పోరాట వారసత్వంగా శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఆదివాసీ సవర, జాతాపు రైతాంగం అసంఖ్యాక త్యాగాలు చేస్తూ నూతన చరిత్రను లిఖించారు. ఆ పోరాటం సెట్‌బ్యాక్ అయిన 20 సంవత్సరాల తర్వాత మరల ఆ ప్రాంతాలకు మన పార్టీ వెళ్ళినప్పుడు ఆ పోరాట స్మృతులు స్థానిక ప్రజల్లో పదిలంగా ఉండటం విశేషం. విప్లవోద్యమాన్ని సాయుధ బలగాలతో అణచివేసిన తర్వాత ఎల్ఐసీలో భాగంగా ఆ ప్రాంతంలో దోపిడీ పాలకవర్గాలు కొన్ని బూటకపు సంస్కరణలు అమలు చేయడంతోపాటు, కొన్ని స్వచ్ఛంధ సంస్థలు, క్రిష్టియన్ మత సంస్థలు, తెలుగుదేశం, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎమ్ లాంటి దోపిడీవర్గ పాలక, రివిజనిస్టు పార్టీలతోపాటు యూసీసీఆర్ఐ(ఎమ్ఎల్) లాంటి మితవాద, అవకాశవాద విప్లవ గ్రూపులు కూడా ఆ ప్రాంతంలో తమ కార్యక్రమాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. పై పార్టీలు, సంస్థలు అన్నీ కూడా తమ స్వార్థ ప్రయోజనాలకు ప్రజలను ఉపయోగించుకున్నారు. విప్లవ పోరాటాలను పక్కదారి పట్టించారు తప్ప, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం వైపు ఎవరూ ప్రయత్నించలేదు.

పై నేపథ్యంలో ఆ ప్రాంతంలో మన పార్టీ 1990 చివరలో ప్రవేశించిన తర్వాత గత పోరాట స్మృతులను పదిలంగా తమ గుండెల్లో దాచుకున్న ప్రజలు, మనలనూ మనస్ఫూర్తిగా ఆహ్వానించి కంటికిరెప్పలా కాపాడుకునేందుకు శాయాశక్తుల కృషిచేసారు. గత పోరాట అనుభవాలను ప్రజలు కథలు కథలుగా చెబుతుండేవారు. ఆ పోరాటంలో కొనసాగిన పాజిటివ్, నెగటివ్ విషయాలను కూడా తమకు అర్థమైన మేరకు మనతో పంచుకునేవారు. అయితే ఆ ప్రాంతంలో సంఘటితం చేయడానికి పోయిన మన దళానికి ఆ విషయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పడం అతిశయోక్తి కాదు. పై అనుకూలతలు, ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకొని, ప్రజలను సంఘటితం చేసే కార్యాచరణ మన పార్టీ కొనసాగించింది. ముఖ్యంగా ఆదివాసీలు పండిస్తున్న కందులు, పసుపు, అల్లం, జొన్నలు, సామలు, రాగులు తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాని ఆదివాసీ విప్లవ రైతుకూలి సంఘం నాయకత్వంలో అనేక పోరాటాలు చేసారు. మరోవైపు వడ్డీ వ్యాపారుల సమస్య, తూనికాకు గిట్టుబాటు ధరల సమస్య, సారా వ్యాతిరేక పోరాటాలు చేపట్టి అనేక విజయాలు సాధించారు. గత శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో మెండెంఖళ్ళు ప్రాంతంలో జరుగుతున్న గిరిజన మహాసభలకు పోతున్న వేలాది మంది ఆదివాసీ రైతాంగంపై పోలీసులు, భూస్వామ్య గుండాలు దాడి చేసి, కామ్రేడ్ కోరన్న, మంగన్నలను హత్య చేసారు. ఈ దాడిలో ప్రధాన పాత్ర పోషించిన గూండా మేడిద సత్యాన్ని 20 సంవత్సరాల తర్వాత మన ప్రత్యేక గెరిల్లా దళం వాడి స్వగ్రామంలోనే వేటాడి ఖతం చేసింది. ఈ ఘటన ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని అందించింది.

గత పోరాట అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న పాలకవర్గాలు, తమ పునాదులకు ముప్పు వాటిల్లుతుందని గ్రహించి ఆది నుండే ఆ ప్రాంతంపై నిర్బంధాన్ని బహుముఖ పద్ధతుల్లో అమలు చేస్తూ వచ్చారు. ప్రపంచ బ్యాంకుకు నమ్మిన బంటుగా వ్యవహరించిన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రాయోజిత సిద్ధాంతమైన ఎల్ఐసీ విధానాలను అమలు చేయడంలో అత్యంత దూకుడుగా వ్యవహరించాడు. ప్రజాపోరాటాలనూ, ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీని అణచివేయడానికి ప్రధానంగా సాయుధ దాడిని కొనసాగిస్తూనే, పోలీసు యంత్రాంగాన్ని మరింతగా ఆధునీకరించాడు. అంతేకాక క్రూరమైన పోలీసు ఆఫీసర్స్‌ను నియమించాడు. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసాడు. పదుల సంఖ్యలో ఆదివాసీ రైతాంగంపై బూటకపు కేసులు బనాయించి జైళ్ళలో పెట్టాడు. కొద్దిమంది ఆదివాసీ రైతాంగాన్ని బూటకపు ఎన్‌కౌంటర్‌లలో తన సాయుధ బలగం చంపేసింది. ఈ బలగాలే ప్రజల ఆస్తులను సైతం లూటీ చేసారు. ఈ విధంగా అనేక నిర్బంధ రూపాలను అమలు చేస్తూనే, మరోవైపు బూటకపు సంస్కరణల ద్వారా ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించే ఎత్తుగడలను పాలకవర్గాలు అమలు చేసాయి. గత పోరాట అనుభవాలను పదిలంగా తమ గుండెల్లో దాచుకున్న ప్రజలు, ఎప్పటికప్పుడు పాలకవర్గాల పన్నాగాలను కనిపెడుతూ పార్టీనీ, ప్రజా నిర్మాణాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ప్రజా వ్యతిరేకులనూ, పోలీసు ఇన్‌ఫార్మర్‌లను ఈ ప్రాంతంలో ఎండ్రికాయలా నడిచేవారని సంభోదిస్తారు. (ఎండ్రికాయ ముందుకు, వెనుకకు రెండు వైపుల కూడా నడుస్తుంది. కాబట్టి ప్రజా వ్యతిరేకులు కూడా మనతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నట్లుగా నటిస్తూనే, దోపిడీ వర్గాలకు తమ పూర్తి సహకారం అందజేస్తారు) ప్రజల అప్రమత్తత మూలంగా అనేక సందర్భాలలో పార్టీకి నష్టాలు జరగకుండా నివారించబడ్డాయి. 2000 సంవత్సరంలో ప్రజలు అప్రమత్తతో పరిశీలించపోతే పార్టీ అనేక నష్టాలను చవిచూసేది. వారు తెలివిగా వ్యవహరించడం మూలంగా పకడ్బందీగా ఏర్పాటు చేసిన 'శత్రు గూఢాచారి వ్యవస్థ'ను బహిర్గత పర్చి ప్రజల్లో ఎండగట్టాం. పార్టీకి తీవ్రంగా నష్టం చేయాలనే శత్రు

ఎత్తుగడలను ప్రజల సహకారంతో నివారించుకోగలిగాం. ఈ సందర్భంగా ఆ అనుభవాన్ని మా పాఠకులతో పంచుకోవాలనుకుంటున్నాం.

శత్రువు తన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను అనేక రంగాలకు వివిధ పద్ధతుల్లో విస్తరింపజేస్తున్నాడు. ప్రధానంగా శత్రువర్గాల నుండే కాకుండా, మన విప్లవోద్యమంలో కలిసి వచ్చే మిత్రవర్గాలను కూడా వివిధ పద్ధతుల్లో లోబర్చుకొని, మనకు వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నాలను చేస్తున్నాడు. అందులో భాగంగా విజయనగరం జిల్లా, ఏజెన్సీ ప్రాంతంలో బాలకార్మికులకు (వివిధ కారణాల రీత్యా పాఠశాలకు వెళ్ళకుండా ఇంటి దగ్గర ఉంటూ పనులు చేసుకుంటున్న ఆదివాసీ పిల్లలకు) విద్య గరపాలనే నెపంతో ఒక బూటకపు పథకాన్ని పార్వతీపురం గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ధానకిషోర్ ద్వారా పోలీసు అధికారులు ప్రవేశపెట్టారు. దీనిలో 'జట్టు' స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ పారినాయుడు, మరికొంతమంది విద్యాశాఖ అధికారులు భాగం పంచుకున్నారు. గ్రామాల్లో చదువుకొని, ఎటువంటి ఉపాధిలేని నిరుద్యోగ యువతీ, యువకులను మొదట బాలకార్మిక టీచర్ల పేరుతో గ్రామాలలో ప్రవేశపెట్టారు. విషయమేమిటంటే వీరు రాత్రింబవళ్ళు గ్రామాల్లో ఉంటూ, పిల్లలకు చదువు చెబుతున్నట్లుగా నటిస్తూనే, పార్టీ సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేయాలి. సమాచారం వేగంగా అందజేయడానికి సమీప గ్రామాల్లో ఉన్న ఫోన్స్‌ను ఉపయోగించాలి. అయితే దళంలో ఎంతమంది ఉన్నారనేది తెలియటానికి వారికి ప్రత్యేకమైన కోడ్ పదాలను అందజేసారు. 10 మందిలోపు దళం ఉంటే 'బిలో' అనీ, పదిమందికి పైగా ఉంటే 'ఎబో' అనీ, ఇంకా దళం సంఖ్య ఎక్కువగా ఉంటే మూవ్‌మెంట్ స్ట్రాంగ్‌గా ఉందని చెప్పాలి. దళం గ్రామానికి వచ్చేటప్పుడు వాళ్ళ దగ్గర ఎలాంటి తుపాకులు ఉన్నాయి? పురుషులు, మహిళలు ఎంతమంది ఉన్నారు? గ్రామంలో ఉండేటప్పుడు ఎలాంటి రక్షణ ఏర్పాటు చేసుకుంటున్నారు? గ్రామంలో వాళ్ళకు చురుగ్గా సహకరించే వ్యక్తులు ఎవరు? తదితర విషయాలను సేకరించి ప్రతి శనివారం మీటింగ్ పేరుతో బయటకు పోయి, పోలీసు ఆఫీసర్లకు పై సమాచారం అంత అందజేసి వస్తారు. దళం సమాచారం అందజేస్తే నష్టపోయినా, పోకపోయినా వారికి నిర్దేశించిన డబ్బులు అందజేస్తారు. దళంలో వ్యక్తులు నష్టపోతే ఆయా స్థాయి వ్యక్తులపై ప్రకటించిన రివార్డు మొత్తాన్ని అందజేస్తామని చెప్పారు. ఇలా ఆశచూపి మొత్తం 35 మందిని ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకున్నారు. ఎన్‌కౌంటర్ జరిగి, దళం నష్టపోతే టీచర్ ఉద్యోగాన్ని రెగ్యులర్ చేస్తామని మరో ఎత్తుగడతో వారి ఆశను రెట్టింపు చేసారు. ఈ విధంగా వీళ్ళను ఇన్‌ఫార్మర్‌లుగా తయారు చేయడానికి మొదట, శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండల కేంద్రంలో ట్రైనింగ్ నిర్వహించారు. ఈట్రైనింగ్ మూడు రోజులపాటు జరిగింది. ఈ ట్రైనింగ్ క్యాంపుకు శ్రీకాకుళం, విజయనగరం పోలీసు ఎస్‌పీలతోపాటు, మరికొంతమంది ఉన్నతాధికారులు, జట్టు స్వచ్ఛంద సంస్థ అధిపతి పారినాయుడు, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ధానకిషోర్ తదితరులు హాజరై, అనుకున్న పథకాన్ని ఎలా అమలు చేయాలనేది దిశానిర్దేశం చేసి వెళ్ళిపోయారు. ప్రధానంగా ప్రజలకు అనుమానం రాకుండా వాళ్లలో ఎలా మెలగాలి? ప్రజల్లో నమ్మకమైన వాళ్ళని ఎలా ఇన్‌ఫార్మర్‌గా తయారు చేయాలి? పార్టీకి కూడా అనుమానం రాకుండా ఏ పద్ధతిలో వ్యవహరించాలి? అనే విషయాలపై ప్రధానంగా ఈ క్యాంపులో తర్ఫీదునందించారు. ప్రతి టీచర్ తాను ఉద్యోగం చేస్తున్న గ్రామం నుండి ఒక్కరినైనా ఇన్‌ఫార్మర్‌గా తయారు చేయాలనీ టార్గెట్ నిర్దేశించారు. ఈ విషయాలన్నింటినీ సమిష్టిగానూ, విడివిడిగాను ఆయా వ్యక్తులతో మాట్లాడి తమకు నమ్మకం కలిగిన వారికే ఉద్యోగాలు ఇచ్చారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తర్వాత వారికి నమ్మకమైన వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ॥ 3,500 నగదు ముట్టజెప్పి గ్రామాలకు పంపారు. పిల్లలను ఆకర్షించడానికి విప్లవగీతాల బాణీలలోనే పాటలు తయారు చేసారు. ఈ విధంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస ఏజెన్సీ ప్రాంతంలో దళం ప్రధానంగా ఆధారపడే గ్రామాలలోనే బాలకార్మిక టీచర్లుగా నియమించబడ్డారు. వారికి నెలకి రూ॥ 500 వేతంగా నిర్ణయించారు. నెలలో 25 రోజులు రెగ్యులర్‌గా గ్రామాల్లోనే ఉంటూ దళం సమాచారం కోసం ఓపికగా ఎదురు చూసే విధంగా తర్ఫీదునిచ్చారు.

ప్రభుత్వ పోలీసు ఇంటలిజెన్స్ పథకరచనలో భాగంగా ప్లాన్ చేసిన ఈ పన్నాగంలో ముందుగా మహిళలకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. 6గురు మహిళా టీచర్స్‌ను చేర్చుకున్నారు. ప్రతి ఎనిమిది మంది టీచర్లకు ఒకరిని సూపర్‌వైజర్‌గా బాధ్యత ఇచ్చారు. సూపర్‌వైజర్‌లకు తలాఒక మోటర్ సైకిల్‌ను సమకూర్చారు. వీరు రెగ్యులర్‌గా తిరుగుతూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందజేసేవారు. వీళ్ళందరికీ జీతం ఐటీడీఏ నుండి రూ॥ 400 చెల్లించగా, జట్టు స్వచ్ఛంద సంస్థ నుండి రూ॥ 100 సమకూర్చుతుంది. వీరికి పరోక్షంగా ఆయా గ్రామాల్లో ఉన్న సర్పంచ్, వీఎస్ఎస్ అధ్యక్షులు లాంటి ప్రజావ్యతిరేకులు గ్రామాలలో మూకాలు ఏర్పాటు చేసుకోవడానికి సహకరించారు.

పై విధంగా గ్రామాల్లోకి వచ్చిన బాలకార్మిక టీచర్లు తమ ప్రజావ్యతిరేక విధానాలను అత్యంత రహస్యంగా అమలు చేయడానికి పూనుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అనేక సందర్భాలలో ప్రభుత్వాన్ని మొరపెట్టుకున్నా స్పందించని అధికారులు, తమ ప్రమేయం లేకుండా గ్రామానికి టీచర్ రావడం ఏంటీ? అనే విషయాన్ని ప్రజలు పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తూనే, కొద్ది కాలంలోనే వీళ్ళ ప్రవర్తనను గమనించి, అనుమానంతో ఈ విషయాలను దళానికి రిపోర్టు చేసారు. ప్రజల సహకారంతో దళం అనుమానితులను కొద్ది మందిని పట్టుకొని ప్రశ్నించింది. నిజాలు వెలుగులోకి రావడంతో బాలకార్మిక టీచర్ల బండారం బట్టబయలైంది. ప్రజల చేతికి చిక్కిన నారాయణ, క్రిష్ట, నాగేశ్వరరావులను ప్రజల సమక్షంలో విచారించి, విలేఖర్ల ముందు ప్రవేశపెట్టారు. నిజాలను ఒప్పుకున్న ఇన్‌ఫార్మర్‌లను తమ పద్ధతులను మార్చుకోవాలని చెప్పి హెచ్చరించి వదిలిపెట్టారు. 'తీగలాగితే డొంకంతా కదిలినట్లు' బాలకార్మిక టీచర్ల బండారం బయటపడటంతో ఐటీడీఏ పీఓ ధానకిషోర్ కల్లుతాగిన కోతిలా గంతులు వేసాడు. పత్రికా విలేఖర్లను సమావేశపరిచి, వారిని టీచర్ విధి నిర్వహణ కోసమే నియమించామని అబద్ధపు ప్రచారాన్ని లంకించుకున్నాడు. మొత్తంగా ప్రజలు మాత్రం వాస్తవాలు గ్రహించారు. బాలకార్మిక టీచర్లను గ్రామాల్లోకి రానివ్వకుండా పోలీసు, పాలకవర్గాల కుట్రలను అడ్డుకొని, 'ప్రజలే నిజమైన ఉక్కుకోట'గా నిలుస్తారని చరిత్ర నిర్మాతలుగా ఉంటారని ప్రజాయుద్ధాన్ని ఆపడం ఎవరితరం కాదని మరోసారి నిరూపించారు.

# ఉక్రెయిన్‌పై సామ్రాజ్యవాద రష్యా ప్రకటించిన యుద్ధంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ వైఖరి

ఉక్రెయిన్‌లో రష్యా సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధం మొదలై 42 రోజులు అవుతోంది. ప్రపంచంపై భౌగోళిక, ఆర్థిక, సైనిక ఆధిపత్యం కోసం సామ్రాజ్యవాదుల మధ్య పోటీ తీవ్రస్థాయికి చేరిన ఫలితంగా ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం రూపంలో బద్దలైన ఈ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమే. ఇది సామ్రాజ్యవాద ప్రచ్ఛన్న యుద్ధం. అమెరికా యూరప్‌లో తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం ఉక్రెయిన్‌ను ఒక పావుగా చేసుకుంది. రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌ను యుద్ధరంగంగా చేసుకోవాలని ఎంచుకుంది. రష్యా ఉక్రెయిన్ రంగంలోనే అమెరికా-నాటో కూటమిని తిప్పికొట్టేందుకు పూనుకుంది. ఈ యుద్ధంలో ప్రపంచంపై అమెరికా తన ఏకధృవ ప్రపంచాన్ని పునరుద్ధరించడం-విస్తరించడం కోసం ప్రయత్నిస్తుండగా, ఆర్థికంగా బలపడిన రష్యా తన ఆధిపత్య స్థానాలను నిలుపుకునేందుకు, అమెరికా నేతృత్వంలోని నాటో విస్తరణను అడ్డుకునేందుకు పూనుకుంది. ఇందుకు రష్యాకు చైనా సోషల్ సామ్రాజ్యవాదం పూర్తిగా మద్దతునిస్తోంది. ఈ యుద్ధాన్ని రష్యా వీలైనంత త్వరగా తన లక్ష్యాన్ని సాధించి ముగించాలనే ఎత్తుగడలు అనుసరిస్తుండగా, యుద్ధాన్ని వీలైనంతగా పొడిగించడం ద్వారా యుద్ధ భారంతో రష్యాను కుంగదీసి దెబ్బతీసే ఎత్తుగడలను అమెరికా చేపడుతున్నది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రకటించిన వెంటనే దశలవారీగా రష్యాపై అమెరికా-నాటో కూటమి విధించిన దుర్భరమైన ఆర్థిక, దౌత్య, సాంస్కృతిక ఆంక్షల లక్ష్యం దానిని మిగతా ప్రపంచం నుంచి ఒంటరి చేయడం, తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం అవసరమైతే అణు యుద్ధానికి సైతం దిగడం. రష్యా సైతం తన ప్రయోజనాల కోసం ఇందుకు సిద్ధమైంది. దీంతో మరోసారి మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం ముందుకు వస్తున్నది.

ఈ యుద్ధంలో ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్‌లలో వేలాది మంది సైనికులతో పాటు వేలాది అమాయక ప్రజలు మరణించారు. యుద్ధతీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్నది. ఉక్రెయిన్ దేశం తీవ్ర విధ్వంసానికి గురవుతున్నది. అక్కడ హృదయ విదారక విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. 34 లక్షల మంది ప్రజలు దేశం నుంచి శరణార్థులుగా తరలిపోయారు. 65 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. పట్టణాలు, అందులోని పాఠశాలలు, ఆసుపత్రులు నేలమట్టమయ్యాయి. ఆహారం, తాగునీరు, మందులు కొరవడి లక్షలాది కుటుంబాలు అల్లాడుతున్నాయి. యుద్ధ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతున్నది. రష్యా నుంచి ముడిచమురు, గ్యాస్, ఉక్రెయిన్ నుంచి గోధుమల ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఉదాహరణకు, శ్రీలంకలో లీటరు పాలు 1,980 రూ., కిలో చెక్కర 290 రూ., కిలో బియ్యం 500 రూ. పెరిగాయి. ప్రజలు తిరగబడడంతో రాజపక్షే ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయికి చేరుకుంటున్నది. నిజవేతనాలు బాగా పడిపోతున్నాయి. నిరుద్యోగం తీవ్రరూపం దాల్చుతున్నది. ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోతున్నది. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతుండడంతో పెద్దెత్తున ఆకలిచావులు సంభవించే ప్రమాదం ఏర్పడింది. ఈ యుద్ధం సామ్రాజ్యవాదులకు సూపర్ లాభాలను చేకూర్చగా, యుద్ధం వల్ల ప్రపంచ ప్రజలకు విధ్వంసం, ఆర్థిక విపత్తు, మృత్యువు తప్ప మరేమీ దక్కడం లేదు. సామ్రాజ్యవాదం దాని స్వభావ రీత్యానే ప్రజల విస్థాపనను, ఆర్థిక వ్యవస్థల విధ్వంసాన్ని సృష్టిస్తుంది. అది ఎన్నటికీ ఆరిపోని యుద్ధాలను రాజేస్తుందనేది జగమెరిగిన సత్యం.

సామ్రాజ్యవాద శక్తుల మధ్య జరుగుతున్న ఈ యుద్ధాన్ని సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ యుద్ధాన్ని ఖండించాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలకు పిలుపునిస్తున్నది. 'కార్మిక ప్రజానీకానికి' 'దేశమంటూ లేదు .... కమ్యూనిస్టులు ఎల్లయెడలా ఉనికిలో వున్న (పెట్టుబడిదారీ) సామాజిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతీ విప్లవోద్యమానికి మద్దతునిస్తారు', 'సకల దేశాల కార్మికులారా ఏకంకండి' అనే కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ల బోధనలను, "చైతన్యవంతమైన కార్మికవర్గం సామ్రాజ్యవాద తోడేళ్ల గుంపులో ఏ ఒక్కదాన్నీ బలపరచదు'' అనే మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ బోధనను (కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్-27, పుట 335-336) ఎత్తిపట్టాలనీ, ఈ యుద్ధంలో ఏ సామ్రాజ్యవాద దేశ పక్షమూ వహించరాదని ప్రపంచ కార్మికవర్గానికి, పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలకు పిలుపునిస్తున్నది.

“యుద్ధం అంటే ఇతర పద్ధతుల్లో, ఒక విధాన కొనసాగింపు. యుద్ధాన్ని సృష్టించిన రాజకీయ వ్యవస్థల నుండి ఏ యుద్ధాన్ని విడదీసి చూడకూడదు. ఒక రాజ్యం లేదా ఆ రాజ్యంలోని ఒక వర్గం, యుద్ధానికి ముందు సుదీర్ఘకాలం పాటు ఏ విధానాన్ని అవలంబించాయో – యుద్ధంలో కూడా దాన్నే అనుసరించడం తప్పనిసరి. దాని ఆచరణ రూపం మాత్రమే మారుతుంది’’ అని లెనిన్ బోధించారు (యుద్ధం–విప్లవం, కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్–24, పుట 398–421). అలాగే రాజకీయాలు కూడా ఆర్థిక అంశాల నుంచి వేరుగా ఉండవు. సూపర్ లాభాల కోసం తీవ్రతరమైన సామ్రాజ్యవాద పోటీ యుద్ధం రూపంలో నేడు ఉక్రెయిన్‌లో, తూర్పు యూరప్‌లో కనపడుతున్నది.

సామ్రాజ్యవాదం శక్తివంతమైనదైనా, బలహీనమైనదైనా, అది అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ, రష్యా, చైనా సామ్రాజ్యవాదాలలో ఏదైనప్పటికీ వాటి ప్రయోజనాల కోసం కార్మికవర్గం రక్తం ధారపోయనవసరం లేదు. మంచి సామ్రాజ్యవాదం, చెడు సామ్రాజ్యవాదం అనేది ఏదీ ఉండదు. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో పీడిత వర్గాల, పీడిత జాతుల ఉద్యమాలు స్వతంత్రమైన పంథాను ఎంచుకోవాలి. బూర్జువాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో తెగతెంపులు చేసుకుని, శ్రామికవర్గ, పీడిత ప్రజా బాహుళ్యాల, పీడిత జాతుల ప్రయోజనాల కోసం పోరాడాలి. సామ్రాజ్యవాద యుగంలో న్యాయబద్ధమైన యుద్ధం అంటే శ్రామికవర్గం, దాని మిత్రవర్గాలు అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం జరిపే విప్లవ యుద్ధం మాత్రమే. “శ్రామికవర్గ, కమ్యూనిస్టు విప్లవం ఒక్కటే మానవాళిని సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద యుద్ధాలు సృష్టించిన ప్రతిష్టంభన నుండి బయటకు తీసుకురాగలదు. విప్లవం ఎలాంటి కష్టాలను ఎదుర్కోవలసి వచ్చినా లేక ప్రతీఘాతుక విప్లవ కెరటాలు తాత్కాలికంగా విజయాలు పొందినా, శ్రామికవర్గం తుది విజయాన్ని సాధించడం తప్పనిసరి” అని రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) అనుభవం స్పష్టం చేసింది (రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ 1919 మార్చి 22న 8వ కాంగ్రెస్‌లో ఆమోదించిన రాజకీయ తీర్మానం నుంచి).

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న విధ్వంసకర యుద్ధానికి వ్యతిరేకంగా, సూపర్ లాభాల కోసం యావత్తు విశ్వాన్ని బలిచేసే అణ్వాయుధాలతో సహా పలు ప్రాణాంతక ఆయుధాల అమ్మకం, సైనిక బలగాల మోహరింపులతో ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం వైపుగా ఈడుస్తున్న సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా రష్యాతో సహా ప్రపంచవ్యాప్తంగా లక్షల కోట్ల మంది ప్రజలు నిరసనోద్యమాలు కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమాలకు మన పార్టీ మద్దతు ప్రకటిస్తోంది. ఈ ఉద్యమాలలో భాగస్వామ్యం కావాల్సిందిగా యావత్తు పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ బలగాలకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, సమస్త భారత పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజలకు పిలుపునిస్తోంది. సామ్రాజ్యవాదాన్ని ఈ భూమండలం నుంచి నిర్మూలించి సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో, కార్మికవర్గం నాయకత్వంలో ప్రపంచ కార్మిక, కర్షక తదితర పీడిత వర్గాల ప్రజలు, పీడిత జాతులు, ప్రజాస్వామికవాదులు సమైక్యంగా ఈ ఉద్యమాలను పురోగమింప జేయాల్సిందిగా పిలుపునిస్తోంది.

ప్రపంచ ప్రజల ఆకాంక్షలకు తలొగ్గి రష్యా వెంటనే బేషరతుగా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపాలనీ, రష్యా తన బలగాలను తక్షణం వెనక్కి పిలిపించాలనీ కార్మికవర్గం నాయకత్వంలో ఆ దేశ పీడిత ప్రజలు, పీడిత జాతులు తమ నిరసనోద్యమాలను మరింత తీవ్రతరం చేస్తూ పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలి. రష్యా సైన్యాలు తమ ప్రభుత్వంపైనే తమ తుపాకులను ఎక్కుపెట్టాలి. అణుయుద్ధానికి దిగి మూడవ ప్రపంచయుద్ధానికి పూనుకుంటే, 1917లో కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్‌ల మార్గదర్శకత్వంలో కార్మికవర్గం నాయకత్వం కింది యావత్తు పీడిత వర్గాలు, పీడిత జాతులు సమైక్యంగా నిలిచి, ఆనాటి మొదటి ప్రపంచ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేసిన గొప్ప అనుభవం నుంచి నేర్చుకుని, దాని వారసత్వాన్ని ఎత్తిపడుతూ పుతిన్ ప్రభుత్వాన్ని కూలదోయాలి. కార్మికవర్గం నాయకత్వంలో నూతన, ఉన్నత సోషలిస్టు ప్రభుత్వాన్ని స్థాపించాలి.

ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌ను ఉసిగొల్పడం అమెరికా, యూరప్ దేశాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ దేశాలలో కార్మికవర్గం నాయకత్వంలో పీడిత ప్రజలు మిలిటెంటు ఉద్యమాలను కొనసాగించాలి. అమెరికా నేతృత్వంలోని నాటో సైనిక కూటమి విస్తరణను, తమ ఉపగ్రహ దేశాలకు, తొత్తు/దళారీ ప్రభుత్వాలకు ఆయుధాల అమ్మకాన్ని, ఆ దేశాలలో సామ్రాజ్యవాద సైనిక బలగాల మోహరింపును ఆపాలని, ప్రపంచాన్ని నాశనం చేసే యావత్తు అణు, జీవ, రసాయనిక ఆయుధాలను ధ్వంసం చేయాలని, నాటో సైనిక కూటమిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అమెరికా కార్మిక వర్గం, పీడిత ప్రజలు మిలిటెంటుగా ఉద్యమించాలి. అమెరికా బరితెగించి మూడవ ప్రపంచ యుద్ధానికి దిగితే దాన్ని అంతర్యుద్ధంగా మార్చాలి.

యూరప్‌లోని సామ్రాజ్యవాద బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ దేశాలలోని, జపాన్‌లోని, నూతన సోషల్ సామ్రాజ్యవాద శక్తి చైనాలోని ప్రభుత్వాలు, ప్రపంచవ్యాప్తంగా వివిధ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఉక్రెయిన్ యుద్ధంలో ఏదోక పక్షానికి (రష్యా లేదా ఉక్రెయిన్) మద్దతుగా కార్మికులు, పీడిత ప్రజలు ఒకరి గొంతులు మరొకరు కోసుకునేలా రెచ్చగొడుతూ అనుసరిస్తున్న యుద్ధానుకూల విధానాలకు (ఆయుధాల సహాయం, సైనిక బలగాల మోహరింపు, ఆర్థిక సహాయం, రాజకీయ సమర్థనలు తదితరాలకు) వ్యతిరేకంగా కార్మికవర్గం నాయకత్వంలో పీడిత ప్రజలు దృఢంగా, మిలిటెంట్‌గా పోరాడాలి. సామ్రాజ్యవాదులు బరితెగించి ప్రపంచయుద్ధానికి దిగితే వారికి గోరీకట్టి తమ తమ దేశాలలో సోషలిస్టు ప్రభుత్వాలను స్థాపించాలి.

ఉక్రెయిన్‌లోని యావత్తు ప్రాంతాలలో బాంబులతో తల్లడిల్లుతున్న కార్మికులకు, ప్రజలకు మన పార్టీ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. పౌరుల హత్యలను ఖండిస్తున్నది. ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళుతున్న ఉక్రెయిన్ ప్రజలను మానవతా దృక్పథంతో కాపాడాలని ప్రపంచ కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది. ఉక్రెయిన్ దేశ కార్మికవర్గం, పీడిత ప్రజలు తమ దేశాన్ని నాటోకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు ఉపగ్రహంగా మార్చిన ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రభుత్వ నాటో అనుకూల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఖండించాలనీ, తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, తమ జాతి అస్థిత్వం కోసం సామ్రాజ్యవాదులు రుద్దిన యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుతూ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలనీ, ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ఉక్రెయిన్ కార్మికవర్గం

నాయకత్వంలో ఆ దేశ పీడిత ప్రజలే అన్ని రకాల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకోవాలి. ఉక్రెయిన్‌లోని డోన్‌బాస్ ప్రాంతంలో డొనెట్స్క్, లహన్స్క్ రిపబ్లిక్కుల భవిష్యత్తును అక్కడి పీడిత జాతుల ప్రజలు రష్యా సామ్రాజ్యవాదంపై ఆధారపడకుండా కార్మికవర్గం నాయకత్వంలో తమ స్వంత శక్తిపై ఆధారపడి సాధించుకోవాల్సిందిగా మన పార్టీ కోరుతున్నది.

సామ్రాజ్యవాదుల ప్రచ్ఛన్న యుద్ధాన్ని, ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధాన్ని నిర్ద్వందంగా ఖండిస్తూ, వెంటనే యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ భారతదేశంలోని కార్మిక, కర్షక, పీడిత ప్రజలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు గొంతెత్తి నినదించాలి. తమ దేశ సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న ఉక్రెయిన్ ప్రజలకు మద్దతునీయాలి. యుద్ధ ప్రభావం భారతదేశంపై చాలా తీవ్రంగానే ఉంటుంది. సామ్రాజ్యవాదుల, భారత దళారీ పాలకవర్గాల విధ్వంసకర విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలను సమీకరించి పోరాడాలి. మన పార్టీ నాయకత్వంలో యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను, ప్రజాయుద్ధాన్ని సమన్వయంతో నడపాలి. భారతదేశం అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలోని 'క్వాడ్' సైనిక కూటమి నుండి బయటకు రావాలనీ, సామ్రాజ్యవాదుల కూటములలో చేరవద్దని డిమాండ్ చేస్తూ హిందుత్వ ఫాసిస్టు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిలిటెంటు ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ యుద్ధం మూడవ ప్రపంచ యుద్ధంగా మారి, భారతదేశం ఏ సామ్రాజ్యవాద పక్షం చేరినా, దానిని భారత పీడిత ప్రజలు, సెక్షన్లు, పీడిత జాతులు ఖండించాలి. కుహనా జాతీయవాదం, దేశభక్తి పేరుతో హిందుత్వ ఫాసిస్టులు జాతీయ దురహంకారాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి సామ్రాజ్యవాద యుద్ధంలో భారత సైన్యాలను, దేశ ప్రజలను పావులుగా మార్చే కుట్రలను ఎండగట్టాలి. ఆ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలి. దేశంలో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ విముక్తి ప్రాంతాలను స్థాపిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేయాలి.

వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని దళారీ ప్రభుత్వాలు తమ సామ్రాజ్యవాద ప్రభువులకు దాసోహం చేస్తూ అనుసరించే యుద్ధ ప్రాయోజిత విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం నాయకత్వంలో పీడిత ప్రజలు, జాతులు పోరాడాలి. ప్రపంచ యుద్ధమే మొదలైతే యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలి. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో విముక్తి ప్రాంతాలను స్థాపిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాలను పురోగమింపజేయాలి.

పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థ స్వభావ రీత్యా ప్రపంచ మానవాళికి, ప్రకృతికి వినాశకరమైంది, అరాచకమైంది, అస్తవ్యవస్తమైనది, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక, పర్యావరణ, శరణార్థి తదితర అన్ని రకాల సంక్షోభాలకు నిలయమైంది. కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజలను నిరుద్యోగులను చేసి వీధులపాలు చేస్తుంది. ఇది నిస్సహాయంగా, తిరిగి పునరుద్ధరించలేని శిలాజ ఇంధనాలకు అలవాటుపడింది. (వైట్ స్కిన్, బ్లాక్ ఫ్యూయల్: ఆన్ ది డేంజర్ ఆఫ్ ఫోస్సిల్ ఫాసిజం). దీనిని పూర్తిగా తుదముట్టించకుండా ప్రపంచ పీడిత ప్రజలకు, పీడిత జాతులకు విముక్తి లభించదు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలను సమీకరించి, సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేసే కర్తవ్యం ప్రపంచ కార్మికవర్గంపైనే ఉంది.

సామ్రాజ్యవాద శక్తుల మధ్య ఉక్రెయిన్‌లో బద్దలైన యుద్ధం ఫలితంగా, సుదీర్ఘకాలంగా సామ్రాజ్యవాదులు ఆరని కాష్టంలా రగిలిస్తూ వస్తున్న ఇతర అన్ని యుద్ధాలు – ఉదాహరణకు, యమెన్‌పై యుద్ధం, పాలస్తీనాపై యుద్ధం, సోమాలియాపై యుద్ధం, మహిళలపై యుద్ధం, ప్రవాస ప్రజలపై యుద్ధం, పలు వర్ణాల ప్రజలపై తెల్ల జాత్యహంకారుల యుద్ధం, కార్మికులపై యుద్ధం, ప్రజాస్వామ్యంపై యుద్ధం, పర్యావరణంపై యుద్ధం తదితర యుద్ధాలు – మరింత తీవ్రస్థాయికి చేరుకుంటాయి. వీటిని ఎక్కడికక్కడ అంతర్యుద్ధాలుగా మార్చే బాధ్యత అంతర్జాతీయ కార్మికవర్గంపై ఉంది. సామ్రాజ్యవాద రష్యాను కూలదోసి ఓడించే కర్తవ్యం రష్యా కార్మికవర్గం, వివిధ పీడిత వర్గాలపైనా, అమెరికా సామ్రాజ్యాన్ని ఓడించి, కూలదోసే కర్తవ్యం అమెరికా కార్మికవర్గం, పీడిత ప్రజలపైనా, సహజమైన పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థను కూలదోసి సోషలిజాన్ని స్థాపించే కర్తవ్యం ప్రపంచ కార్మికవర్గం, పీడిత ప్రజలపైనా, పీడిత జాతులపైనా ఉంది. ప్రపంచ వినాశనానికి మూలమైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న సోషలిస్టు విప్లవ, నూతన ప్రజాస్వామిక, జాతివిముక్తి శక్తులు సమైక్యంగా తమ పోరాటాలను ఎక్కుపెట్టాల్సిందిగా, తమ తమ దేశాలలో ప్రజా ఉద్యమాలను, ప్రజా యుద్ధాలను సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంతో సమన్వయించి నడపాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత ప్రజలకు మన పార్టీ పిలుపునిస్తోంది. సామ్రాజ్యవాదాన్ని ఈ ప్రపంచం నుంచి తుడిపెట్టి సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించడం ద్వారానే యుద్ధాలకు తావులేని, సర్వతోముఖాభివృద్ధిని సాధించే ప్రపంచాన్ని సాధించుకోగలుగుతామని మన పార్టీ విశ్వసిస్తున్నది.

- సామ్రాజ్యవాదుల మధ్య పోటీకి వ్యక్తీకరణే ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం!
- ఉక్రెయిన్‌లో సామ్రాజవాద ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఖండించండి!
- ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధాన్ని ఆపండి!
- ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ఆ దేశ ప్రజలే సాధించుకుంటారు!
- సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం నాయకత్వంలో పీడిత జాతులను, ప్రజలను సమీకరించండి!
- అణుయుద్ధం–మూడవ ప్రపంచయుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాబాహుళ్యాన్ని మిలిటెంట్ పోరాటాలలో కదిలించండి!
- ప్రపంచంలో సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేయండి!
- పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం–కమ్యూనిజమే!
- సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి!
- మూడవ ప్రపంచయుద్ధమే సంభవిస్తే, యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుతూ సోషలిస్టు, నూతన ప్రజాస్వామిక విప్లవాలను, జాతివిముక్తి పోరాటాలను పురోగమింపజేయండి!

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# అంతర్జాతీయ వ్యవహారాలు
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

**మేడే, 2022**

## ఎర్రెర్రని మే డే వర్ధిల్లాలి!

**అంతర్జాతీయంగా పెంపొందుతున్న విప్లవ పరిస్థితిని వినియోగించుకొని వినాశకర సామ్రాజ్యవాదాన్ని ధ్వంసం చేసి యుద్ధాలకు తావులేని సోషలిజాన్ని స్థాపించడమే ప్రపంచ కార్మికవర్గం, మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు శక్తుల తక్షణ కర్తవ్యం!**

మే డే ప్రపంచ కార్మికవర్గ పోరాట దీక్షా దినం. కార్మికవర్గం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం తన బలాబలాలను బేరీజు వేసుకుని నిర్విరామంగా, మరింత దృఢనిశ్చయంతో పోరాడటానికి తమ శక్తినంతటినీ సమీకరించుకునేందుకు నడుం బిగించే దినం. తమ తమ దేశాలలో కార్మికవర్గ విప్లవాల విజయానికై, తద్వారా ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికై ప్రతినబూనే దినం. మే డే సందర్భంగా మా పార్టీ కేంద్రకమిటీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడుతున్న ప్రపంచ కార్మికవర్గానికి రెడ్‌సెల్యూట్స్ తెలియజేస్తోంది.

ప్రపంచాన్ని, పర్యావరణాన్ని, ప్రజలను వినాశనం గావించడం సామ్రాజ్యవాద స్వభావం. నిత్య వినాశనంలోనే సామ్రాజ్యవాదం సజీవంగా ఉండగలుగుతుంది. వినాశకరమైన కరోనాను సృష్టించిన సామ్రాజ్యవాదం తన ఆర్థిక, ద్రవ్య సంక్షోభం నుండి బయటపడడానికి ప్రపంచీకరణ విధానాలలో భాగంగా ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ఈ భారమంతా ప్రజలపై మోపుతున్నది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాకు చెందిన వెనుకబడిన దేశాల్లో దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలతో కుమ్మక్కై పెట్టుబడి, టెక్నాలజీల సహాయం పేరుతో, బలవంతపు, అసమాన ఒప్పందాలతో సహజ వనరులను, చౌక శ్రమశక్తిని, మార్కెట్లను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నది. అయినప్పటికీ సంక్షోభం నుండి అది కోలుకునే స్థితి కనపడడం లేదు. మాంద్యం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరింత తీవ్రమైంది. ఆరోగ్యం, విద్యతో సహా యావత్తు ప్రజా జీవనం సంక్షోభంలో పడడంతో ప్రజలు తీవ్ర యాతనలు పడుతున్నారు. ధనికులకు పేదలకు మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయి. యుద్ధ ఆధారిత అమెరికా ఆర్థిక వ్యవస్థ తన సూపర్ లాభాల కోసం ప్రపంచం నలుమూలలా అసంఖ్యాకంగా యుద్ధాలను రెచ్చగొడుతూ, ఆయుధాలను అమ్ముకుంటున్నది. బతుకు దుర్భరంగా మారడంతో ప్రజలు ఎక్కడికక్కడ తిరగబడుతున్నారు. వీరిని అణచడానికి సామ్రాజ్యవాదం ఫాసిస్టు శక్తులను పెంచిపోషిస్తున్నది. సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధ్వంసకర విధానాల వలన అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతుండడంతో విప్లవ పరిస్థితులు పెంపొందుతున్నాయి.

**సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం:** సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు, ఉపాధి లేమి, ధరల పెరుగుదల, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులు కల్పించని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పలు వెనుకబడిన దేశాల్లో ప్రజలు తెగించి పోరాడుతున్నారు. జాతుల అణచివేతకు వ్యతిరేకంగా పీడిత జాతులు పోరాడుతున్నాయి. ఈ సంవత్సర కాలంలో ముఖ్య పరిణామాల్లో అఫ్ఘనిస్తాన్‌ను గత 20 ఏళ్ళుగా పట్టిపీడిస్తున్న అమెరికా సేనల నిష్క్రమణ ప్రముఖమైనది. 1975లో వియత్నాంలో ఎదురైన ఓటమి లాంటిది అమెరికాకు అఫ్ఘనిస్తాన్‌లో మళ్ళీ 2021లో అవమానకరంగా పరిణమించింది. ప్రజలు దృఢనిశ్చయంతో పోరాడితే ఆధునిక సామ్రాజ్యవాద సైన్యాలు తోకముడవక తప్పదని ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయి. ఇండియాలో బ్రాహ్మణీయ హిందుత్వ మోదీ ప్రభుత్వ నయా ఉదారవాద, కార్పొరేట్ ప్రాయోజిత విధానాలకు వ్యతిరేకంగా వివిధ పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజల, ఆదివాసుల, పీడిత జాతుల సమరశీల పోరాటాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో రూపొందించిన 4 కోడ్స్‌కు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణ, క్యాజువల్-కాంట్రాక్టు విధానం, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, కార్మికులపై పని భారం-పని గంటల పెంపుదల, నిజ వేతనాలు పడిపోవడం, దారుణమైన పని పరిస్థితులు, సంక్షేమ పథకాల కోతకు వ్యతిరేకంగా, కనీసం వేతనాలు, ఉపాధి గ్యారంటీ కోసం కార్మికులు సమైక్య పోరాటాలు కొనసాగిస్తున్నారు. మార్చి 28-29లలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మె, రైతు సంఘాల విశాల మద్దతుతో మునుపెన్నడూలేని విధంగా విజయవంతం కావడం పెంపొందుతున్న కార్మిక-కర్షక సమైక్యతకు నిదర్శనం.

**సామ్రాజ్యవాద దేశాల్లో బూర్జువా వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య వైరుధ్యం:** సామ్రాజ్యవాదం సంక్షోభం నుండి బయటపడడానికి తమ

దేశాల్లోని కార్మికవర్గాన్ని, మధ్యతరగతిని దోచుకుంటున్నది. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని వినియోగిస్తూ పర్మనెంటు ఉద్యోగాలపై, సంక్షేమ పథకాలపై కోతలు విధిస్తున్నది. ప్రజలపై విపరీతమైన పన్నుల భారాన్ని మోపుతున్నది. కరోనా మూలంగా ఏర్పడిన సంక్షోభంతో ప్రజలపై కోవిడ్ ఆంక్షలు, ఉద్యోగాల నుండి తొలగింపులు, ఎక్కువ గంటలు, వేతనాల తగ్గింపు, అధిక ధరల వలన ఈ దేశాల్లో కార్మికవర్గంతో సహా, ఉద్యోగులు, విద్యార్థులు, పర్యావరణ కార్యకర్తలు పెద్దయెత్తున ఆందోళనలకు, సమ్మెలకు దిగుతున్నారు. పలు దేశాలలో కార్మికుల ప్రదర్శనలు మిలిటెంట్ రూపం తీసుకుంటున్నాయి.

**సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యం:** నూతన అధ్యక్షుడు బైడెన్ ఆధ్వర్యంలో అమెరికా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అత్యంత దూకుడు నిర్ణయాలు తీసికొని అమలు చేస్తున్నాడు. సామ్రాజ్యవాద ప్రత్యర్థులుగా ముందుకు వస్తున్న రష్యా, చైనాను కట్టడి చేసేందుకు నాటో కూటమిని, జీ–7 దేశాల ఆధిపత్యాన్ని నిలబెట్టడం, 'క్వాడ్'ను బలోపేతం చేయడం, 'ఆకస్' ఏర్పాటు చేసినప్పటికీ, అమెరికాకు యూరపు పూర్తిగా సహకరించే స్థితిలో లేదు. రష్యా గ్యాసు, చమురు దిగుమతులే జర్మనీ, ఫ్రాన్స్ యితర దేశాలు ఆధారం. మరో వైపు తైవాన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ తైవాన్ సముద్ర జలాల్లో చైనా, అమెరికాల పోటీ సైనిక విన్యాసాలు రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. రష్యా–చైనాల మధ్య సైనిక సహకార ఒప్పందం కుదిరింది. ప్రచ్ఛన్న యుద్ధం అంతమైన తర్వాత ఎన్నడూ లేని విధంగా సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉద్రిక్తతలు, ఘర్షణలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధానికి పాల్పడింది. అమెరికా రష్యాకు యిచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ నాటోను నిరంతరం విస్తరించడం, నయానా భయానా 30 దేశాలను అందులో భాగం చేయడం, యూరోప్‌లో 3వ పెద్ద సైనిక శక్తిగా వున్న ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో కలుపుకుంటామని ప్రకటించడం, ఉక్రెయిన్‌తో కలిసి సైనిక విన్యాసాలు చేయడం, ఉక్రెయిన్‌కు మద్దతుగా తన సైనిక బలగాలతో పాటు సైనిక నావలను, మిస్సైల్స్‌ను మోహరించడం, ఫలితంగా ఉక్రెయిన్ సరిహద్దుల్లో రష్యా లక్షన్నర సైన్యాన్ని మోహరించడంతో సామ్రాజ్యవాద వైరుధ్యాలు బద్దలై ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధానికి దారితీసింది. అది గత రెండు నెలలుగా వినాశకరంగా కొనసాగుతున్నది. ఏప్రిల్ 12న రష్యా–ఉక్రెయిన్ చర్చలు విఫలమయ్యాయి. కనుక నిస్సందేహంగా ఈ యుద్ధం మరింత వినాశనానికి దారితీస్తుంది, ప్రజలను భరించలేని పీడనలోకి, సంక్షోభంలోకి నెడుతుంది. సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక, ఆధిపత్య ప్రయోజనాల క్రీడలో ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం తదితర పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలు బలవుతున్నారు. మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం ముందుకు వస్తున్నది.

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం రూపంలో బద్దలైన ఈ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమే. ఇందులో అమెరికా చేతిలో ఒక పావు ఉక్రెయిన్. ఈ యుద్ధాన్ని ఖండించాల్సిందిగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలకు మా పార్టీ పిలుపునిస్తున్నది. 'కార్మిక ప్రజానీకానికి' 'దేశమంటూ లేదు .... కమ్యూనిస్టులు ఎల్లయెడలా ఉనికిలో వున్న సామాజిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతీ విప్లవోద్యమానికి మద్దతునిస్తారు', 'సకల దేశాల కార్మికులారా ఏకంకండి' అనే కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ల బోధనలను, "చైతన్యవంతమైన కార్మికవర్గం సామ్రాజ్యవాద తోడేళ్ల గుంపులో ఏ ఒక్కదాన్నీ బలపరచదు" అనే మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ బోధనను ఎత్తిపట్టాలనీ, ఈ యుద్ధంలో ఏ సామ్రాజ్యవాద దేశ పక్షమూ వహించరాదని ప్రపంచ కార్మికవర్గానికి, పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలకు పిలుపునిస్తున్నది. అమెరికా నేతృత్వం గల నాటోను రద్దు చేయాలని, ఉక్రెయిన్‌ను బలిపశువును చేస్తూ కోల్పోతున్న తన ప్రపంచాధిపత్యాన్ని నిలుపుకునేందుకు అమెరికా వినాశకర చర్యలను తిప్పికొట్టాలని, ప్రపంచ ప్రజల ఆకాంక్షలకు తలొగ్గి రష్యా వెంటనే బేషరతుగా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపాలనీ, రష్యా తన బలగాలను తక్షణం వెనక్కి పిలిపించాలనీ డిమాండ్ చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. విప్లవ పరిస్థితులు పెంపొందుతున్నాయి. వీటిని వినియోగించుకుని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేసే కర్తవ్యం ప్రపంచ కార్మికవర్గంపై ఉంది. తద్వారా పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలి. రష్యా అణుయుద్ధానికి దిగి మూడవ ప్రపంచయుద్ధానికి పూనుకుంటే, 1917లో కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలో కార్మికవర్గం నాయకత్వంలో యావత్తు పీడిత వర్గాలు, పీడిత జాతులు సమైక్యంగా నిలిచి ఆనాటి మొదటి ప్రపంచ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేసిన గొప్ప అనుభవం నుంచి నేర్చుకుని, దాని వారసత్వాన్ని ఎత్తిపడుతూ పుతిన్ ప్రభుత్వాన్ని కూలదోయాలి. కార్మికవర్గం నాయకత్వంలో నూతన, ఉన్నత సోషలిస్టు ప్రభుత్వాన్ని స్థాపించాలి. ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌ను ఉసిగొల్పడం అమెరికా, యూరప్ దేశాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ దేశాలలో కార్మికవర్గం నాయకత్వంలో పీడిత ప్రజలు మిలిటెంటు ఉద్యమాలను కొనసాగించాలి. అమెరికా–నాటో కూటమి మూడవ ప్రపంచ యుద్ధానికి దిగితే దాన్ని అంతర్యుద్ధంగా మార్చాలి. ఇదే విధంగా నూతన సోషల్ సామ్రాజ్యవాద శక్తి చైనాకు ఆ దేశ కార్మికవర్గమే గుణపాఠం చెప్పాలి. యుద్ధం కారణంగా ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళుతున్న ఉక్రెయిన్ ప్రజలను మానవతా దృక్పథంతో కాపాడాలని ప్రపంచ కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఉక్రెయిన్ దేశ కార్మికవర్గం, పీడిత ప్రజలు తమ దేశాన్ని నాటోకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు ఉపగ్రహంగా మార్చిన ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రభుత్వ నాటో అనుకూల, ప్రత్యేకించి అమెరికా–ఈయూ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఖండించాలి. తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, తమ జాతి అస్తిత్వం కోసం సామ్రాజ్యవాదులు రుద్దిన యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుతూ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలి. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ఉక్రెయిన్ కార్మికవర్గం నాయకత్వంలో ఆ దేశ పీడిత ప్రజలే అన్ని రకాల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకోవాలి. ఉక్రెయిన్‌లోని డోన్‌బాస్ ప్రాంతంలో డొనెట్స్క్, లహన్స్క్ రిపబ్లిక్కుల భవిష్యత్తును అక్కడి పీడిత జాతుల ప్రజలు రష్యా సామ్రాజ్యవాదంపై ఆధారపడకుండా కార్మికవర్గం నాయకత్వంలో తమ స్వంత శక్తిపై ఆధారపడి సాధించుకోవాలి. సామ్రాజ్యవాద దేశాలతో వెనుకబడిన దళారీ ప్రభుత్వాలు కుదుర్చుకున్న సైనిక ఒప్పందాలతో సహా అన్ని రకాల ఒప్పందాల రద్దుకై ఆ దేశాలలో ప్రజలు ఉద్యమించాలి. సామ్రాజ్యవాద

తరువాయి భాగం 39 వ పేజీలో

# ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

తేది : జనవరి 27, 2022

**పత్రికా ప్రకటన**

## ఒడిశా రాష్ట్రంలో ఫిబ్రవరి 16వ తేదీ నుండి 24 వరకు ఐదు విడతలుగా జరిగే స్థానిక సంస్థల బూటకపు ఎన్నికలను బహిష్కరించండి!

## సీపీఐ(మావోయిస్టు) నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవం లక్ష్యంగా కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో భాగం కండి!

## గ్రామ గ్రామాన విప్లవ ప్రజారాజ్య కమిటీలను నిర్మించండి!!

*ప్రియమైన ప్రజలారా!*

ఒడిశా రాష్ట్రం ఫిబ్రవరి 16 తేది నుండి 24వ తేదీ వరకు 5 విడతలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి నోటిఫికేషన్ వెలువడింది. దానితో గ్రామాలలో ఎన్నికల రాజకీయ జాతర మొదలైంది. అన్ని పార్టీలు ప్రజలను మరోసారి మోసం చేసి, అధికారంలోకి రావడానికి బూటకపు వాగ్దానాలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఎలక్షన్‌లో గెలవడం కోసం మద్యం, గుండాగిరి, దౌర్జన్యం, హత్యలు, కిడ్నాపులు, రిగ్గింగ్ తదితర పద్ధతులను అనుసరిస్తూ, అధికారంలోకి రావాలని చూస్తున్నారు. వీటికోసం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. గెలిచిన తర్వాత ఎలక్షన్‌లో ఖర్చు చేసిన డబ్బులకు అనేక రెట్లు ఎక్కువగా సంపాదించి కోట్లకు పడగలేత్తాలని చూస్తున్నారు. ఎలక్షన్‌ల సందర్భంగా ప్రజలకిచ్చిన వాగ్దానాన్ని మర్చిపోయి, దోపిడీ వర్గాలకు సేవ చేయడమే పరమార్థంగా భావించి తమ నిరంకుశ పరిపాలన కొనసాగిస్తారు. ఇది నేడు మన భారతదేశంలో 75సంవత్సరాలుగా కొనసాగుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం.

మన ఒడిశా రాష్ట్రం ప్రకృతి, సహజ ఖనిజ సంపదలకు నిలయమైనది. రాష్ట్రంలోని సంపద మీద కన్ను వేసిన కార్పొరేట్ సంస్థలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం గత 20 సంవత్సరాలకు పైగా ఎర్ర తివాచీ పరిచి స్వాగతిస్తున్నది. కార్పొరేట్ సంస్థలతో అనేక ఒప్పందాలను కుదుర్చుకుంది. నియమగిరి, కలింగనగర్, కాచీపూర్, మాలి-దేవ్‌మాలి, డొంగదేవర, బాగ్‌డొంగ్రా, కొడంగిమాలి, చేరుబందలలో వేదాంత, అనురాక్ తదితర బహుళజాతి సంస్థలకు బాక్సైట్ సంపదను అప్పనంగా అప్పజెప్పి, లక్షలాది మంది ఆదివాసీ ప్రజలనూ, వారి భూములను అడవుల నుండి గెంటివేయడానికి కుట్ర చేస్తున్నది. మరోవైపు ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా సీలేరు, చిత్రకొండ, కొలాబ్ తదితర ప్రాంతాల్లో డ్యాం నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రకృతినీ, పర్యావరణాన్ని ధ్వంసం చేసి, ప్రజల సందపను దండుకోవడంతో భూములు కోల్పోయి, లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు. గ్రామాలలో వందలాది ఎకరాల భూములు కలిగిన భూస్వాములు, భూమితోపాటు ఫ్యూడల్ అధికారాన్ని కలిగి ఉన్నారు. ప్రభుత్వం వ్యవసాయరంగం అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. వ్యవసాయకూలి, పేద రైతాంగానికి దున్నుకోవడానికి భూములు లేవు, దానికితోడు విద్యా, వైద్యం ఉపాధి తదితర రంగాలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. లక్షలాది మంది ప్రజలు పొట్టచేత పట్టుకొని ఇతర రాష్ట్రాలకు వలసకూలీలుగా వెళ్ళిపోతున్నారు. ఈ మధ్య కాలంలో కరోనా సమస్య ముందుకు రావడంతోపాటు, పాలకవర్గాల నిర్లక్ష్యం కూడా తోడవడంతో వాళ్ళ జీవన పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారాయి.

మరోవైపు దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఎండగడుతూ, అనేక ప్రాంతాలలో ప్రజలు తమ నిరసననూ, పోరాటాలను కొనసాగిస్తూ వస్తున్నారు. కోరాపుట్ జిల్లాలోని నారాయణపట్నా, బందుగాం, నందపూర్, లమ్తపుట్, బైఫర్‌గూడ, మల్కనగిరి జిల్లాలోని మోటు, పొడియా, కలిమెల, పప్పులూరు, కుడుములగుమ్మ, మతిలి, కోరుకొండ, చిత్రకొండ ప్రాంతాలలో పార్టీ నాయకత్వంలో ప్రజలు దున్నేవారికే భూమి, 'ప్రజారాజ్యాధికార కమిటీలకే సర్వాధికారాలు' అనే నినాదంతో సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, విద్యా, వైద్యం, సాగు, తాగునీరు తదితర దైనందిన సమస్యలపై పోరాడుతున్నారు. గ్రామాలలో అభివృద్ధి నిరోధక పాత అధికారాన్ని కూలదోసి, విప్లవ ప్రజారాజ్యాధికార కమిటీలను నిర్మించుకొని, ప్రజల అధికారాన్ని స్థాపించుకున్నారు. 2017లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను చిత్రకొండ బ్లాక్‌లో ప్రజలు పూర్తిగానూ, అలాగే ఇతర ప్రాంతాలలో కూడా మెజారిటీ ప్రజలు ఎన్నికలు బహిష్కరించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా, పోరాడే ప్రజలపై, వారి నాయకత్వంపై తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తున్నారు.

కార్పెట్ సెక్యూరిటీ పేరుతో పదుల సంఖ్యలో బీఎస్ఎఫ్ క్యాంపులు ఉనికిలోకి వస్తున్నాయి. గ్రేహౌండ్స్, ఎస్ఓజీ, డీవీఎఫ్ లాంటి కమాండో బలగాలతో నిరంతరం ఆ ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్స్ కొనసాగిస్తూ, ప్రజల ఆస్తులను దోచుకోవడం, అక్రమంగా అరెస్టు చేసి, జైళ్ళలో పెట్టడం, బలవంతంగా సరెండర్స్ చేయించుకోవడం, సరెండర్ కాని వ్యక్తులను రకరకాల పద్ధతులలో హింసించి హత్యలు చేయడం నేడు ఆ ప్రాంతంలో సర్వసాధారణంగా మారిపోయింది. ప్రజలపై పాలకవర్గాలు ఇంత తీవ్రమైన హింసాకాండ కొనసాగిస్తూన్నా, ఏ ఒక్క రాజకీయ నాయకుడు వీటిని ఖండించడంగానీ, వ్యతిరేకించడంగాని చేయలేదు. మరోవైపు పోరాడే ప్రజలను పక్కదారి పట్టించడానికి రోడ్డు నిర్మాణాలు, సెల్ టవర్స్, సెల్‌ఫోన్ పంపిణీ లాంటి కొన్ని జిమ్మికులు ప్రదర్శించి ఇదే నిజమైన అభివృద్ధి అని పాలకవర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. మరోవైపు కొరియ ప్రాంతాల్లో ఉన్న బాక్సైట్, బంగారం లాంటి విలువైన సంపదను దోచుకోవడానికి ఆంధ్ర, ఒడిశా పాలకవర్గాలు కుట్రలు పన్నుతున్నారనేది జగమెరిగిన సత్యం. అయితే ఆ విషయం బయటపడనీయకుండా రెండు రాష్ట్ర పాలకవర్గాలు స్థానిక ప్రజలపై అమితమైన ప్రేమను ఒలకబోస్తున్నట్లు నటిస్తూ, ఆ ప్రాంత ప్రజలను తమ కంట్రోల్‌ల్లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నది.

***ప్రియమైన ప్రజలారా!***

పార్టీలు వేరైనా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించడం, ఆ విధానాలను వ్యతిరేకించే ప్రజలపై తీవ్ర నిర్బంధకాండ కొనసాగించే విషయంలో అన్ని పార్టీలకు ఏకాభిప్రాయం ఉంటుందనేది మనం అర్థం చేసుకోవాలి. మరీ ముఖ్యంగా, పాలక బీజేడీ, ఫాసిస్టు బీజేపీ పార్టీలు పై విధానాలను అనుసరించడంలో అత్యంత దూకుడుతనాన్ని ప్రదర్శిస్తున్నాయి. ప్రజా ఉద్యమాలను అణచివేయడం ద్వారానే తాము రూపొందించిన ఎల్‌పీజీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయగల్గుతామని అవి భావిస్తున్నాయి. అందుకే ఈ పార్టీలను మన ప్రాంతాల్లోకి రాకుండా అడ్డుకొని తన్ని తరమాలి. మిగతా బూర్జువా, రివిజనిస్టు పార్టీలను కూడా ప్రజలలో నిలదీయాలి. ప్రజల డిమాండ్స్‌పైనా, ప్రజా ఉద్యమాలపైన తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలనీ, గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించాలి.

మరోవైపు ఈ బూటకపు ఎన్నికల ద్వారా ప్రజల మౌలిక సమస్యలు ఏవీ పరిష్కారం కావనే సత్యాన్ని మనం గ్రహించాలి. గత 75 సంవత్సరాల కాలంలో ఈ విషయం మనకు స్పష్టంగా అర్థమవుతున్నది. అందుకే ప్రత్యామ్నాయంగా ఈ దోపిడీవ్యవస్థ నిర్మూలన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో దీర్ఘకాలిక సాయుధ పోరాటం కొనసాగుతున్నది. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ లక్ష్యంతో ప్రజలు వివిధ వర్గసంఘాలలో సంఘటిత పడుతూ, విప్లవ ప్రజారాజ్య కమిటీ(ఆర్పీసీ)లను నిర్మించుకొని సమసమాజ నిర్మాణం కోసం బాటలు వేస్తున్నది. అందుకే మీరు కూడా ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తూ, నూతన సమాజ నిర్మాణం కోసం ప్రజానిర్మాణాలలో భాగం కావాలని ఆంధ్రా-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ పిలుపునిస్తున్నది. పోరాడితే అంతిమ విజయం ప్రజలదే.

Ganesh

**గణేష్,**

**కార్యదర్శి,**

**ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

---

**37 పేజీ తరువాయి భాగం**

దోపిడీ పీడనల నుంచి విముక్తి సాధించేందుకు, ప్రపంచ శాంతి స్థాపనకు ఈ భూతలంపై సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించి యుద్ధాలకు తావులేని సోషలిజాన్ని స్థాపించడమే ప్రపంచ కార్మికవర్గం, మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు శక్తుల ముందున్న ఏకైక మార్గం, తక్షణ కర్తవ్యం.

ఈ కర్తవ్య సాధన కోసం ప్రస్తుత నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా తగిన అంతర్జాతీయ విప్లవ కార్మికవర్గ సంస్థను నెలకొల్పడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ అగ్రగామి దళాలు, సంస్థలు నేటి శ్రామిక ప్రజల డిమాండ్లను అందుకొని, వారి విముక్తి దిశలో సోషలిస్టు, నూతన ప్రజాస్వామిక విప్లవాలకు, జాతివిముక్తి పోరాటాలకు సమైక్య నాయకత్వాన్ని అందించేందుకు ఇటీవలి కాలంలో క్రమంగా సంఘటితపడుతున్నాయి. వీటి మధ్య సమైక్యత, సంఘీభావం పెంపొందుతున్నది. అంతర్జాతీయ వేదిక నిర్మాణావశ్యకతపై మా పార్టీ వైఖరితో కొన్ని మావోయిస్టు సంస్థలు ఏకీభవిస్తూ తక్షణం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరడం ఆహ్వానించదగిన పరిణామం. ఇది పెంపొందుతున్న ప్రపంచ కార్మికవర్గ స్వీయాత్మక శక్తిని సూచిస్తున్నది. దీనిపై ఆధారపడి సామ్రాజ్యవాదుల అన్ని రకాల దాడులను, యుద్ధాలను తిప్పికొట్టేందుకు, ప్రపంచ శాంతికి ప్రత్యేకించి ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా పోరాటాలకు సమైక్య నాయకత్వాన్ని అందించేందుకు నిర్దిష్ట పథకంతో అంతర్జాతీయంగా సమైక్య వేదికలను స్థాపించేందుకు పూనుకుందాం. ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని పురోగమింపజేద్దాం. ఈ దిశలో మనం మరింత సమైక్యమవుదాం.

**అమృత్**

**అంతర్జాతీయ వ్యవహారాలు**

**కేంద్ర కమిటీ**

# విప్లవ ప్రజాయుద్ధ సాంస్కృతిక కళారంగయోధుడు కామ్రేడ్ డప్పు రమేష్ (కిరణ్)కు అరుణారుణ జోహార్లు




**"మీ త్యాగం ఉన్నతమైనది అది హిమశిఖరాల వంటిది**
**మీ ఆశయం శాశ్వతమైనది అది కమ్యూనిజం తెస్తది**
**ఒక వీరుడు నేల కొరిగితే తిరిగి ప్రభవింతులు వేల వీరులు**
**మీ నెత్తుటి విత్తనాలే నేడు ప్రజాయుద్ధ పోరు మొలకలు"**

నేడు మనం కొనసాగిస్తున్న వర్గయుద్ధంలో త్యాగాలు అనివార్యమనీ, ఒక వీరుడు మరణిస్తే వాళ్ళ స్ఫూర్తితో వెనవేలమంది ఉద్భవించి, ఎర్రసేన దండుగట్టి, ఈ దోపిడీ వ్యవస్థను నిర్మూలిస్తూ అంతిమ విజయం సాధిస్తారని గత నాలుగు దశాబ్దాలుగా తన ఆట, మాట, పాట, ఆచరణ ద్వారా నిరూపిస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో, అంతిమంగా సోషలిజం కమ్యూనిజం స్థాపనకై తన చివరి శ్వాస వరకు పీడిత ప్రజల పక్షాన నిలబడిన గొప్ప విప్లవ సాంస్కృతిక కళారంగం యోధుడు కామ్రేడ్ డప్పు రమేష్ (కిరణ్) 2022 మార్చి 18వ తేదీన తన 61వ యేట ప్రభుత్వ ఫాసిస్టు దాడులను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొంటూ, తీవ్రమైన అనారోగ్యానికి గురై అమరుడైనాడు.

కామ్రేడ్ రమేష్‌ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, తెనాలి తాలూక, అంగలకుర్తి గ్రామం. తల్లిదండ్రులు ఇద్దరు గవర్నమెంట్

ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, దైవసేవ (క్రిష్టియన్ మత ప్రచారం) కోసం తమ ఉద్యోగాలను వదిలిపెట్టి, సొంత గ్రామంలోనే క్రిష్టియన్ మందిరం (చర్చి)ను నిర్మించి వాటి నిర్వహణ బాధ్యతలు చూసేవారు. మతనేపథ్యం గల కుటుంబం కావడంలో ఆయనను ఏలియాజర్ అని పేరుపెట్టి పిలుచుకునేవారు. తన చిన్నప్పటి నుండే అనేక క్రిష్టియన్ గీతాలను ఆలపించడం, చర్చిల్లో జరిగే వివిధ సాంస్కృతిక కార్యకలాపాలలో భాగమవుతూ, అనేక సంగీత వాయిద్యాలను వాయిస్తూ, వాటి మీద పట్టును సాధిస్తూ వచ్చాడు. తర్వాత తన విప్లవ కార్యాచరణకు అవి ఎంతగానో తోడ్పడ్డాయి. చదువు కోసం తెనాలి వచ్చినప్పుడు తన తోటి పిల్లలకు ఎస్సీ హాస్టళ్ళలో ఎదురవుతున్న అవమానాలు, కులం పేరుతో కొనసాగిస్తున్న దాడులు రమేష్‌ను సామాజిక ఉద్యమాలలోకి నడిపించాయి.

1980-81 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం తెనాలిలో చదువుతున్నప్పుడు రాడికల్ విద్యార్థి సంఘంతో పరిచయాలు ఏర్పడ్డాయి. సంఘం నాయకత్వంలో కొనసాగుతున్న అనేక పోరాటాల్లో తను కూడా క్రియాశీలకంగా పాల్గొంటూ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవాడు. ఈ క్రమంలో తన అవగాహనను మరింత మెరుగుపర్చుకుంటూ పీడిత ప్రజలపై కొనసాగుతున్న దోపిడీ, పీడన అణచివేతలకు పరిష్కారంగా విప్లవమే సరైన మార్గమని దృఢంగా విశ్వసించాడు. దానిని సాధించడం కోసం అవిశ్రాంతంగా తన కృషిని కొనసాగిస్తూ వచ్చాడు. అందులో భాగంగా పార్టీ ఇచ్చిన 'గ్రామాలకు తరలండి' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ, విప్లవ ప్రజాయుద్ధ రాజకీయాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో పాట, డప్పును ఆయుధంగా మలుచుకున్నాడు. జననాట్యమండలి(జేఎన్ఎమ్) తెనాలి బృందం ఏర్పడినప్పుడు కామ్రేడ్ రమేష్ అందులో భాగమయ్యాడు. అప్పటి నుండి జేఎన్ఎమ్‌ను ప్రాణంగా శ్వాసించాడు. డప్పును ఆయుధంగా మలుచుకొని ప్రజల గుండె చప్పుడైన జననాట్యమండలి డప్పుల చప్పుళ్ళతో డప్పు రమేష్‌గా పేరు పొంది, ప్రజాయుద్ధ కళాకారుడుగా కామ్రేడ్ రమేష్ తన విప్లవ ప్రస్థానాన్ని చివరి వరకు కొనసాగిస్తూ వచ్చాడు.

కామ్రేడ్ రమేష్ తన కళను మరింత మెరుగుపర్చుకోవడంలో భాగంగా 1983-84లో వంగపండు ప్రసాద్ నేతృత్వంలో నెల రోజులు జరిగిన జననాట్యమండలి వర్క్‌షాప్‌లో విద్యార్థిగా పాల్గొన్నాడు. ఈ వర్క్‌షాప్‌లో ఆర్ఎస్‌యూ, ఆర్‌వైఎల్ నుండి వచ్చిన అనేక మంది యువకులు కూడా భాగమయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో పాట, అభినయం, దరువు తదితర అంశాల్లో శిక్షణ పొందారు. శిక్షణను పూర్తి చేసుకున్న అత్యధిక మంది యువకులు తమ చదువులు, సర్వస్వాన్ని వదిలిపెట్టి వృత్తి విప్లవకారులుగా జీవితం గడపాలని నిర్ణయించుకున్నారు. వారిలో డప్పు రమేష్ కూడా పూర్తికాలం విప్లవోద్యమంలో పని చేయడానికి తన జీవితాన్ని అంకితం చేయడానికి నిర్ణయించుకున్నాడు. గుంటూరు జిల్లాలో అమరులు కామ్రేడ్ దివాకర్, ఏసు, కుమారి తదితర కామ్రేడ్స్‌తో ఏర్పడి పని చేస్తున్న జననాట్యమండలి టీంలో కామ్రేడ్ రమేష్ కూడా సభ్యుడిగా కొనసాగుతూ ఆ టీంలో డప్పు స్పెషలిస్టుగా ఉంటూ, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జేఎన్ఎమ్ ప్రదర్శనలను ఇస్తూ, పార్టీ ప్రజాయుద్ధ రాజకీయాలను ప్రచారం చేయడంలో చాలా క్రియాశీలకమైన పాత్ర పోషించాడు.

'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనే సూత్రంపై ఆధారపడి అనేక ప్రజాకళా రూపాలనూ, ఆచార వ్యవహారాలను అధ్యయనం చేస్తూ వాటిని విప్లవీకరించే కార్యాచరణను కొనసాగిస్తూ వచ్చాడు. భూమిభాగోతం, రగల్‌జెండా బ్యాలే, నక్సల్బరీ బిడ్డలు, కారంచేడు ఒగ్గుకథ, ఎన్నికల భాగోతం తదితర అనేక కళా రూపాలను ప్రదర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే సాంస్కృతిక కళా ఆర్గనైజర్‌గా తన పాత్ర పోషిస్తూ వచ్చాడు.

"నక్సలైట్లే దేశ భక్తులు, అధికారంలోకి వస్తే నక్సలైట్ల ఎజెండాను అమలు చేస్తా"నని ప్రజలను నమ్మించి 1984లో ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన ఎన్‌టీ రామారావు కొద్ది కాలంలోనే తన వర్గ స్వభావాన్ని బయటపెడుతూ, పీడిత ప్రజలపైనా, ప్రజాపోరాటాలపైనా, ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీ, ప్రజా సంఘాలపైన అప్రకటిత నిషేధాన్ని కొనసాగిస్తూ తీవ్రమైన దమనకాండను అమలు చేసాడు. ఈ నిర్బంధంలో అన్ని ప్రజా సంఘాలతో పాటు, జననాట్యమండలి కూడా తన కార్యాక్రమాలను బహిరంగంగా కొనసాగించలేని స్థితికి నెట్టబడింది. దీనితో జేఎన్ఎమ్ సంస్థ రహస్యంగానే ఉంటూ తన ఆట, పాటలను రికార్డు చేసి, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. వీటన్నింటిలోనూ కూడా కామ్రేడ్ రమేష్ తన వంతు పాత్రను క్రియాశీలకంగా పోషించాడు.

ఎన్‌టీ రామారావు వియ్యంకుడు దగ్గుపాటి చెంచురామయ్య నాయకత్వంలో వందలాది మంది కమ్మ భూస్వాములు ఏకమై కారంచేడు దళితులపై దాడి చేసారు. ఈ దాడిలో అనేక మంది దళితులు తమ ప్రాణాలనూ, ఆస్తులను పోగొట్టుకొని విస్థాపితులయ్యారు. ఆ మారణకాండను ఖండిస్తూ, బాధితుల తరపున న్యాయపోరాటటం చేసేందుకు అనేక ప్రజా సంఘాలు, దళిత సంఘాలు ముందుకు వచ్చాయి. చీరాలలో విజయనగర్ కాలనీ ఏర్పాటు చేసి, బాధితుల తరపున శిబిరాన్ని ఏర్పాటు చేయడం, శిబిరం నిర్వహించినంత కాలం బాధితుల కన్నీళ్ళలో, దుఃఖంలో వేదనలో భాగమవుతూ, వారిని మనుషులను చేసి కూడగట్టి చైతన్యాన్ని రగిలించడంలో కామ్రేడ్ రమేష్ పాత్ర మరువలేనిది. "దళిత పులులమ్మా, కారంచేడు భూస్వాముల మీద కలబడి, నిలబడి పోరుసల్పిన దళిత పులులమ్మా" పాటలతో వాళ్ళలో చైతన్యరాగాన్ని నింపిన కళాకారుడుగా వాళ్ళ మనసులో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీ రామారావు ప్రభుత్వం కొనసాగించిన పాశవిక నిర్బంధకాండను ప్రజలు అనేక త్యాగాల ద్వారా ఓడిస్తూ 90వ దశకంలో మరో విప్లవ వెల్లువను సృష్టించారు. పార్టీ, ప్రజాసంఘాల నాయకత్వంలో ప్రజలు అనేక వందల, వేల సంఖ్యలో సంఘటితమవుతూ భూస్వాముల పట్టా భూములతో పాటు, దేవాలయ, ఫారెస్టు తదితర వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని ప్రజలు పంచుకోవడంతోపాటు, ఇతర అనేక సమస్యల పరిష్కారం కోసం ఉవ్వెత్తున కదులుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన చెన్నారెడ్డి ప్రభుత్వం ప్రజాపోరాటాలకు తలొగ్గి తాత్కాలికంగా పార్టీ, ప్రజాసంఘాలపై నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ పరిస్థితిని జేఎన్ఎమ్ విప్లవోద్యమ ప్రచారానికి విస్తృతంగా ఉపయోగించుకుంది. పార్టీ మార్గదర్శకత్వంలో వివిధ ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించింది. ఈ సందర్భంగా అనేక సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చింది. అనేక జానపద

కళారూపాలను ప్రోత్సహించేందుకు కృషి చేసింది. పార్టీ నాయకత్వంలో విస్తరిస్తున్న విప్లవోద్యమంతోపాటు, జేఎన్ఎమ్ కూడా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ మొదలైన రాష్ట్రాల్లోకి వెళ్ళి విప్లవ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చింది. ఆయా రాష్ట్రాలలో ఉన్న సాంస్కృతిక సంస్థలతో పరిచయాలు ఏర్పాటు చేసుకుంది. పై కృషి మూలంగా దేశవ్యాప్త విప్లవ సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి తర్వాత ఎంతగానో తోడ్పడింది. పైన చెప్పిన ఈ మొత్తం కృషిలో కామ్రేడ్ రమేష్ తన వంతు పాత్రను పోషించాడు.

పురోగమిస్తున్న విప్లవోద్యమాన్ని అణచివేయడానికి దోపిడీ పాలకవర్గాలు అనతి కాలంలోనే మరల ఆట, పాట, మాటను బంద్ పెట్టే కార్యాచరణ కొనసాగించాయి. 1992లో అధికార పగ్గాలు చేపట్టిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పార్టీ, ప్రజాసంఘాలను నిషేధిస్తూ, అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లకు మరల తెరలేపాడు. పై నేపథ్యంలో పార్టీ నాయకత్వంలో సాంస్కృతిక విభాగంగా కొనసాగుతూ వచ్చిన జేఎన్ఎమ్ కృషిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ 1995లో సమీక్షించి నూతన పర్‌స్పెక్టివ్‌ను రూపొందించింది. ఈ పర్‌స్పెక్టివ్‌లో భాగంగా కామ్రేడ్ రమేష్ 1997లో ప్రస్తుతం ఏఓబీలో పార్ట్‌గా ఉన్న ఈస్ట్ డివిజన్ సాయుధ జననాట్యమండలి బాధ్యతలను చేపట్టాడు.

1997 నుండి 2004 వరకు ఏఓబీలో ఈస్ట్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ విప్లవ ప్రజాయుద్ధ సాంస్కృతికోద్యమాన్ని నిర్మించడం, విస్తరించడంలో కీలకమైన పాత్ర పోషించాడు. తూర్పు కనుమల ప్రాంతంలో అనేక భాషలు, తెగలు, కట్టుబాట్లతో వైవిధ్యంగా ఉండే ప్రజల ఆచార, వ్యవహారాలను దగ్గర నుండి క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని విప్లవీకరించే కార్యాచరణను కొనసాగించాడు. స్థానిక తెలుగు, కువ్వి, ఒడియా, సవర భాషలను నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే, ఆయా భాషల్లో పాటలను రాసి, పాడుతూ వాటి ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో కామ్రేడ్ రమేష్ పాత్ర మరువలేనిది.

నూతన కళాకారులను అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా 1997లో ఈస్ట్ డివిజన్ పరిధిలో ఒక కల్చరల్ వర్క్‌షాప్‌ను నిర్వహించి అనేక మంది స్థానిక క్యాడర్లకు శిక్షణ అందించాడు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాట, అభినయం, డప్పు తదితర అంశాలపై శిక్షణనిచ్చాడు. ఈ కార్యక్రమంలో తనతోపాటు తన జీవిత సహచరి కామ్రేడ్ కుమారి కూడా భాగమయ్యింది. ఈ కార్యక్రమం పూర్తి చేసుకున్న కొద్ది రోజుల్లోనే కామ్రేడ్ కుమారికి మలేరియా జ్వరం సోకి తీవ్రమైన అనారోగ్యానికి గురికావడంతో తనను ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్‌కు పంపించినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడు కోలేకపోయాం. కామ్రేడ్ కుమారి అమరత్వం రమేష్‌కు షాక్‌కు గురి చేసింది. నాయకత్వం, తోటి కామ్రేడ్స్ అందించిన సహకారంతో తొందరలోనే కోలుకొని మరల తన కార్యాచరణలో నిమగ్నమయ్యాడు. 1998లో శ్రీకాకుళం డివిజన్‌లో కూడా 10 రోజులు సాంస్కృతిక శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించి, డివిజన్ స్థాయిలో సాయుధ జేఎన్ఎమ్ దళాన్ని ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసాడు.

1997లో ఒక దళంగా ప్రారంభమైన జేఎన్ఎమ్ 2022 నాటికీ ఈస్ట్, శ్రీకాకుళం, మల్కనగిరిలో మూడు జేఎన్ఎమ్ దళాలుగా అభివృద్ధి చెందాయి. 2004 నాటికీ బాసదార ఉద్యమం కలవడంతో నాల్గవ దళాన్ని కలుపుకొని, నాలుగు దళాల కమాండర్స్‌తోపాటు, జోన్‌టీం బాధ్యుడిగా ఉన్న కామ్రేడ్ రమేష్‌తో కలిపి మొత్తం ఐదుగురితో జోనల్ కల్చరల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు అయింది. ఈ కమిటీకి కామ్రేడ్ రమేష్ బాధ్యుడిగా ఉండాలనీ స్పెషల్ జోనల్ కమిటీ చేసిన నిర్ణయాన్ని మనస్పూర్తిగా ఆమోదిస్తూ, మరింత బాధ్యతగా ఆ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి కృషి చేసాడు.

పార్టీ నాయకత్వంలో పెంపొందుతున్న విప్లవ సాంస్కృతికోద్యమాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజల్లోకి తీసుకొని పోవడానికి జోన్‌స్థాయిలో ఒక సాహిత్య సాంస్కృతిక పత్రికను నడపాలనీ, జోనల్ కల్చరల్ కో-ఆర్డినేషన్ కమిటీ చేసిన నిర్ణయాన్ని స్పెషల్ జోనల్ కమిటీ ఆమోదిస్తూ, 'తూర్పుకనుమ' అనే పేరుతో పత్రిక తీసుకురావాలనీ నిర్ణయించింది. దీంతో పార్టీ తూర్పుకనుమ పత్రిక నిర్వహణ బాధ్యతను కామ్రేడ్ రమేష్‌కు అప్పగించింది. పార్టీ చేసిన పై నిర్ణయాన్ని మనస్పూర్తిగా స్వాగతిస్తూ ఈ రంగంలో పని చేస్తున్న ఇతర కామ్రేడ్స్ సహకారాన్నీ, పై కమిటీ నుండి ఎప్పటికప్పుడు అందిస్తూ వస్తున్న సలహాలనూ, సూచనలను పాటిస్తూ, ఆ పత్రికను రెగ్యూలర్‌గా నడిపించేందుకు తీవ్రమైన కృషి చేస్తూ వచ్చాడు.

సాంస్కృతికరంగం యొక్క ఆవశ్యకతను పార్టీ మరింతగా కేంద్రీకరించాల్సిన అవసరాన్ని వివిధ పార్టీ కాన్ఫరెన్స్‌లలో, ప్లీనాలలో, కమిటీ సమావేశాలలో కామ్రేడ్ రమేష్ లోతుగా చర్చించేవాడు. 2002లో కేంద్రకమిటీ రూపొందించిన సాంస్కృతికరంగ పర్‌స్పెక్టివ్‌ను చర్చించడం కోసం దేశవ్యాప్తంగా ఈ రంగంలో పని చేస్తున్న అనేక మంది కామ్రేడ్స్‌తో ఒక కల్చరల్ వర్క్‌షాప్‌ను కేంద్రకమిటీ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో కామ్రేడ్ రమేష్ కూడా పాల్గొని ఆ పర్‌స్పెక్టివ్‌ను మరింత సంపద్వంతం చేయడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర కామ్రేడ్స్ అనుభవాలను తెలుసుకుంటూ తన కార్యాచరణను మరింత మెరుగుపర్చుకోవడానికి కృషి చేసాడు. ఈ సమావేశాల్లోనే ఏఓబీ జోన్ కల్చరల్ పర్‌స్పెక్టివ్‌ను రూపొందించడంలో కీలకమైన పాత్ర పోషించాడు.

ఏఓబీ ప్రాంతంలో పైన చెప్పిన విధంగా తన సాంస్కృతికరంగ కృషిని కొనసాగిస్తూనే మరోవైపు ప్రజల దైనంధిన సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేస్తూ వచ్చాడు. ఆదివాసుల భూములను మోసపూరితంగా స్వాధీనం చేసుకోవడానికి అవకాశం ఇచ్చే 1/70 చట్ట సవరణను వ్యతిరేకిస్తూ, ఆ చట్టం అమలు జరపాలని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసారు. మరోవైపు మలేరియా మరణాలు, హిందూమతోన్మాదం, క్రైస్తవ ప్రచారం, నరబలులు తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేసే దాంట్లో భాగంగా అనేక పాటలు, నాటికలు, ఇతర కళారూపాలను జేఎన్ఎమ్ రూపొందించి ప్రదర్శించింది. పై పోరాటాల్లో, ఆందోళనలలో కామ్రేడ్ రమేష్ ప్రత్యేకంగా పాల్గొంటూ, అనేక కళా ప్రదర్శనల ద్వారా వాళ్ళను చైతన్య పరిచేవాడు. మరోవైపు తూర్పు కనుమల ప్రాంతంలో నిక్షేపమైవున్న బాక్సైట్ గనులను దోపిడీ వర్గాలు వెలికితీయడం కోసం చేస్తున్న అనేక ప్రయత్నాలను మన పార్టీ నాయకత్వంలో ప్రజలు సంఘటితంగా అడ్డుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కుటిల ఎత్తుగడలను వివిధ కళా రూపాలు, పాటల ద్వారా విస్తృతంగా ప్రచారం

చేసాడు. మరోవైపు ఓట్ల పేరుతో గారడిచేస్తూ, ప్రజలను మోసం చేస్తున్న దోపిడీ రాజకీయ, రివిజనిస్టు పార్టీలను ఎండగడుతూ "ఓటు తక్కివత్తేరి కువ్విదాద, ఓటు మీరు ఇయ్యాదు కువ్వినాన" అంటూ అనేక పాటలు, నాటికల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తూ, ప్రజాయుద్ధంలో భాగమవుతూ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని తన ఆట, మాట, పాట ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసాడు. పార్టీ నాయకత్వంలో కొనసాగిన విప్లవ భూ సంస్కరణలు, ఇతర అనేక కార్యక్రమాలలో ప్రత్యేకంగా పాల్గొనడం ద్వారా నూతన అనుభవాలను సంపాదించాడు. మరోవైపు చెరువులు, చెక్‌డ్యాంలు తదితర పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల భాగస్వామ్యంతో అవి అమలయ్యే విధంగా కృషి చేసాడు. పీఎల్‌జీఏ నాయకత్వంలో కొనసాగిన ప్రతిఘటనా కార్యక్రమాలలో ప్రత్యేకంగా, పరోక్షంగా భాగమవుతూ వాటిని విజయవంతం చేసేందుకు కామ్రేడ్ రమేష్ చేసిన కృషి మరువలేనిది.

ఏఓబీ ప్రాంతంలో పైన చెప్పిన విప్లవ కార్యాచరణంతా కామ్రేడ్ రమేష్ నిప్పులు చెరిగిన నిర్బంధం మధ్యనే కొనసాగించాడనేది కఠోర వాస్తవం. శతృవు మనపార్టీని నిర్మూలించడానికి కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక దాడులను ప్రజల సహకారంతో చిత్తుజేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో అనేక సందర్భాలలో శతృదాడులకు గురై, తనతో కలిసి పని చేసిన కామ్రేడ్స్ అమరులైనప్పుడు వాళ్ళ త్యాగాలనూ, ఆదర్శాలను ఎత్తిపడుతూ అనేక పాటలను రాసి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసాడు. అనారోగ్య సమస్యలైన మలేరియా, కాళ్ళనొప్పులు నిరంతరం తనని వెంటాడేవి. ఆ సమస్యలను కూడా బోల్షివిక్ స్పిరిట్‌తో అధిగమిస్తూ, పార్టీ తనకు అప్పగించిన సాంస్కృతికరంగాన్ని ఎంతో బాధ్యతగా, పట్టుదలతో అభివృద్ధి చేస్తూ, తోటి కామ్రేడ్స్ ప్రజల అభిమానాన్ని చూరగొన్న గొప్ప సాంస్కృతిక కళారంగ యోధుడిగా కామ్రేడ్ రమేష్ ఏఓబీ పీడిత ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. కిరణ్ పేరుతో తను కొనసాగించిన విప్లవ ప్రస్థానాన్ని ఏఓబీ ఉద్యమ చరిత్రలో లిఖించబడి ఉంటుంది.

2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంతో పార్టీ జరిగిన చర్చల సందర్భంగా రహస్య జీవితం నుండి బయటకు వచ్చి, లీగల్‌గా తన విప్లవ కార్యాచరణను కొనసాగిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో లీగల్‌గా జరిగే యానం సిరమిక్ కార్మిక పోరాటం మొదలు యూనివర్సిటీల్లో ఎస్టీ, ఎస్సీ, బీసి విద్యార్థుల, అధ్యాపకులపై వివక్ష, దళితులపై దాడులు, బ్రాహ్మణీయ హిందూ మనోన్మాద దాడులకు వ్యతిరేకంగా, రైతుల పోరాటాలు, స్వయం ప్రతిపత్తి, కోసం పోరాడుతున్న జాతుల ఉద్యమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఇలా రెండు దశాబ్దాల కాలంగా కామ్రేడ్ రమేష్ విశాల ప్రజాక్షేత్రంలో పనిచేస్తూ వచ్చాడు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కామ్రేడ్ రమేష్ సాంస్కృతికరంగంలో మరువలేని సేవలను అందించాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో వివిధ కళా బృందాల కృషి ఎంతో ముఖ్యమైనది. జేఎన్ఎమ్ స్ఫూర్తితో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం అనేక కళా బృందాలు ముందుకు వచ్చాయి. ఆ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూ తెలంగాణ ప్రజల జీవన పరిస్థితుల గురించి, ఆ ప్రాంత ప్రజలపై కొనసాగుతున్న దోపిడీ, దౌర్జన్యాల గురించి కామ్రేడ్ రమేష్ అనేక పాటలు రాసి ప్రచారం చేసాడు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న జానపద కళా రూపాలను పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్ళడంలో కామ్రేడ్ రమేష్ కృషి ఎంతో ఉంది.

సహచర విప్లవ ప్రజాసంఘాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సందర్భోచితంగా పాటలు, ప్రదర్శనల ద్వారా పాలు పంచుకునేవాడు. గళం ఎత్తినా, దప్పు వాయించినా తన్మయత్వంతో ఊగిపోయేవాడు. నేడు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకుంటూ సోషల్ మీడియాలో జేఎన్ఎమ్, దండకారణ్య ప్రజాయుద్ధంలో భాగమైన చేతననాట్యమంచ్ సాంస్కృతిక కృషిని విస్తృతంగా ప్రచారం చేయడంలో, ఆధునిక సాంకేతిక పద్ధతిలో వాటిని సంక్షిప్తం చేయడంలో కామ్రేడ్ రమేష్ విశేషమైన కృషిని కొనసాగిస్తూ వచ్చాడు.

జననాట్యమండలి సంస్థను ఏర్పాటు చేసి, నేటికీ 50 వసంతాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఆ చరిత్రను అక్షరబద్ధం చేయడానికి జరుగుతున్న ప్రయత్నంలో భాగంగా కామ్రేడ్ రమేష్ తనవంతు కర్తవ్యంగా ఆ బాధ్యతను పరిపూర్తి చేయడంలో ఎంతో కష్టపడ్డాడు. జేఎన్ఎమ్ సంస్థతో ప్రత్యేకంగానూ, పరోక్షంగాను సంబంధం ఉన్న అనేక మంది వ్యక్తుల దగ్గరకు పోయి ఆ సంస్థకు సంబంధించిన అనేక విషయాలను సేకరించాడు.

పై విషయాలే కాకుండా పార్టీ అప్పగించిన ఏ పనినైనా బాధ్యతగా నెరవేర్చడానికి చిత్తసుద్ధితో పని చేసేవాడు. అందుకే పీడిత ప్రజల పక్షాన నిలబడి గొంతెత్తి పాలకవర్గాలను నిలదీసిన కామ్రేడ్ రమేష్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షగట్టి అనేకసార్లు దాడులు చేసి, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, మరోవైపు అనారోగ్య సమస్య కూడా రోజు రోజుకు మరింత జఠిలమవడం, సరైన వైద్య సదుపాయాలు పొందలేని స్థితిలో ఆరోగ్యం మరింతగా క్షీణించి 2022 మార్చి 18న తుదిశ్వాస విడిచి అమరత్వం చెందాడు.

ఈ నాలుగు దశాబ్దాల కాలంలో కామ్రేడ్ రమేష్ ఎటువంటి ఆడంబరాలకు పోకుండా ఒక సాధారణ కార్యకర్తగా, కార్మికవర్గతత్వంతో తన విప్లవ కార్యాచరణను కొనసాగిస్తూ వచ్చాడు. ప్రజాపోరాటాలు, ఆందోళనల్లోను పీడిత ప్రజల పక్షాన నిలబడి వాటికి అన్ని విధాలుగా అండదండలు అందిస్తూ వచ్చాడు. ప్రజాయుద్ధ సాంస్కృతిక యోధుడుగా జనం గుండెల చప్పుడయి మోగాడు. ఆయన ఎప్పుడు నూతన ప్రజాస్వామిక విప్లవానికి ప్రధాన పోరాట రూపమైన సాయుధ పోరాటం గురించి రాసాడు, పాడాడు. "మీ త్యాగం ఉన్నతమైనది, అది కమ్యూనిజం తెస్తది" అని విప్లవానికి అగ్రభాగమైన కమ్యూనిస్టు పార్టీవల్లే సాధ్యమని ఉన్నతమైన అవగాహనతో కారంచేడు దళితులపై కమ్మ భూస్వాములు తలపెట్టిన దౌర్జన్యం, మారణకాండ మొదలు, రోహిత్ వేముల ఆత్మహత్య వరకు దళిత, అట్టడుగు వర్గాల అభాగ్యజీవుల భాగ్యోదయం కోసం ఆహర్నిశలు పాడాడు, ఆడాడు, పోరాడాడు. తన చివరి శ్వాస వరకు నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై కృషి చేసాడు. నాలుగ దశాబ్దాల కాలంగా విప్లవ కళాసాంస్కృతికరంగంలో విశేష కృషి చేసిన కామ్రేడ్ దప్పు రమేష్ మన నుండి భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన ఆచరణ, కృషి, పట్టుదల సజీవంగా మన కళ్ళముందు కదలాడుతూనే ఉన్నాయి. అమరుల ఆదర్శాలను ఎత్తిపడుతూ, వాళ్ళు కలలు గన్న కమ్యూనిజం సమాజాన్ని నిర్మించేందుకు మనం మునుముందుకే సాగిపోదాం.

# విప్లవ ప్రతీఘాతుక వ్యూహాత్మక 'సమాధాన్-ప్రహార్'లో భాగంగా నేడు ఏఓబిలో కొనసాగుతున్న శత్రుదాడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని నిర్మూలించి, పోరాడే ప్రజలకు నాయకత్వం లేకుండా చేసే లక్ష్యంతో వ్యూహాత్మక 'సమాధాన్' ఆపరేషన్ బహుముఖ దాడిని 2017 ఫిబ్రవరి నుండి ప్రారంభించి కొనసాగిస్తున్నాయి. 2020 అక్టోబర్ నుండి 10 ఎత్తుగడలతో కూడిన నిర్ణయాత్మక దాడి పథకాన్ని రూపొందించి, అప్పటినుండి ఈ దాడి నిర్దిష్టంగా ఆయా రాష్ట్రాలలోని ఉద్యమ బలాబలాలమీద ఆధారపడి అమలు చేస్తున్నాయి. ఉద్యమం బలహీనంగా ఉన్న ప్రాంతాలలో వీలైనంత తొందరగా పార్టీనీ, పీఎల్‌జీఏ బలగాలను నిర్మూలించచూస్తున్నాయి. గతంతో పోల్చితే అనేక రెట్ల తీవ్రతతో ఈ దాడిని కొనసాగిస్తున్నాయి. కేంద్ర నాయకత్వంలో ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సమన్వయంతో అర్ధసైనిక, కమాండో బలగాలను కలిపి యూనిఫైడ్ కమాండ్‌ని ఏర్పరిచి ఈ దాడిని కొనసాగిస్తున్నాయి. నిర్ధిష్టంగా ఏఓబీ ప్రాంతంలో ఈ దాడి కింది పద్ధతులను అనుసరిస్తూ కొనసాగుతున్నది.

1. మన సమాచారం అందగానే విశాల ప్రాంతంలో పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించి చుట్టుముట్టి దాడులు చేయడం

2. ప్రజా పనిని అడ్డుకోవడంలో భాగంగా నిరంతరం కూంబింగ్‌లు కొనసాగిస్తూ, గెరిల్లాలను మానసిక ఒత్తిడికి గురిచేసి, అలసిపోయేలా చేయడం, వీలైతే దాడి చేయడం

3. కార్పెట్ సెక్యూరిటీని నిరంతరం విస్తరింపజేయడం, ఉద్యమ ప్రాంతాలను కుదించడం, పార్టీ కమిటీల, జోన్‌ల మధ్య సమన్వయాన్ని దెబ్బతీయడం

మన వ్యూహాత్మక ప్రాంతాలలోకి పోలీసు బలగాలు వేగంగా






చిత్రకొండ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేస్తున్న కటాఫ్ ఏరియా గిరిజనులు(ఫైల్ ఫొటో)

చొచ్చుకొని వచ్చి దూకుడుగా దాడులు చేయడానికి అతితక్కువ సమయంలో రోడ్లు, బ్రిడ్జీలను సాయుధ బలగాల రక్షణలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నాడు. ప్రత్యేకంగా ఉద్యమ ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పార్టీ సమాచార సేకరణ కోసం సెల్‌టవర్స్‌ను నిర్మిస్తున్నాడు. 4జీ ఇంటర్నెట్ కనెక్షన్ నెలకొల్పుతున్నాడు. ఇన్‌ఫార్మర్లకు సెల్‌ఫోన్‌లను పంపిణీ చేస్తున్నాడు. డ్రోన్లద్వారా పార్టీ సంచరించే ప్రాంతాలలో సర్వేలు నిర్వహిస్తున్నాడు. వీటన్నింటికన్నా ముఖ్యంగా 'హూమెన్ ఇంటలిజెన్స్'పై ఆధారపడుతున్నాడు. ప్రజానిర్మాణాలలోకి చొరబడి రాజకీయంగా బలహీనపడినవారిని నయాన, బయాన లొంగదీసుకొని శత్రువుకు నమ్మిన బంట్లుగా, కోవర్టులుగా తయారు చేసుకుంటున్నాడు. గ్రామాలలోని నిరుద్యోగ యువతనూ, లంపెన్ సెక్షన్‌నూ, ప్రజావ్యతిరేకులనూ, వర్గశత్రువులనూ, లొంగిపోయిన మాజీలను ఉపయోగించుకుంటూ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. పార్టీ తెప్పించుకునే ఎలక్ట్రానిక్ గాడ్జెడ్స్‌లో జీపీఎస్ ట్రాకర్స్‌ను అమర్చి వాని ఆధారంగా దాడులకు పాల్పడుతున్నాడు. అరెస్టయిన వాళ్ళలో కూడా ఎక్కువ మందిని కోర్టుకు హాజరుపర్చకుండా, వారిని రాజకీయంగా బలహీనపరిచి లొంగదీసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాడు. అలా లొంగిపోయినవారి ద్వారా ఎప్పటికప్పుడు పార్టీ సమాచారాన్ని సేకరించుకొని దాడులకు పథకాలు రూపొందిస్తున్నాడు.

సాయుధంగా శత్రువు విప్లవోద్యమాన్ని అణచివేసే చర్యలతోపాటు, పార్టీపై చేస్తున్న దుష్ప్రచార దాడి కూడా ప్రముఖపాత్రే వహిస్తున్నది. పార్టీ ప్రజలకిచ్చే ప్రతి కార్యక్రమానికి వ్యతిరేకంగా స్టేట్‌మెంట్స్ ఇస్తున్నాడు, పోస్టర్స్ వేయిస్తున్నాడు. పార్టీకి వ్యతిరేకంగా ప్రజా వ్యతిరేకులను కూడగట్టుకొని ఊరేగింపులు చేయిస్తున్నాడు. ఈ మానసిక యుద్ధంలో భాగంగా విప్లవోద్యమం బలహీనపడిందనీ, సంఖ్యలు తగ్గిపోయాయనీ, అసలు మావోయిస్టులకు ప్రజల మద్దతే లేదని అసత్య ప్రచారానికి పూనుకుంటున్నాడు. పోలీసు సంస్కరణలలో భాగంగా జనసంపర్క్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాడు. ఉద్యమ ప్రభావిత గ్రామాలలో ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి క్రీడా సామాగ్రి పేరుతో వాలీబాల్ కిట్లు, క్రికెట్ కిట్లు పంపిణీని ముమ్మరంగా కొనసాగిస్తున్నాడు. ఆరోగ్యం పేరిట మెడికల్ క్యాంపులను నిర్వహించడంతోపాటు, మందుల పంపిణీ చేస్తున్నాడు. అంతేకాక మైత్రీ సదస్సులు, గ్రామ సందర్శన కార్యక్రమాలు, రైతులకు ఉచిత విత్తనాల పంపిణీ, మహిళలకు 'ఉచిత నర్సింగ్ శిక్షణ' ...ఇలా అనేక రకాల పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నాడు.

ఒడిశా రాష్ట్రంలో కార్పెట్ సెక్యూరిటీని విస్తరింపజేయడంలో భాగంగా కటాఫ్ ప్రాంతంలో నూతనంగా గొనబెడ, జొంత్రి గ్రామాలలో పోలీసు క్యాంపులు నెలకొల్పాడు. ఏరియాలలో పార్టీ, దళాల కదలికలు లేకపోయినప్పటికీ, ప్రజా నిర్మాణాలపై, ప్రజలపై ఒత్తిడి పెంచడానికి నిరంతరం కూంబింగ్ ఆపరేషన్స్‌ను కొనసాగిస్తున్నాడు. 1+2 టీంలను దెబ్బతీయడానికి ఇన్‌ఫార్మర్లు, కోవర్టుల సాయంతో దాడులకు దిగుతున్నాడు. గ్రామాలలోని పార్టీ, ప్రజాసంఘాల, మిలీషియా నాయకులను అరెస్టు చేసి, ప్రజలకు నాయకత్వం లేకుండా చేసి, ప్రజల్ని లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా పార్టీ నిర్మాణాలలో పనిచేస్తూ, రాజకీయంగా బలహీనపడిన సంఘకార్యకర్తలను కొద్దిమందిని ద్రోహులుగా తయారు చేసుకొని వారు ఇచ్చిన సమాచారం ద్వారా గాలికొండ ఏరియా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ రామె, దళ సభ్యురాలు కామ్రేడ్ సంగీత, పూర్తికాల కార్యకర్త దేవెలను సప్పర్ల సమీపంలోని దారిలో ఆంబుష్ పెట్టి నిరాయుధంగా ఉన్న ఈ ముగ్గురిని అరెస్టు చేసి, వారాల తరబడి చిత్రహింసలకు గురిచేసి, తప్పుడు కేసులు బనాయించి జైళ్ళో పెట్టారు.

పై సంఘటన జరిగిన కొద్ది రోజులకే పెదబయలు-కోరుకొండ ఏరియాలో ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో ఏరియా కమిటీ సభ్యుడు

కామ్రేడ్ సుందర్‌రావును అరెస్ట్ చేసి, నెలరోజులకుపైగా కస్టడీలో ఉంచుకొని, చిత్రహింసలకు గురిచేసి, పదుల సంఖ్యలో కేసులు పెట్టి జైళ్ళో పెట్టారు.

– 2022 ఏప్రిల్ 9న పెదబయలు ప్రాంతంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు నిమ్మతోం గ్రామంలో రాత్రి విశ్రాంతి తీసుకుంటుండగా ఒక ప్రజాద్రోహి ఇచ్చిన సమాచారంతో సీనియర్ ఏరియా కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావును గ్రామాన్ని చుట్టుముట్టి పట్టుకొని జైలుకు పంపారు.

– విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, ఇంజెరి పంచాయితీ, కోంద్రు గ్రామాన్ని చుట్టుముట్టి గతంలో పోలీసులు అనేకసార్లు సంఘనాయకులను పట్టుకోవడానికి ప్రయత్నం చేసారు. అయినప్పటికీ సంఘనాయకులు తప్పించుకున్నారు. పకడ్బందీగా మరోసారి ప్లాన్ చేసుకొని..... రాత్రికిరాత్రే గ్రామాన్ని చుట్టుముట్టి తెల్లవారురూమున కాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పులలో గాయపడ్డ సంఘకార్యకర్త సన్యాసిరావును పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్ళారు.

– దీర్ఘకాలంగా శతృవు ముఖ్య టార్గెట్‌గా ఉన్న కోంద్రు గ్రామానికి చెందిన అశోక్‌ను శతృఏజెంట్ల ద్వారా మోసగించి ఒక పథకం ప్రకారం పక్క సమాచారంతో 2022 జూన్ ....అరెస్టు చేసి, 124 వివిధ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆ తర్వాత కోంద్రు గ్రామంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను సైతం బెదిరించి, భయభ్రాంతులకు గురి చేసి, ప్రజానిర్మాణాలలో పని చేస్తున్న సుమారు 60 మందికి పైగా కార్యకర్తలను సరెండర్ చేయించుకున్నాడు. ఈ అరెస్టు, సరెండర్ల సందర్భంగా పార్టీకి సంబంధించిన లక్షలాది రూపాయలనూ, పేలుడు పదార్థాలను కూడా శతృవు స్వాధీనం చేసుకున్నాడు.

– ఎమ్‌కేబీ డివిజన్, జొడాంబ పంచాయితీ, జాంపుర్ల గ్రామానికి చెందిన సంఘ నాయకుడు మిశ్రోను అరెస్టు చేసి తప్పుడు కేసులు పెట్టి మల్కనగిరి జైళ్ళో పెట్టారు.

– ఒంద్రపల్లి పంచాయితీ, ఒరపొదూర్ గ్రామానికి చెందిన సంఘ నాయకుడు కామ్రేడ్ బొగొను అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి, అనేక తప్పుడు కేసులు బనాయించి పెట్టి జైళ్ళో పెట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తల ఇళ్ళపైనా ఎన్ఐఏ దాడులు చేసి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి, సోదాలు నిర్వహిస్తూ, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, సాహిత్యం స్వాధీనం చేసుకుంది. కొందరిపై కుట్రకేసులు మోపి, అక్రమంగా జైళ్ళలో నిర్బంధించి, వారికి బెయిళ్ళు కూడా నిరాకరించి, వారిని శారీరకంగా, మానసికంగా కృంగదీయాలని చూస్తున్నారు.

ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని కొండలు, గుట్టలతో కూడిన వెనకబడిన ప్రాంతాలలో వ్యవసాయం నేటికీ వర్షధారంపై ఆధారపడి కొనసాగుతున్నది. దానికితోడు భారీ డ్యాంల నిర్మాణం మూలంగా వందలాది గ్రామాలు ముంపుకుగురై, వేలాది మంది ప్రజలు నిర్వాసితులు గావించబడ్డారు. ప్రభుత్వం ఈ ప్రాంత వ్యవసాయం, ప్రజల సంక్షేమంపట్ల తీవ్రమైన నిర్లక్ష్యం వహించడంతో ఉపాధిలేక ప్రతి సంవత్సరం వేలాది మంది యువతీ, యువకులు పక్క రాష్ట్రాలకు వలసకూలీలుగా వెలుతున్నారు. ప్రత్యామ్నాయంగా కొద్దిమంది ప్రజలు కొంతకాలం నుండి జీవనోపాధి కోసం గంజాయిసాగును చేపట్టారు. దీనిని మాన్పించడానికి పార్టీ ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ గంజాయి సాగును నియంత్రించడానికి కృషి చేస్తూ వచ్చింది. ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులు గంజాయి వ్యాపారుల నుండి పెద్ద ఎత్తున మామూలు వసూలు చేసుకొని గంజాయి సాగును ప్రోత్సహించారు. అందులో నుండి కొంతమంది లంపెన్‌లను ఇన్‌ఫార్మర్లుగా కూడా మలుచుకున్నారు.. గంజాయిసాగు ద్వారా రైతులకన్నా దళారీలు, పోలీసు ఉన్నతాధికారులే ఎక్కువగా లాభపడ్డారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయకుండా, ప్రజలకు ఉపాధి కల్పించకుండా ఉన్నట్టుండి ఈ మధ్య పోలీసు బలగాలను పంపి గంజాయిసాగు చేస్తున్న రైతులపై, వారి పంటపొలాలపై దాడులకు పూనుకున్నది. దీనికి 'పరివర్తనా కార్యక్రమం' అని ముద్దుపేరు తగిలించింది. ఈ పేరుతో చేస్తున్న పోలీసు దాడులలో సాధారణ ప్రజలు సైతం వేధింపులకూ, దాడులకు గురయ్యారు. ప్రజల ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. ఈ దాడుల అసలు లక్ష్యం ఈ ప్రాంతంలో కొనసాగుతున్న విప్లవోద్యమంలో ప్రజలు క్రియాశీలకంగా పాల్గొంటూ, ప్రభుత్వ విధానాలనూ, పోలీసు దాడులను ప్రతిఘటిస్తున్నారనే కక్షసాధింపులో భాగమే అనేది ప్రజలు గ్రహించలేనిది కాదు.

మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్‌లోని బలిమెల రిజర్వాయర్‌పై గురుప్రియ బ్రిడ్జి నిర్మాణం చేయడం ద్వారా కటాఫ్ ఏరియా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం, పోలీసుల చేసిన ప్రచారాన్ని ప్రజలు వ్యతిరేకించినా, లెక్క చేయకుండా సాయుధ పోలీసు బలగాల రక్షణలో గురుప్రియ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసారు. నిర్మాణం పూర్తయి మూడు సంవత్సరాలు గడిచింది. అయితే ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి అంటే కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా కొత్తగా 5 పోలీసు క్యాంపులు నిర్మాణం చేసి ఇక్కడ జరుగుతున్న సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేసి, అనేక మందిని అరెస్టులు చేసి, జైళ్ళపాలు చేసి, గతంలో ప్రజలకు లొంగిపోయిన భూస్వాములకూ, ప్రజావ్యతిరేకులకు రక్షణ కల్పించడం మాత్రం జరిగింది తప్ప, ప్రజలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న మౌలిక సమస్యలతోపాటు, ప్రాథమిక అవసరాలైన త్రాగునీరు, విద్య, వైద్యం లాంటి సమస్యలు కూడా నేటికీ పరిష్కారం కాలేదు. దానితో ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్నీ, పోలీసులను ఈ ప్రాంత అభివృద్ధి గురించి మీరు చెప్పిన కల్లబొల్లి మాటలు ఏమయ్యాయని నిలదీస్తూ ఆందోళన బాట పట్టారు.

చిత్రకొండ బ్లాక్‌లోని అనేక గ్రామాలపై నిరంతరం పోలీసులు కొనసాగిస్తున్న దాడులు, అక్రమ అరెస్టులు, జైళ్ళు నిర్బంధాలతో ప్రజల ప్రశాంత జీవనానికి అడుగడుగున ఆటంకాలు, అవరోధాలు కల్పిస్తూ భయాందోళనకు గురిచేసి ప్రజలను లొంగదీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒక రకంగా ఈ ప్రాంతమంతా అర్ధసైనిక బలగాలతో నింపివేసి, తుపాకుల నీడలో ప్రజల బ్రతుకులను బంధించారు. దానితో ప్రజలు తమ పోరాట విజయాలను కోల్పోవడం, ప్రభుత్వం పాత భూస్వామ్య, తెగ ఆధిపత్యాన్ని ముందుకు తేవడంతో దానికి లొంగి ఉండటానికి సిద్ధంగా లేని ప్రజలు ప్రభుత్వంపై, పోలీసులపై తీవ్రమైన వర్గకసిని పెంచుకున్నారు. ఇందులో భాగంగానే జూన్ 20న చిత్రకొండ బ్లాక్‌లోని అనేక గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు పోలీసుల దాడులను నిరసిస్తూ, చిత్రకొండ బ్లాక్‌కు భారీ ఊరేగింపుగా వెళ్ళారు. ఈ ఊరేగింపును పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, కోపోద్రిక్తులైన ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో చిత్రకొండ పోలీసు

స్టేషన్‌పై దాడి చేయగా, స్టేషన్‌లో ఉన్న పోలీసులు కాలికి బుద్ధిచెప్పి పారిపోయారు. దానితో పోలీసుస్టేషన్‌లోని వాహనాలనూ, పర్నీచర్‌నూ, పోలీసు రికార్డులను ధ్వంసం చేసి తమ నిరసనను తెలియజేసారు.

మల్కనగిరి, కొరాపుట్, సరిహద్దులోని మట్టికల్ గ్రామంపై అర్ధరాత్రి మల్కనగిరికి చెందిన సాయుధ పోలీసులు దాడి చేసి, ఇళ్ళల్లో సోదాల పేరుతో ప్రజల డబ్బులు, విలువైన సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. అడ్డుకున్న మహిళలపై దాడికి దిగారు. ఆ సమయంలో గ్రామంలో పురుషులెవరూ లేరు. మహిళలే పోలీసులను ప్రతిఘటించారు. అర్ధరాత్రి గ్రామంలో మహిళలు చేస్తున్న అరుపులు విని ఆ సమయంలో జీడిమామిడి తోటకు కాపలా ఉన్న పురుషులు సాంప్రదాయక ఆయుధాలతో పరుగెత్తుకొని వచ్చి, పోలీసులపై దాడి చేయడంతో ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ పారిపోయారు. ఆ సమయంలో ప్రజలు ఒక పోలీసును పట్టుకొని గ్రామంలో బంధించారు. తెల్లవారి మాఛ్‌ఖండ్ పోలీసులు గ్రామానికి వచ్చి దారితప్పి మా మల్కనగిరి పోలీసులు మీ గ్రామానికి వచ్చారనీ, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని క్షమాపన చెప్పి ప్రజలచేతిలో బంధీగా ఉన్న పోలీసును విడిపించుకొని వెళ్ళిపోయారు. ఇలా ప్రజలపై, గ్రామాలపై పోలీసులు దాడులు చేసిన అనేక సందర్భాలలో ప్రజలు వివిధ రూపాలలో ప్రతిఘటిస్తూనే ఉన్నారు.

నేడు ఏఓబీలో కొనసాగుతున్న వ్యూహాత్మక 'సమాధాన్-ప్రహార్' సరికొత్త రూపాలలో నిర్ధయాత్మక దాడిగా కొనసాగుతూ, తాత్కాలికంగా ఏఓబీ విప్లవోద్యమానికి కొన్ని నష్టాలను కలుగజేసినప్పటికీ, ఈ ప్రాంత పీడిత ప్రజలకు నాలుగు దశాబ్దాల వర్గపోరాట అనుభవంతోపాటు, దాని వెన్నంటి అమలు జరిగిన శతృవు క్రూరమైన దాడులను ఓడించిన అనుభవం కూడా కలిగి ఉన్నారు. ప్రస్తుత ఈ దాడిని ప్రతిఘటించి ఓడించడానికి పార్టీ, పీఎల్‌జీఏ నాయకత్వంలో తమ శక్తిమేరకు వివిధ రూపాలలో ఎదుర్కొని ప్రతిఘటించి తీరతారు. తిరిగి తాత్కాలికంగా దెబ్బతిన్న విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోతారు.

**"దేశవ్యాప్తంగా సామాన్య ప్రజానీకాన్ని సమీకరించడం అనేది ఒక విశాలమైన సముద్రాన్ని సృష్టిస్తుంది. అది శత్రువును ముంచేస్తుంది. మనం ఆయుధాల విషయంలో కింది చేయిలో ఉండటం, తదితర విషయాలను సర్దుబాటు చేసే పరిస్థితిని సృష్టిస్తుంది. యుద్ధంలోని ప్రతి కష్టాన్ని అధిగమించడానికి కావాల్సిన ముందు షరతులను సృష్టిస్తుంది... విప్లవాన్ని కోరుకుంటూనే రాజకీయ సమీకరణను నిర్లక్ష్యం చేయడం 'రథాన్ని ఉత్తరానికి నడుపుతూ దక్షిణానికి పోవాల'ని కోరుకోవడం వంటిదే. దీని ఫలితంగా అనివార్యంగా విజయాన్ని వదులుకోవడమే అవుతుంది"**

*- కామ్రేడ్ మావో*

## 2022 జులై 28 నుండి ఆగష్టు 3 వరకు ఏఓబీ జోన్‌వ్యాప్తంగా

## అమరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరపండి!

## భారత విప్లవోద్యమ నిర్మాతలు కామ్రేడ్ చారుమజుందార్ 50వ,

## కామ్రేడ్ కన్హాయ చటర్జీ 40వ వర్ధంతులను గొప్ప విప్లవ స్ఫూర్తితో నిర్వహించండి!!

## శత్రు 'సమాధాన్-ప్రహార్' దాడులను ఓడిస్తూ,

## భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయలక్ష్యంతో పురోగమించండి!!!

**ప్రియమైన ప్రజలారా!**

"ప్రజల కోసం మరణించడం హిమాలయ పర్వతాలకన్నా ఉన్నతమైనది, దోపిడీ వర్గాల కోసం మరణించడం కోడిఈక కన్నా తేలికైనది" అని కామ్రేడ్ మావో అన్నారు. మానవులకు అన్నింటికంటే అత్యంత విలువైనది ప్రాణమే. అయినప్పటికీ, దోపిడీ రహిత సమాజ నిర్మాణంకోసం, ప్రజా ప్రయోజనాల కోసం విప్లవకారులు సంపూర్ణంగా అంకితమవుతూ, తమ లక్ష్య సాధన కోసం తమ ప్రాణాలతోపాటు సర్వస్వాన్ని అర్పిస్తారు. సమాజంలో ప్రతి గొప్ప మార్పు త్యాగాన్ని కోరుకుంటున్నదనేది ఒక చారిత్రక వాస్తవం. ఈ విషయం గత వర్గ సమాజాలు ఏర్పడినప్పటి నుండి నేటి వరకు రుజువవుతూనే ఉన్నది.

మన దేశంలో మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుండి మొదలుకొని, గత 50 సంవత్సరాలకుపైగా కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో పార్టీ అత్యున్నత నాయకత్వం నుండి సామాన్య కార్యకర్తలు, విప్లవ ప్రజానీకం వరకు వేలాది మంది ఈ దేశ ఉన్నత పుత్రులు, పుత్రికలు తమ విలువైన జీవితాలను త్యాగం చేస్తూ, మనకందరికీ ఆదర్శంగా నిలిచారు. మన పార్టీ సంస్థాపకులు, గొప్ప నాయకులు, ఉపాధ్యాయులు కామ్రేడ్ చారుమజుందార్ అమరులై నేటికీ 50 సంవత్సరాలు, కామ్రేడ్ కన్హాయ చటర్జీ అమరులై నేటికీ 40 సంవత్సరాలు కావస్తున్నది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సైద్ధాంతిక వెలుగులో భారతదేశ నిర్దిష్ట స్వాభావిక లక్షణాలపై ఆధారపడి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలనే సరైన విప్లవ పంథాను ఆవిష్కరించారు. విప్లవ ఆచరణ ద్వారా రివిజనిజంతో నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకొని పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకంగా ప్రజలను విప్లవ మార్గంవైపు నిలబెట్టారు. ఆ మహనీయులు అందించిన స్ఫూర్తితో నేడు మన పార్టీ దేశవ్యాప్తంగా పురోగమిస్తూ, నూతన సమాజ నిర్మాణానికై పునాదులు వేసింది. ఈ సందర్భంగా ఆ కామ్రేడ్స్ యొక్క త్యాగాలనూ, ఆదర్శాలనూ, కార్మికవర్గ విలువలను ఎత్తిపడుతూ వాళ్ళ లక్ష్యాన్ని సాధించేవరకు సాహసోపేతంగా పోరాడుదాం.

గడిచిన సంవత్సర కాలంలో భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేసే లక్ష్యంతో శత్రు బహుముఖ దాడులను దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా ఓడిస్తూ 124 మంది కామ్రేడ్స్ తమ విలువైన ప్రాణాలను ధారపోసారు. ఇందులో మన కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ తపన్‌దా, చింతన్‌దా, అంబర్‌దా, సాకేత్‌దాలు తీవ్రమైన అనారోగ్యానికి గురై అమరులుకాగా, కామ్రేడ్ దీపక్‌దా శత్రుదాడిని వీరోచితంగా ప్రతిఘటిస్తూ, తమ ప్రాణాలను అర్పించారు. పై అమరులందరూ మనకు ఆదర్శప్రాయులే.

నిర్దిష్టంగా మన ఏఓబీ జోన్‌వ్యాప్తంగా ఈ కాలంలో 12 మంది కామ్రేడ్స్ దోపిడీ పాలకవర్గాలు మనపై కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్-ప్రహార్' దాడులను ప్రతిఘటిస్తూ అమరులైనారు. సెట్‌బ్యాక్‌కు గురైన ఏపీ, ఏఓబీ ఉద్యమాలకు సైద్ధాంతిక-రాజకీయ గైడెన్స్‌నందిస్తూ చివరి క్షణం వరకు ఆ ఉద్యమ పునర్నిర్మాణం కోసం కృషి చేస్తూ, వచ్చిన కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ (సాకేత్)తోపాటు, డివిజనల్ కమిటీ సభ్యులు కామ్రేడ్స్ రణదేవ్, అశోక్, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ అంజన్న, పాయికే, సోనీ, పార్టీ సభ్యులు కామ్రేడ్స్ చైతే, లలిత, ఆజాద్ ఉన్నారు. వీరితోపాటు, తమ కుటుంబాన్నీ, పిల్లల్ని విప్లవోద్యమాలకు అంకితం చేసిన త్యాగశీలి కామ్రేడ్ ఆలూరి లలిత, జననాట్యమండలి విప్లవ సాంస్కృతిక కళాయోధుడు, డప్పును ఆయుధంగా మలుచుకొని దోపిడీవర్గాల గుండెల్లో దండయాత్ర చేసిన కామ్రేడ్ డప్పు రమేష్ అమరత్వం మనకందరికీ ఆదర్శమే.

పై అమరులందరు ఈ దోపడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ 'సమాధాన్-ప్రహార్' దాడులను తిప్పికొట్టే క్రమంలో తన ప్రాణాలు ధారపోసిన మృత్యుంజయులు. వీళ్లందరూ ఉద్యమంలో ఎదురయ్యే అనేక ఆటుపోట్లనూ, ఎగుడుదిగుడులనూ, పురోగమన-తిరోగమనాలను గతితార్కిక పద్ధతితో అర్థం చేసుకుంటూ ప్రజల, పార్టీ ప్రయోజనాలే తమ ప్రయోజనాలుగా ఎంచి నిస్వార్థంగా పని చేస్తూ, అత్యున్నత కమ్యూనిస్టు విలువలనూ, ఆదర్శాలను నెలకొల్పారు. ప్రజాయుద్ధంలో అసువులు బాసిన మన ప్రియతమ కామ్రేడ్స్ అందరికీ పేరుపేరున ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. సోషలిజం, కమ్యూనిజం లక్ష్యంతో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేందుకు అమరులు చూపిన అరుణారుణ బాటలో తుదివరకు పోరాడుతామని శపథం చేద్దాం. వాళ్ళు చూపిన చొరవ, త్యాగనిరతి, ధైర్య సాహసాల నుండి స్ఫూర్తి పొందుతూ బోల్షివిక్ స్పిరిట్‌తో సెట్‌బ్యాక్‌కు గురైన మన జోన్ ఉద్యమాన్ని పురోగమింపజేసే కృషిని కొనసాగిద్దాం.

రెండు విప్లవ ప్రవంతులు ఐక్యమై సీపీఐ(మావోయిస్టు)గా ఏర్పడిన నాటి నుండి మన పార్టీపై పాలకవర్గాలు తీవ్రమైన అణచివేత దాడిని కొనసాగిస్తూ వస్తున్న విషయం మనకు తెలిసినదే. పై నేపథ్యంలో గత రెండు సంవత్సరాలుగా మన జోన్ ఉద్యమాన్ని శత్రువు నిర్మూలించే లక్ష్యంతో బహుముఖ

పద్ధతుల్లో తన దాడిని తీవ్రతరం చేసాడు. శతృవు కొనసాగిస్తున్న ఈ నిర్మూలన దాడిని మనం గతితార్కిక పద్ధతిలో విశ్లేషించుకుంటేనే సరైన అంచనాకు రాగలుగుతాం. నేడు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదుల ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరమై వాటి నుండి బయటపడేందుకు ప్రపంచంలో ఉన్న ఆర్థిక వనరులనూ, పీడిత ప్రజలను మునపెన్నడూ లేనంత ఎక్కువగా దోచుకోవడానికి అత్యంత దూకుడుగా ముందుకు వస్తున్నారు. మరోవైపు దోపిడీ విధానాలను వివిధ పద్ధతుల్లో ప్రజలు ప్రతిఘటిస్తూ వస్తున్నారు. తమ దోపిడీ విధానాలకు ప్రజా పోరాటాలు ఆటంకంగా మారడంతో, వాటిని ఫాసిస్టు పద్ధతుల్లో అణచివేసే లక్ష్యంతో దోపిడీవర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల పాదసేవయే పరమార్ధంగా భావించిన నరేంద్రమోడీ ప్రభుత్వం, గత 8 సం॥రాలుగా దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తూ వస్తున్నది. పైగా 'నయాభారత్' పేరుతో దేశంలో హిందూ ఫాసిస్టు విధానాలను అమలు పరుస్తున్నది. పెద్దనోట్లరద్దు, జీఎస్‌టీ, 370 ఆర్టికల్ రద్దుతో కశ్మీర్ ప్రజల స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, కార్మిక చట్టాలు రద్దు చేయడం, రైతువ్యతిరేక చట్టాలను ముందుకు తేవడం, అగ్నిపథ్ పేరుతో నిరుద్యోగ యువతరం జీవితాలను ఇక్కట్లపాలు చేయడం ఇలా అనేక రకాల ప్రజావ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుంది. పై విధానాలను వ్యతిరేకించే వాళ్ళపై ఉగ్రవాదులనీ, అర్బన్ నక్సలైట్లనీ, దేశ ద్రోహులని ముద్రవేసి వాళ్ళపై వివిధ చట్టాలను ప్రయోగించి అరెస్టులు చేయడం, వాళ్ళ ఆస్తులను బుల్డోజర్‌తో కూల్చివేయడం నేడు దేశంలో సర్వసాధారణ అంశంగా మారిపోయింది.

ఇకపోతే ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల్లో అధికారం ఎలగబెడుతున్న జగన్, నవీన్‌పట్నాయక్ ప్రభుత్వాలు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, భూస్వామ్య ప్రయోజనాలను కాపాడటంలో అత్యంత ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వాళ్ళు ఏనాడు వ్యతిరేకించకుండా వాటిని మనసుకు హద్దుకొని ఆహ్వానించి అమలు చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో ఉన్న అత్యంత విలువైన ఖనిజ, ఇతర విలువైన సంపదలను కారుచౌకగా దోపిడీవర్గాలకు అప్పజెప్పేందుకు అనేక ఒప్పందాలు చేసుకుంటున్నారు. మరోవైపు రెండు రాష్ట్రాల్లో కూడా పేదరికం, నిరుద్యోగం, ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రజల తలలపై అనేక లక్షల, కోట్ల రూపాయాల అప్పులు కుప్పలు కుప్పలుగా పెంచుతున్నారు. చేసిన అప్పుల వడ్డీల కోసం మరళ అప్పులు చేయాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. పాలకవర్గాలు కొనసాగిస్తున్న దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ అనేక వర్గాల ప్రజలు ఉద్యమాలు చేపడుతున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం' కోసం ప్రజలు మిలిటెంట్‌గా ఉద్యమాలు చేపడుతున్నారు. పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణచివేసే లక్ష్యంతో పాలకవర్గాలు పెద్ద ఎత్తున అమానుష చర్యలకు పూనుకుంటున్నాయి. అందులో భాగంగా మన ఉద్యమ ప్రాంతంలో పదుల సంఖ్యలో పోలీసు క్యాంపు నిర్మాణాలు ఏర్పాటు చేయడం, కమాండో బలగాలను ఆధునీకరించడం, ఉద్యమకారుల సమాచారం తెలుసుకోవడం కోసం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం, నిరంతరం ప్రజలను బయపెట్టే విధంగా కూంబింగ్స్ నిర్వహించడం నేడు ఉద్యమ ప్రాంతంలో సర్వసాధారణంగా కొనసాగుతున్నది. మరోవైపు ప్రజలను మబ్బ్యపెట్టడానికి సంస్కరణలు అమలు చేయడం, రోడ్లు, సెల్‌టవర్స్, సెల్‌ఫోన్స్ పంపిణీ చేసి ప్రజలను అభివృద్ధిపదంలో ముందుకు తీసుకుపోతున్నామని గోబెల్స్ ప్రచారానికి పూనుకోవడం నేడు పాలకవర్గాలు అనుసరిస్తున్న ఎత్తుగడలుగా మనం చూడాలి.

## ప్రియమైన ప్రజలారా!

గత నాలుగు దశాబ్దాలకు పైగా మన ఉద్యమ ప్రాంతంలో ప్రజలు సమరశీల పోరాటాలు చేపట్టి అనేక విజయాలు సాధించిన చరిత్ర ఉంది. 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజాకమిటీలకే సర్వాధికారాలు' లక్ష్యంతో భూస్వామ్య, ఫారెస్టు, బంజరు, దేవాలయాలకు చెందిన లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నాం. అనేక విప్లవ ప్రజాకమిటీలను నిర్మించి గ్రామస్థాయిలో బీజప్రాయంలో ప్రజారాజ్యాధికారాన్ని స్థాపించాం. 'మా అడవి మా అధికారం' పేరుతో లక్షల, కోట్ల విలువైన అటవీ, ఖనిజ సంపదను కాపాడుకుంటున్నాం. దీనిని సహించలేని దోపిడీవర్గాలు మన పోరాటాలపైనా, ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మన పార్టీపైన కక్షకట్టి నిర్మూలించే లక్ష్యంతో దాడులను చేస్తున్నారు. అయితే ప్రజా పోరాటాలను అణచివేయడానికి దోపిడీ పాలకవర్గాలు ఎంతటి క్రూరమైన అణచివేతకు పాల్పడినా, అంతిమంగా అది విఫలం కాక తప్పదని చరిత్ర పదే పదే రుజువు చేసింది. ఈ అనుభవంతో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో పాలకవర్గాలు అమలు చేస్తున్న ఆపరేషన్ 'సమాధాన్-ప్రహార్' దాడులను ఓడిస్తూ, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దామనే లక్ష్యంతో అమరుల స్మారకవారాన్ని జోన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిద్దాం. మన ప్రియతమ కామ్రేడ్స్ గొప్ప త్యాగాలను ప్రచారం చేద్దాం. అమరులకు గుర్తుగా స్థూప నిర్మాణాలు, పోస్టర్స్, కరపత్రాల ద్వారా ప్రచారం కొనసాగిద్దాం. అమరుల త్యాగం, ధైర్య సాహసాలు, దృఢసంకల్పం తదితర ఆదర్శాలను స్మరించుకుంటూ అమరుల బాటలో ముందుకు సాగుదామని ప్రతిన బూనుదాం.

- ✡ **అమరులకు జోహార్లు!**
- ✡ **అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!**
- ✡ **ఆపరేషన్ 'సమాధాన్-ప్రహార్' వ్యూహాత్మక దాడులను ఓడిద్దాం!**
- ✡ **'నూతన ప్రజాస్వామిక విప్లవం' వర్ధిల్లాలి!**
- ✡ **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!**

**ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**


కామ్రేడ్ సాకేత్
(అక్కిరాజు హరగోపాల్)
కామ్రేడ్ రణదేవ్
(మాడివి ముఖేష్)
కామ్రేడ్ అశోక్
(సందె గంగన్న)
కామ్రేడ్ అనీల్
(సోడి మూక)
కామ్రేడ్ సోని
(వెకొ పారో)
కామ్రేడ్ అంజన్న
(పిడిసె సన్ను)
కామ్రేడ్ కద్తి పాయికే
కామ్రేడ్ లలిత
(కెల్లో తెల్లమ్మ)
కామ్రేడ్ మడకం చైతే
కామ్రేడ్ ఆజాద్
(గెమ్మెల చిన్నారావు)
2022 జులై 28 నుండి
ఆగస్టు 3 వరకు
ఏఓబీ జోన్ వ్యాప్తంగా
అమరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరపండి!
శత్రు 'సమాధాన్-ప్రహార్' దాడులను ఓడిస్తూ
భారత నూతన ప్రజాస్వామిక
విప్లవ విజయ లక్ష్యంతో పురోగమించండి!
ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)